భారతి

1967 జనవరి

★

ప్రపంచ సాహిత్యంలో యువతరం

తిరుగుబాటు

"నిఖిలేశ్వర్"

చీకటిగదులు

"త్రిపుర"

కుందమాల

శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

★

వ్యవస్థాపకులు

దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

వెల ఒకరూపాయి

భారతి

మాసపత్రిక

★

సంపాదకుడు:

శివలెంక శంభుప్రసాద్

★

జనవరి 1967

★

సంపుటము 44 : : సంచిక 1 :

విడిపత్రిక వెల ఒక రూపాయి

త్రిరేఖ

విషయానుక్రమణిక

జనవరి 1967

★

★

స్వవిషయము

"భారతి"కి 44 వ సంవత్సరము ఆరంభమైనది. నాలుగు దశాబ్దములు పైగా నిరాఘాటముగా సాహిత్యసేవ చేయగలిగినందుకు "భారతి" గర్విస్తున్నది. ఆనందిస్తున్నది. ఇక ముందుకూడా ఇతోధికముగా సాహిత్యసేవ చేయగలనను దృఢనిశ్చయముతోను, దృఢసంకల్పముతోను వున్నది. ఆ సంకల్ప సాధనకు రచయితల సహకారము పూర్తిగా లభించగలదని ఆశిస్తున్నది. సహకరించిన వారందరికీ కృతజ్ఞత తెలుపుతున్నది.

మంచి ప్రశ్న

"తల్లావజ్ఝల"

లౌకికుడు

"బ్రహ్మవేత్తల్ కదా పల్కరే పాడరే
బ్రహ్మ సందర్భమున్ పద్యమో పాటయో?"

జ్ఞాని

"నిక్కముం దెల్పుచో నీదు ప్రశ్నంబులో
పెక్కుచిక్కుల్ సుమీ పిన్న

యోగ్యుడు

బ్రహ్మసందర్భముల్ పల్క బెట్టుల్ సఖా!
బ్రహ్మవేత్తల్ సహా స్పష్ట మౌ వైఖరిన్!?

జ్ఞాని

నామరూపంబు లెన్నండు లేనట్టి దా
భూమ మౌ తత్త్వ మీబుద్ధికిం దోచునే?
దేని యోచించినన్ దీర్ఘకాలంబునన్
మానసాతీత మౌ మాట కేరీతిగా
దాని వర్ణింపగా ధైర్య మే ముండునో!
మౌనమే వ్యాఖ్యగా మాన్యులే పల్కరే!

లౌకికుడు

అంతయున్ బ్రహ్మమే యందురే పండితుల్
చింతకున్ సుంతయున్ చిక్కకున్నన్ సదా!

జ్ఞాని

నిత్య మౌ బ్రహ్మమున్ విష్ణుతో నెంచుచో
సత్యముం గాంచగా సజ్జనుల్ నేర్తురే

లౌకికుడు

ధ్యేయ మౌ బ్రహ్మమున్ ధీయుతుల్ సైతమున్
గేయ పద్యంబులన్ కీర్తనల్ చేయరా?

జ్ఞాని

బ్రహ్మ మైనను తత్పదార్థంబు కాని
పట్టువడుచుండు ఖండరూపమ్ము దాల్చి:
ఉక్తిజాలంబునన్ మహాయోగికవులు
చిన్నిసంకేతములతోడ చెప్పగలరు

ఇటి సూత్రమ్ములన్ గ్రహియింప లేరు
అఖిలజనములు విద్వాంసు లైన గాని ,
వ్యాఖ్య లెన్నియొ వివరింప వలయువాని
సులువుకాదంతరార్థమ్ము తెలిసికొనుట

కవులు సామాన్యవాక్కుల కవిత చెప్పి
ప్రజకు హృదయంగమము చేయ పాటుపడుదు
రందు దోచును ఖండసత్యమ్మె, కాన
కథయొ వర్ణనమో యుండు కవితయందు

కుందమాల

శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

"అయ్యా, ఎవరు మీరు?"

"తల్లీ, మీ తండ్రికి చిరమిత్రుణ్ణి—దశరథ మహారాజుకు—బాలసఖుణ్ణి వాల్మీకిని.. పయివాడను కాను. నీకు తండ్రినీ.. మామనుకూడా నమ్మా!"

"ఆర్యా, నమస్కారం"

"బిడ్డా వీరులకు తల్లి వవుతావు—భర్తను తప్పక తిరిగి చూడగలుగుతావు."

"ఆర్యా, నీవు లోకానికి వాల్మీకివి—కాని నాకు తండ్రివే, కనుక మీ ఆశ్రమానికి పోదాం పద. (గంగానది నుద్దేశించి) అమ్మా భాగీరథీ! నేను సుఖంగా ప్రసవిస్తే దినదినమూ చక్కగా గుచ్చి మల్లెదండ ఒకటి నీకు సమర్పించుకుంటాను."

ఇట్లా ఆ సంస్కృత నాటకానికి ఆ పేరు వచ్చింది. (కుందమాల.)

ఆ నాటకరచయిత సుప్రసిద్ధ బౌద్ధపండితుడు కవి అయిన దిఙ్నాగాచార్యుడు.

సంస్కృతసాహిత్యంలో ఉత్తరరామాయణేతి వృత్తంతో వ్రాసిన నాటకాల్లో భవభూతి ఉత్తరరామచరిత్ర దిఙ్నాగుని కుందమాల ప్రముఖమైనవి. కాని—ఉత్తరరామచరితకు లభించిన ప్రచార ప్రశంసలు కుందమాలకు రాలేదు. 1923 వరకు ఈగ్రంథం వెలుగు చూడలేదు. దక్షిణదేశపు అపూర్వ గ్రంథాన్వేషణలో బయటపడ్డ గ్రంథాల్లో ఇది ఒకటి. శ్రీ మానవిల్లి రామకృష్ణకవిగారూ, శ్రీ కె. రామనాథశాస్త్రి గారూ ఈ నాటకాన్ని సంపాదించి వదాన్యశ్రీ కాశీనాథుని నాగేశ్వరరావుపంతులుగారి సహాయసంపత్తితో దక్షిణభారతీగ్రంథమాలలో 2 పుష్పంగా ప్రచురించారు. కాని—ఆ పుస్తకంలోని పాఠాలుకొన్ని వారికే తృప్తి కలిగించలేదు. అక్కడక్కడ కొన్ని సంస్కృతప్రాకృత వాక్యాలు, శబ్దాలు అనన్వితాలుగానే ఉండిపోయాయి. వాటిని అట్లా విడిచిపెడితే—ఈ నాటకప్రశస్తి అమోఘంగా కనపడుతుంది. భవభూతి ఉత్తరరామచరితకు ఆధారభూమియై అతణ్ణి ఉత్తేజితుణ్ణిచేసి అతనిచేత అంత గొప్పనాటకాన్ని వ్రాయించిందంటే ఈ నాటకశక్తి ఎంతటిదో ఊహించవచ్చు.

ఆచార్య దిఙ్నాగుడు తన నాటకానికి కుందమాల అని పేరుపెట్టి వ్యంగ్య సుందరమైన తన కళాశీలితను ప్రకటించాడు. నాటకరచనలో ఈయన రూపకపితామహుడు భాస మార్గానుయాయి. సంభాషణలలోని గడుసుపోకడలు, చురుకు, రసనిర్భర సన్నివేశకల్పనములు, అతిప్రసన్న రచనాశైలి, అపూర్వ భావచిత్రణములు మున్నగు విషయములలో ఈతడు భాసరచనాభోగము నుండి బలమైన స్ఫూర్తిని స్వీకరించినట్లు కనపడుతుంది. ఉత్తరరామకథలో దిఙ్నాగుని కుందమాల కల్పన మిక్కిలి చమత్కారమైనది.

సీత సభక్తికంగా గంగానదికి సమర్పించే కుందమాల తలవనితలంపుగా రాముని కంటబడి సీతాహస్తరచనా నైపుణిని తలంపునకు దెచ్చి ఆ ప్రాంతంలో సీత ఉండి ఉండాలి అనే ఊహను మెరపిస్తుంది. అది ఊతగా రామలక్ష్మణులు మార్గ సికతాతలం మీద పడిన అడుగుజాడలను జానకీపాదముద్రలుగా అనుమానించి ఒక చోటికి చేరుతారు. అక్కడ వీరి కంటికి కనబడకపోయినా ఒక పొదరింటిచాటున సీత ఉంటుంది. ఈ విధంగా—అతర్కితోపనతంగా సీతారాములు సన్నిహితులు కావడానికి ఈ కుందమాల కారణం అవుతుంది. అది ఆధారంగా నాటకం ముందుకు నడుస్తుంది.

ఇట్లా—ఈ నాటకానికి కుందమాల ప్రధాన సూత్రం అవడమే కాకుండా కవిహృదయంలో

సుకుమారమైన వ్యంగ్యస్ఫూర్తి కూడా ఉన్నదా? అని తోస్తుంది. మధురహృదయ, శుద్ధశీల అయిన సీతనే ఉదారచిత్తుడైన కవి కుందమాలగా భావించెనా?

మల్లికాపుష్పశీల అయిన సీత— భాగ్యవశాన రామచంద్రుని కంఠాన్ని అలంకరించింది. తన మధు హృదయంతో ఆ పురుషపుంగవుని అలంకరించింది. తన గుణపరిమళంతో ఆయన చరిత్రను సుగంధిలం చేసింది. ఈ మల్లికాదామాన్ని ఆ దామోదరుడు ఆదరించలేక రాజధర్మవశుడై—"స్రజ మపి శిర స్యంధః క్షిప్తాం ధునో త్యహిశంకయా" అన్నట్టు కన్నులు మూసుకుని అరణ్యసీమలకు విసరివేశాడా?

"నైసర్గికీ సురభిణః కుసుమస్య వృత్తిః
మూర్ధ్ని స్థితిః న చరణై రవతాడనాని"

అని సీతాపరిత్యాగమును చూచిన మృదుహృదయులు అనుకున్నారా? అనిపిస్తూ ఉంటుంది.

బౌద్ధుడు, అర్షమతోపేక్షాశీలి, అయిన దిఙ్నా గునకు బౌద్ధకథలు లేవా నాటకం వ్రాసుకోవడానికి? తాను వ్రాసిన ఒక్కనాటకానికీ రామాయణకథే కావలసివచ్చిందా? అనే ప్రశ్నలు ఈ నాటకాన్ని చూచి నపుడు తల లెత్తుతూ ఉంటాయి.

ఆలోచించగా ఇట్లా తోస్తుంది. దిఙ్నాగుడు బౌద్ధుడే అయినా ఈయనకు రామాయణసీతపాత్ర మీద ఉండే గౌరవాదరాలు అసాధారణమైనవి.

సీతాజీవితం మాధుర్యమయ, పుణ్యమయ, త్యాగమయ, పరిపూర్ణ స్త్రీమూర్తికి ఏకైక నిదర్శనం అని ఆయన తలంపు కావచ్చును. ఆయనకే కాదు ఈ దృష్టి వాల్మీకిమహర్షికే ఉన్నదేమో—లేకపోతే రామాయణాన్ని పట్టుకుని 'సీతాయా శ్చరితం మహత్' అనడం ఎందుకు?

ఆడుబిడ్డగా, కోడలుగా, భార్యగా, వదినగా, తల్లిగా, సఖిగా, ఆమెజీవితం సర్వతోముఖంగా స్పృహ ణీయంగా చిత్రింపబడినట్టు ఇక ఏ పురాణస్త్రీ జీవి తమూ చిత్రింపబడ లేదేమో! కనుకనే మధురస్త్రీ మూర్తిని ఏవైపునుంచి చూడదలచినా సీతమ్మ ప్రత్యక్షం అవుతుంది.

"రెండే రెండగు నక్షరాలు భర తోర్వీ
పుణ్యరేఖల్ సుధా
భాండమ్ముల్ వరవర్ణినీ చరిత దీపస్తంభముల్
దూర భూ
ఖండ ప్రాజ్ఞ జనాభినందన వచః కర్పూర
నీరాజనా
ఖండ ఖ్యాతము లౌర! సీత యను వాఖ్యన్ లిపి
ఏ మున్నదో!"

అని ఆమెను గూర్చి తలచినపు డల్లా అను కోకుండా ఉండలేము.

అట్టి ప్రేమ, త్యాగ, కరుణామయ సీతా జీవితఘట్టమును చిత్రించడానికే ఆచార్య దిఙ్నాగుడు ఈ నాటకరచనకు ఉపక్రమించినట్టు కనబడుతుంది.

ఈయన ఉత్తరరామకథను చాలవరకు యథా తథంగానే గ్రహించి తనరచనకు ఒక పథకాన్ని ఏర్ప రచుకున్నాడు.

జనాపవాదభీరుడై రాముడు సీతను పరిత్య జించడం, పరిత్యాగానంతరం రాముని అశ్వమేధ ప్రయత్నం, వాల్మీక్యాశ్రమంలో కుశలవుల జననం, మహర్షి రామాయణ రచనం, రామసభలో కుశలవుల రామాయణగానం, రామచంద్రుడు ఆ కవలను తన బిడ్డలుగా గుర్తించడం, వాల్మీకి సీతాసహితంగా రామ సభకు రావడం, సీతాపాతివ్ర్య ప్రకటనకై భూదేవి సాక్షాత్కారం మున్నగు ప్రధానాంశాలు మూల కథా సంవాదకములుగానే ఉన్నాయి. కాని—నాటకీయ చమ త్కారంకోసం, కొన్నిపాత్రలపై విశిష్టకాంతి ప్రసారం కోసం, కొన్నిచోట్ల ఔచిత్యదీప్తికోసం వస్తు విన్యాసంలో కొన్ని మార్పులు చేశాడు.

రాముడు లక్ష్మణునితోగూడ అశ్వమేధనిమిత్తం నైమిశానికి వెళ్ళి, ఆ సమీపాశ్రమంలోనే వాల్మీకి మహర్షి విచ్చేసి ఉన్నాడని తెలిసి ఆయన దర్శనం కోరి వెళ్ళుతూండగా నదిలో కుందమాల కనిపిస్తుంది. ఆ పూలకూర్పు సీతదే అని గుర్తిస్తాడు. అడుగుజాడలను బట్టి ఆ ప్రాంతం జనసంచారయుతం అని తెలుసు కుని ముందుకు పోగా అడుగులు అదృశ్యం అవుతాయి. ఒక పొదరింటివద్ద పరస్పర దర్శనం లేకపోయినా సీతారామ సమాగమం జరుగుతుంది.

ఈ ఆశ్రమోపాంతంలో కలవని తలంపుగా సీతారాములు రెండుసార్లు కలుసుకునే సన్నివేశం

కల్పించాడు కవి. జనాపవాదభీరువై లోకసంగ్రహానికి సీతను విడిచిపుచ్చినా రాముని మనస్సంతా సీతతో నిండి ఉంది. చిక్కని తరులతాజాలంతో కూడిన అరణ్యసీమలను, నదీతీరాలను చూడగా ఆ స్నిగ్ధ హృదయునకు సీత జ్ఞాపకం వస్తుంది. దానితో తీయని గతస్మృతులతో ఆయన మనస్సంతా కలిగి పోతుంది. ఆయన స్మృతియవనికఅంతా సీత రకరకాల బొమ్మలతో పూరితం అయిపోతుంది. ఆ ధీరుడు అట్టి ప్రియాతిప్రియను చేజేతుల విడచిపెట్టాడు. ఆమెను మరచిపోలేడు. స్వీకరించే వీలు లేదు. ఇది ఒక విచిత్ర మన స్సంకీర్ణ స్థితి—

ఇక—సీత మూర్తీభవించిన ప్రేమ, త్యాగ పుంజము. నిష్కారణపరిత్యక్త, నిరపరాధిని నిర్భర స్నేహశీల, అభిమానోజ్జ్వలక్షత్రియాణి ఆమె హఠాత్తుగా రాముని చూడడమే తటస్థిస్తే అనుభవించే వివిధభావవిహ్వలత, ఇంద్రధనురతీత బహువర్ణ ప్రజ్వలితం. ఈ సన్నివేశం కవిలేఖినీ రసవిహారానికి పట్టుగొమ్మ. ఇక్కడ కుందమాలకవి తన మనస్తత్త్వ చిత్రణప్రజ్ఞను, రసమహిత రచనా నైపుణ్యమును అద్వితీయంగా నిర్వహించాడు.

రామునకు సీత ప్రత్యక్షంగా కనపడదు. ఆ అరణ్యనదీపరిసరాలను చూచి పంచవటీ సీతాసహవాసాన్ని స్మరించి కేవలం భావగమ్య అయిన సీత నుద్దేశించి ఆర్ద్రహృదయంతో మాటలాడుతాడు. అనుకోకుండా పక్కనే ఉన్న సీత ఆమాటలకు జవాబు చెబుతుంది.

ఈ సన్నివేశం బహుశః ఈ కవికి స్వప్నవాసవదత్త నాటకంలోని ఉదయనుని స్వప్నఘట్టం నుంచి స్ఫురించి ఉంటుంది. ఈ స్ఫురణకు కుందమాల కవి ఇక్కడ విశాలరూపం ఇచ్చి ఉండగా భవభూతి దీనివల్ల ప్రభావితుడై ఉత్తరరామచరితలో ఛాయాంకాని అద్భుతంగా సృష్టించాడు.

ఉత్తరరామచరితలోని ఛాయాంకం (3 అం.) ఎంతరసవంతమూ సహృదయప్రీతికరమూ అయినా అందులో ఒక కృతకత్వం ఉంది. శంబూకనిమిత్తమై రాముడు పంచవటికి రావడం అమూలకం. అట్లా వచ్చిన రాముడు పంచవటీ దర్శనంవల్ల సీతాస్మృతి కలిగి బాధపడవచ్చునని ఊహించి అగస్త్యపత్ని లోపాముద్ర, చల్లని తరంగవాయువులతో ఆతన్ని సేద దేర్చు మని గోదావరీనదికి కబురు చేయడం—ఈ అనర్థాన్ని ముందే శంకించిన భాగీరథి అన్యకరణంతో సీతను పాతాళంనుంచి పంపి తిరస్కరిణీప్రభావం ఇవ్వడం, సీత వెంట తమస అనే నదీదేవత విడవకుండా ఉండడం, తన కరుణరస పరిపోషణకు భవభూతి మహాకవిచేసిన క్లిష్టకల్పనలు అనకుండా ఉండలేము. దీనినిబట్టి చూడగా కుందమాలలోని సీతారామ సమాగమకల్పన ఎంతో సహజంగా కనపడుతుంది.

ఇందులో సీతారాములు ఎవరి ప్రేరణా లేకుండానే ఒకరికొకరు తటస్థపడతారు. తొలిఘట్టంలో లక్ష్మణుడు పక్కనున్నా సీతను భావించి రాము డన్న మాటలకు సీత పలికిన ప్రతివచనాలు ఎంతో సహజంగా కనపడతాయి.

రెండవఘట్టంలో హోమధూమంవల్ల క్లిన్నములైన కన్నులను కడుగుకోవడానికి రామచంద్రుడు ఒక సరస్తీరానికి వస్తే ఆ ఒడ్డున సీత ఉంటుంది. కాని రామునకు కనపడదు. నీటిలో ఆమెనీడ మాత్రం కనపడుతుంది. ఆయన ఆశ్చర్యపడతాడు. వారిచెంత ఇక ఎవ్వరూ లేరు. వారి స్వేచ్ఛాహృదయ వినిమయానికి ఈ సన్నివేశంలో ఎంతో వీలు కలిగింది. ఒక స్థితిలో రాముడు మూర్ఛపడగా సీత తన ఉత్తరీయంతో విసరుతుంది. రాముడు తేరుకుని కన్నీరు తుడుచుకోడానికి ఆ ఉత్తరీయం తీసుకుంటాడు.

ఆ సరస్తీరంలో ఉన్న స్త్రీలు పరపురుషుల కంటబడకపోవడం వాల్మీకిమహర్షి వరం. ఆ వరానికి కారణం—యజ్ఞనిమిత్తంగా రాజపురుషులు ఆశ్రమానికి రావచ్చును గనుక వారిదృష్టిని పరిహరించి స్త్రీలు సరస్తీరంలో విశ్రమించడానికి అవకాశం కల్పించబడింది.

అట్లా అదృష్టంవల్ల సీతను కలుసుకొన్నానని రాముడు ఊరటపొందుతూ ఉండగా—రాముని మిత్రుడు కౌశికుడు రామాయణగానాభ్యాసానికి వాల్మీక్యాశ్రమానికి వచ్చిన తిలోత్తమ సీతగా నటించి రామ హృదయం తెలుసుకోవాలని ప్రయత్నిస్తున్నది అని ఎవరో చెప్పుకొంటూ ఉంటే విన్నానని చెప్పాడు.

'అయితే తనకు సీతగా కనపడ్డది సీతా? తిలోత్తమా? ఎంత వంచన జరిగింది! ఆమె

తిలోత్తమే అయితే చిత్రకూటంలో మాయావతి సీత కిచ్చిన పరిమళభరిత—ఉత్తరీయం ఆమె కెట్లా వచ్చింది? ఆ ఉత్తరీయం నాటినుంచీ తనకు బాగా గుర్తు గదా!'

శ్రీరామునకు ఆందోళన కలిగించిన ఈ ప్రశ్న పరంపర నాటకీయ కుతుకానికి జీవంపోసింది. అంతే కాదు. ఆ పురుషోత్తముడు కోరేది సీతాసహవాసం మాత్రమే. అన్యస్త్రీలు ఆయనకు అస్పృశ్యలు. వారు తిలోత్తమలైనా సరే శీలోత్తములైనా సరే. రామచంద్రుని సీతాప్రేమనిష్ఠ వ్యంగ్యంగా ఇక్కడ చమత్కృత మయింది.

ఇందులో కవి ఉత్తరరామకథలో ప్రసిద్ధములైన రెండు ఉపాఖ్యానాలు తీసివేశాడు.

ఒకటి—శంబూకవధ—

రెండు—అశ్వమేధాశ్వం కోసం కుశలవుల యుద్ధఘట్టం—

నిజానికి—కుశలవుల యుద్ధప్రసక్తి ఉ. రామాయణంలో లేదు. రఘువంశ, సీతావివాసఘట్టంలో కూడ కనపడదు. కాని జనశ్రుతిలో ప్రబలంగా ఉంది. అన్యరచిత రామాయణాదుల్లోనూ ఉండవచ్చు. అయినా ఈయన దాన్ని స్వీకరించలేదు.

లోకాపవాదభీతుడై ప్రియపత్నిని విడిచినా రాముని సీతానిష్ఠమైన అవ్యాజప్రేమ ఎన్నటికీ నశించలేదనీ, అది వియోగపరితాపతప్తమై పరిపక్వమై మరింత మెరుగుదేరి సీతా సమాగమమునకు ఎదురు చూస్తున్నదనీ వాల్మీకి ఆశీస్సులో అది సిద్ధించినదనీ చిత్రించదలచిన కుందమాలకవికి ఈ రెండుకథలూ అకించిత్కరములు. కుశలవులు తండ్రిని యుద్ధప్రసక్తిలో కాకుండా రామాయణ గాన సందర్భంలో కలుసుకోవడమే ఎక్కువ ఔచిత్యం అని తలచి ఉంటాడు. ఈయన పథకం ప్రకారం ఇందులో ప్రధానపాత్రలు ముగ్గురు. శ్రీరాముడు, సీత, వాల్మీకి. సీతారాము హృదయాలను చక్కగా వ్యాఖ్యానించిన తరువాత వాల్మీకిపాత్ర ఉదాత్తంగా పోషింపబడింది.

సీతారాముల అద్వైతప్రేమాతిశయం ఆది కవికి తెలిసినంతగా అన్యులకు తెలియదు. వారి జగన్మంగళ దాంపత్యగాథ పుటపుటను చదివి తానొక్కడే మహాకావ్యం వ్రాశాడు. ఆ నిరంతర కల్యాణ గానంలో అపస్వరం లేదు. సీతారామప్రేమగంధి రూపులయిన కుశలవులతో ఆ ఆదర్శ దంపతులను శాశ్వతంగా కలిపాడు. మూలకథలో వారి ఎడబాటే చిత్రితమై ఉన్నా ఇందలి వాల్మీకి సీతారామ సమాగమమే నిరూపించి కావ్యన్యాయాన్ని స్థిరపరిచాడు.

ఇందులోని వాల్మీకి సీతను గంగాతీరంలో చూచినప్పుడు రాముని పరిపాలనాసౌష్ఠవాన్ని ప్రశంసించి ఆయన హృదయంనుంచి నీవు వేరు కాలేదమ్మా అని సీతను ఓదార్చినా తుది అంకంలో రామసభలో కటువుగా మాటలాడుతాడు. దాని కర్థం రాముని మీద కోపం కాదు. శాకుంతలం కణ్వునివంటి ఆర్ద్ర హృదయమూ, అపవాదప్రచారప్రియులైన ప్రజల మీద కినుకా, ఆయనను అట్లా మాట లాడించాయి. సర్వసంగపరిత్యాగి అయిన మునికి ఈ మానతాచిత్రణ ఎంతో హృద్యంగా ఉంది.

సీతాసౌశీల్యమే గెలవాలి అంటే ప్రజాపవాదం తిరస్కృతమై ఆమె రామునితో కలియడమే జరగాలి. కుందమాలకవి ఆ సీతావిజయమే ఇందులో ప్రదర్శించాడు. ఈ విషయమే నచ్చి భవభూతి కూడ తన నాటకంలో సీతారామసమాగమమునే నిరూపించాడు.

మొత్తంమీద ఈ నాటకవస్తు విన్యాసం కట్టుదిట్టంగానే నడచినా ఒకటి, రెండంశాలు కొంచెం బలహీనంగా కనపడతాయి.

మొదట ప్రబలంగా కనబడే అశ్వమేధ ప్రమేయం తర్వాత కథాభారంలో మునిగిపోయింది.

చిత్రకూట వనదేవత మాయావతి ఇచ్చిన ఉత్తరీయం వాల్మీక్యాశ్రమంలో సీత కెట్లా వచ్చిందో స్పష్టపడదు.

ఐదవఅంకంలో రాముడు భద్రాసనం మీద కూర్చుని కుశలవులను ఒడిలో కూర్చోబెట్టుకుంటాడు. వెంటనే విదూషకుడు అరాఘవులు ఈ ఆసనం మీద కూర్చుంటే తల పగిలిపోతుంది అంటాడు. చటుక్కున రాముడు ఆ బిడ్డలను కిందికి దించివేస్తాడు.

వారికేమీ కీడు జరుగదు. దానితో రామునకు ఆశ రేకెత్తుతుంది.

ఇది శాకుంతలంలోని దుష్యంతభరత సమాగమంలోని మారీచకావృత్తాంతానికి పేలవమైన అనుకరణగా కనిపిస్తుంది.

ఈ నీహారలేశాలను విడిచిపెడితే—ఈ నాటకం ఉత్తమరచన అని చెప్పడానికి ఏమీ అభ్యంతరం లేదు.

కుందమాల కవిత అర్థరచనా సరళమై ముందుగా పాఠకులను ఆకట్టుతుంది. నాటక రచనలో భాసుని తరువాత ఇంత మెత్తని సంస్కృతమూ ఉజ్జ్వలభావవిన్యాసమూ నిర్వహించిన కవి వేరొకడు కనబడడు.

లక్ష్మణుడు సీతను అడవిలో విడిచిపెట్టి అంటాడు—

ఏతే రుదంతి హరిణా హరితం విముచ్య
హంసాశ్చ శోకవిధురం కరుణం రుదన్తి
నృత్తం త్యజంతి శిఖినోఽపి విలోక్య దేవీం
తిర్యగ్గతా వర మమీ న పరం మనుష్యాః॥

భాషాసారళ్యమేకాక భావంలోని చురుకుదనమును గూడ ఇచట సహృదయులు చూడగలరు. దయనీయ సీతను చూడగనే పితృవాత్సల్యభరితమైన వాల్మీకి హృదయం ఇట్లా అన్నది— "వాల్మీకి రస్మి విప్రు జాన్యజవాధిశంకాం । నాస్య సద్మాయ మజరే శ్వశురః పితా తే"

సీతాస్మృతివల్ల దుఃఖించే రాముని లక్ష్మణుడు ఓదార్చబోతే అయ నంటాడు-పూర్వం వనప్రవాసః । పశ్చాల్లంకా వనప్రవాసోఽయం । అసార్య మామధ్యం । దుఃఖా ద్దుఃఖం గతా సీతా ॥

అతని ఆర్ద్రాంతరంగంలో ఎంత అనుతాపం।

ప్రవాసిని సీత హఠాత్తుగా రాముని చూస్తుంది. ఆమె మనఃకల్లోలమును ఇట్లా చిత్రిస్తాడు—

"అహో, దృష్ట ఇతి పరితోషః; చిరప్రవాస ఇతి మన్యుః; పరిక్షామ ఇ త్యుద్వేగః; నిరనుక్రోశ ఇ త్యభిమానః; చిరపరిచిత ఇ త్యనురాగః; దర్శనీయ ఇత్యుత్కంఠా; స్వామీతి బహుమానః; కుశలవయోః పితేతి కుటుంబినీ సద్భావః; అపరాధం ప్రవేశితాస్మీతి లజ్జా; న జానామి ఆర్యపుత్రదర్శనేన కీదృశీ మవస్థా మనుభవా మీతి."

ఈ మనస్తత్త్వ చిత్రణ కౌశలం శ్రద్ధగా గమనించ దగ్గది.

సంభాషణలోని చురుకు, తూచినట్లు పలికే ప్రత్యుక్తులు స్ఫులింగములవలె కన్నులు మిరుమిట్లు గొలిపే ఉక్తిచాతురి ఇందలి వాల్మీకి సీతావచనాలలో పాఠకుని ఆకర్షిస్తాయి.

"ఉత్తరేరామచరితే భవభూతి ర్విశిష్యతే" అనే ప్రసిద్ధి వడసిన ఉత్తరరామచరిత్ర నాటకం మీద కనబడే కుందమాల ప్రభావం చూచి ఆశ్చర్య చకితుల మవుతాము.

పాఠకప్రీతికై కొన్ని మచ్చులు.

కుందమాల ప్రథమాంకంలో లక్ష్మణుడు సీతతో—

"ఋషీణాం లోకపాలానాం।
ఆర్యస్య మమ చాగ్రతః
అగ్నౌ శుద్ధిం గతా దేవీ కింతు" అని ఆగి నెమ్మదిగా "లోకో నిరంకుశః" అంటాడు. అది విని సీత "అగ్నిశుద్ధి సంకీర్తనేన ప్రతిబోధితాస్మి, రావణ భవన వృత్తాంతం. పున రప్యుద్బాధయతి సీతాయా అపి నామ ఏవం సంభావ్యతే. సర్వ థాలం మహిళాత్వేన"

పై వాక్యములను ఊతగా తీసుకుని భవభూతి ఉ. రా. ప్రస్తావనలో సుప్రసిద్ధములైన ఈ శ్లోకాలు వ్రాశాడు.

"దేవ్యా మపి హి వైదేహ్యాం
సాపవాదో యతో జనః
రక్షోగృహస్థితిర్మూలం
అగ్నిశుద్ధౌ త్వనిశ్చయః ॥6॥
సర్వథా వ్యవహర్తవ్యం
కుతో హ్యవచనీయతా
యథా స్త్రీణాం తథా వాచాం
సాధుత్వే దుర్జనో జనః (5)

కుందమాలలో — లక్ష్మణుడు సీతను అడవికి తీసుకువెడుతూ అంటాడు—

"దేవీ మాదాయ గృహహరిణీ మివ వధ్యభూమిం వన మువనయామి"

ఉ. రా. చ. ప్రథమాంకంలో రాముడు సీతా పరిత్యాగం నిశ్చయించి—

"శైశవాత్ ప్రభృతి పోషితాం ప్రియాం
సౌహృదా దపృథగాశ్రయా మిమాం
ఛద్మనా పరిదదామి మృత్యవే
సౌనికో గృహశకుంతికా మివ"

అంటాడు.

రాముని సందేశముగా లక్ష్మణముఖాన సీతతో కుందమాలకవి—

"త్వం దేవి చిత్తనిహితా గృహదేవతా మే
స్వప్నాగతా శయనమధ్యసఖీ త్వమేవ"

అంటే—భవభూతి వాసంతిముఖాన ఒకప్పుడు శ్రీరాముడు సీతతో అన్న ప్రియోక్తిగా—

"త్వం జీవితం త్వ మసి మే హృదయం ద్వితీయం
త్వం కౌముదీ నయనయో రమృతం త్వ మంగే..

అని పలికించాడు.

కుశలవులు రామునిచెంతకు వస్తూంటారు. వారిని చూచి రామునికన్నులు స్నేహార్ద్రము లౌతాయి. అప్పుడు కుందమాలరాము డంటాడు—

"అపాతమాత్రేణ కయాపి యుక్త్యా
సంబంధిన స్సన్నమయంతి చేతః
విమృశ్య కిం దోషగుణా నభిజ్ఞః
చంద్రోదయే శ్చ్యోతతి చంద్రకాన్తః?"

సరిగ్గా అట్లాంటి పితాపుత్ర సమావేశంలోనే భవభూతి రామునిచే ఇట్లా అనిపిస్తాడు.

"వ్యతిషజతి పదార్థా నాంతరః కోఽపి హేతుః
నఖలు బహి రుపాధీన్ ప్రీతయు స్సంశ్రయంతే
వికసతి హి పతంగ స్యోదయే పుండరీకం
ద్రవతి చ హిమరశ్మా వుద్గతే చంద్రకాన్తః॥

ఇట్లా కుందమాలకవి ఎన్నో భావాలు, వాక్యాలు భవభూతి మహాకవి రచనను ఉత్తేజపరిచాయి.

ఈ కవు లిద్దరు ఉత్తరరామకథకు అద్భుత వ్యాఖ్యాన్నిచ్చి రసనిర్భరమైన రెండు రూపకాలు వ్రాసి సంస్కృతసాహితిని అలంకరించారు.

మానవీయ ప్రత్యక్ష కుటుంబిని, అభిమానమయి, అనురాగమయి, కరుణామయి, సీతామూర్తిని దిఙ్నాగాచార్యుడు సృష్టిస్తే—భవభూతి దివ్యరూపిణి—అమృత హృదయ, అమరభావనాగమ్య అయిన ఆదర్శగృహిణి జానకీమూర్తిని నిర్మించాడు.

అట్టి సీతారామ అమరగాథను తీసుకొని ఇటీవలి కొందరు ఆ పురాణపుణ్యమూర్తులను నేల మీద ధూళిలోకి లాగి తమ ఆధునిక భావకశ్మలం వారికి గూడ పట్టించి ఆర్షహృదయ పరమార్థాన్ని గ్రహించక తోచినట్లు ఆ కథను వ్యాఖ్యానించడం తెలుగుసాహిత్యం దురదృష్టం.

ఈ నాడు ప్రసంగాలలో, రచనలలో నవ్య లనుకొన్నవారు కొందరు తరుచుగా రాముని మీద చేసే అభియోగాలు మూడు.

(1) రాముడు ప్రజానురంజనపరతంత్రుడై సీతను బహిష్కరించడం ఘోర అన్యాయం.

(2) శంబూకుడనే నిరపరాధిని జాతివిచక్షణ వల్ల ధర్మశాస్త్ర కఠిన శాసనానికి లోంగి చంపడం అక్రమం.

(3) ఈ అకార్యకరణాలకు ప్రత్యక్షంగానో పరోక్షంగానో వసిష్ఠాదిపురోహితుల ఆధిక్యం కారణం.

ఈ ఆరోపణలను సమర్థించడానికి, వారి దురాగతాల్ని ఖండించడానికి, పురాణకథను స్వసిద్ధాంతాను సారంగా మార్చి, ఆ పాత్రలను తమ అచ్చులో పోసి రచనలు చేస్తున్నారు.

నిశితంగా ఆలోచిస్తే ఈ ఆక్షేపణలకు నిలవ గలిగినంత బలం లేదు. అవి ఆపాతరమణీయములు మాత్రమే.

ఒక ప్రత్యేక, దేశ, కాల, పరిస్థితులలో సంభవించిన సంఘటలను ఆనాటి సమాజ నియమ నిర్ణయాలను బట్టి విమర్శించవలెనుగాని నీవు చేతులో ఉంచుకొన్న కొలతలతో సూత్రాలతో చర్చించడం అసంగతం గదా! రాముడు ఏ పరిస్థితిలో సీతాపరిత్యాగం చేయవలసి వచ్చిందో చూద్దాం—

శ్రీరాముని ఎదుట అప్పుడు నిలిచిన ప్రశ్న ఇది— ప్రజాభ్యుదయమా? ప్రేమానుబంధమా?—

సీత నిరపరాధిని, శుద్ధశీల అని ఆయనకు తెలుసు. సీతాసహవాసంలోనే తనకు సుఖశాంతులున్నవని అసందిగ్ధంగా ఎరుగును. కనుక స్వార్థంగా చూస్తే సీతా స్వీకరణమే అవశ్యకర్తవ్యమని ఆయనకు తోచకపోదు. కాని ఇక్కడ ఆయన విచక్షణ లోకోత్తరమైనది. ఏతన్మాత్రులకు అందనిది.

ప్రజలను, ప్రజాపవాదాన్ని, తృణీకరించి నిమిషంలో రాజ్యాన్ని విడచి సీతతో రాముడు అడవులు బట్టి పోవచ్చు. కాని ఈ మహారాజ్యాన్ని పాలించే దెవరు? తన సోదరులు ఆ భారాన్ని స్వీకరించరు—లేరు. రాజ్యం అరాజకం అవుతుంది. బలవంతులు బలహీనులను హింసిస్తారు. కోసలరాజ్యం కల్లోలితం అయిపోతుంది. అప్పుడు ఏ కుటుంబానికీ సుఖశాంతులుండవు. ఒక తన సుఖమే అపేక్షిస్తే కోటిమంది శుభస్థితి వినష్టం అవుతుంది. కనుక సీత పరమ సాధ్వి అని తెలిసినా—తన 'స్వార్థం' పరిత్యజించి, ఆ దురంతవేదనను ప్రజాశ్రేయస్సు కోసం భరించడం 'అల్పులకు మ్రింగ జేదైన హాలహలము'ను పరమశివుడు భరించడం వంటిది. ఉత్తరచరితలో రాముడు ప్రజారాధనం కోసం సీతనైనా విడిచి పెడతానంటే— అప్పుడు, ఎవరో కాదు—సీతే అంటుంది. "కనుకనే ఆర్యపుత్రుడు రాఘవకులధురంధరుడు" అని. ఇక్కడ 'కులధురం' అంటే ప్రజారాధనం. ఇప్పుడు రాముని త్యాగమహిమ ఎంతటిదో అర్థమవుతుంది గద—

ఇక శంబూకవధ సంగతి—

ఆత్మధర్మం,జాతినిబట్టి ఎవ్వరినీ గౌరవించడం గాని అగౌరవించడంగాని చెయ్యలేదు. అర్హతను బట్టి పూజించింది. అందువల్లనే వాల్మీకి, వ్యాసులు, సూతుడు మనకు పూజ్యులయ్యారు. అధికార, అనధికారతలను బట్టి ఎవరి ధర్మాలు వారికి నిర్ణయింపబడ్డాయి. అనుపనీతుడైన కుమారుడైనాసరే వేదోక్త బ్రాహ్మణ కర్మలకు నిషిద్ధుడు. పరమపూజ్య అయిన తల్లి అయినా సరే వేదాధికారం పొందలేదు—వర్ణాశ్రమ ధర్మాలు ఇంత కచ్చితంగా పాలింపబడ్డాయి. వీటిని రాజు కాపాడాలి. వ్యతిరేకిస్తే శిక్ష తప్పదు. పారమార్థిక చింతకు, మోక్షసాధనకు ఎవరి ఏర్పాట్లు వారికున్నాయి. వాటిని ఉల్లంఘిస్తే సమాజ క్షోభ ఏర్పడక తీరదు. శంబూకుడు తన జాతికి ఏర్పడిఉన్న పారమార్థికచింతను మాని సశరీర స్వర్గప్రాప్తికై అసహజమైన ఘోరతపస్సు ప్రారంభించాడు. ఈ కోరికకు క్షత్రియుడైనా త్రిశంకుడు శిక్షింపబడ్డాడు. శంబూకుని ఈ అతిచారమును చక్కదిద్దవలసినవాడు రాజు.రాజదండనం పొందినవాడు ఉత్తమగతికి అర్హుడు. అట్లాగే ఆయనకు మోక్షప్రాప్తి కలిగింది.ఈ రాజదండనమును అతడు ఎదిరించకుండా స్వీకరించాడు. ఈ కథకు చిలవలు పలవలు అల్లి శంబూకుని కొక భార్యను కల్పించి ఆ యిద్దరిచేత రాముని తిట్టించి ఆ పాత్రలకు ఎంతో న్యాయం చేకూర్చా మనుకోవడం, స్వకాలీన సిద్ధాంతాలను వారిపై రుద్దడం ఏమి వివేకమో ఊహించలేము.

రామాయణం శ్రద్ధగా చదివిన వారికి వసిష్ఠుని పౌరోహిత్యం హద్దు లెంతవరకో తెలుస్తాయి.

వసిష్ఠుని ఆదేశదుర్బోధలవల్లగాని, శాస్త్ర నిర్బంధంవల్లగాని రాముడు ఏ అక్రమాలకూ పాల్పడినట్టు రామాయణాన్నిబట్టి రుజువు చెయ్యలేరు.

పూర్వరామాయణ కథలో వసిష్ఠుడు భరతునితో చిత్రకూటానికి వెళ్ళి రాముని రాజ్యస్వీకారం చెయ్యమంటే తగిన ఉపపత్తులు చెప్పి ఆయన తిరస్కరించాడు. ఉత్తరకథలో వసిష్ఠుడు సీతా వ్యవహారంలో కల్పించుకోనే లేదు. రాముడు సీతా పరిత్యాగ విషయంలో ప్రసంగించినది తమ్ములతో— వారి మాటలనుగూడ ఆయన లెక్క చెయ్యలేదు. ఇక ఉ. రా. చ. లో వసిష్ఠుని సందేశం ఉన్నది. తన మనసులోని ప్రజారాధన సిద్ధాంతాన్నే ఆయన సందేశం గూడ చెప్పింది కనుక రాముడు హర్షించి స్వీకరించాడు. అంతే. వసిష్ఠుడు చెప్పినందువల్లగాదు. ఆయన చెప్పకపోయినా ఇట్లాంటి మాటనే రాముడు ఒక సందర్భంలో అనియున్నాడు. (అయోధ్య)


"అహంహి సీతాం రాజ్యం చ,
ప్రాణా నిష్టాన్ ధనాని చ,
హృష్టోభ్రాత్రే స్వయందద్యాం
భరతా యాప్రచోదితః"

శంబూకవధ విషయంలోకూడ వసిష్ఠుడు ఏమీ పెదవి కదపలేదు. ఈ వృత్తాంతం రామునకు చెప్పిన వాడు నారదుడు. ఆయన జోలికి వెళ్ళడం ఇష్టంలేక పాపాలకు భైరవుడు వసిష్ఠుడే అనడం అజ్ఞానం అనక తప్పదు.

అంతే కాక—తన విశ్వాసాలను—హేతువాదాన్ని సమర్థించడానికి, ధీరుడు, గంభీరుడు, ఉదాత్తనాయకుడు అయిన రామునిచేత ఆవేశపూరిత, అనన్విత, అనుచిత ప్రసంగాలు చేయించడం, ఉన్మత్తంగా ప్రవర్తింప జేయడం నేటి విప్లవధోరణి. వాటి పాత్రల ముఖాన పలికించడం, సీతాసౌకుమార్యాన్ని, వినయసంపత్తిని, శీలసౌరభాన్ని, తలకిందులు చెయ్యడం, పంద్రెండేళ్ల లవునిచేత గుక్కతిరగని ఉపన్యాసాలు చెప్పించడం, ముదివేషాలు వేయించడం నేటి రచయితలు చేసిన ఔచిత్యహింసకు చక్కని ఉదాహరణాలని చెప్పవచ్చు.

ఒక్క విషయం ఉంది—

పూర్వేతిహాసాల కథలను ఎక్కడా మార్చకూడదని ఈ వ్యాసకర్త ఉద్దేశం కాదు. పూర్వం ఎన్నో మార్చినట్లు ఎరుగకపోలేదు. ఆ మార్పు ముఖ్యంగా ఔచిత్యాన్నీ రసాన్నీ పోషించేది అయి ఉండాలి. అప్పుడు మూలద్రవ్యాల వంటి పురాణకథల కంటె, అలంకృతములైన కావ్యమూర్తులు ఎంతో హర్షదాయకము లవుతాయి. అంతవరకూ పోనక్కరలేదు. ముందు ప్రస్తుతములైన కుందమాలోత్తరచరితాదులందే ఔచితీభూషితములు, రసనిర్భరములో అయిన మూలాతిరిక్త కల్పనములను కన్నుల కద్దుకున్నాము గదా! ఈ సుగుణమునే కదా ఏ కాలపు రచయితల నుంచి అయినా కావ్యరసజ్ఞులు కోరేది!



కళ్లద్దాలు

శ్రీ బండి నాగరాజు

నా అద్దాలు మా నాన్న హోదాకు తగ్గట్టు కొన్నాను;
మా అమ్మ ప్రేమకు చిహ్నంగా పెట్టుకొన్నాను;
మా కులపెద్దల 'ప్రిస్క్రిప్షన్'మీద తీశాను!
నేను అప్పటం తెలుగువాణ్ణి: నావి తెలుగు అద్దాలు
నా అద్దాల్లాంటివే అందరివీను: తెలుగువాళ్లవన్నీ ఒకటే అద్దాలు!
ఇతరదేశస్థులకుమోస్తరు ప్లేములేని అద్దాలు కావు నావి.
సంస్కృత లోహంతో చేసి,
తెలుగు పూతపూసిన అందాల ప్రేము నాది;
దాని కవతలది నాకేమీ కనిపించదు.
కుల శుద్ధి గల హరిత వర్ణ పవిత్రిత సులోచనాలు నావి
అన్నీ ఒకేవర్ణం, నా దృష్టికి!

నా అద్దాలకు సెంటిమెంటల్‌గా భవిష్యత్తు గోచరిస్తుంది!
దోషాలు కనిపించి శాంతులకు అవకాశ మిస్తాయి!
ఆమరణాంత దీర్ఘదృష్టి కనిపిస్తుంది నాకు!
సాంఘిక రాజకీయ భవిష్యత్తులు అక్కర్లేదు నాకు?
అలాంటి తిర్యగ్ దృష్టి లేదు!!
నన్ను నేను చూచుకునే హ్రస్వదృష్టే
నాకు 'పలిచ్చ'మని కనిపిస్తుంది!
వర్తమాన దృష్టితో చూచే అలవాటు లేదు
కాబట్టి కొంచెం బూజరగా—గాజువారినట్టుగా— తోస్తుంది!

నా అద్దాలు, భూతద్దాలు!
భూతకాలాన్ని గొప్పగా చూపగల అద్దాలు!!
గతుకులు బెతుకులు కనిపించవు!
ఆ రామణీయకాలు, మాధుర్యాలూ చూసి పర్యుత్సుకుడ నవుతాను

నా దృష్టి ఎప్పుడూ అటువైపే!
ముందుచూపు, ప్రక్కచూపు 'మధ్యం'!
(అంటే చాలా మసకచూపు)
భూతదృష్టి అత్యుత్తమంగా కనిపిస్తుంది!!
నా అద్దాలు—ఆలోచనల్ని, మాటల్ని, చేతల్ని,
కాళ్లను గూడా కంట్రోల్ చేస్తాయి!
గతాన్ని భవిష్యత్తుగా చూపుతాయి!!

ఈ అద్దాల్లోంచి చూస్తున్న చూపు,
సంకుచితం అంటున్నారు.........?
ఆ మాట నిజమా ?
ఒప్పుకోడానికి మనసొప్పడం లేదు!
ఈ అద్దాలు తీసేసి చూడగలనా?
అద్దాల్లోంచి ఈ జంబూద్వీపం రవివర్మ చిత్రంలా కనిపిస్తుంది!
అద్దాలు తీసేస్తే డీమెన్ కార్టూన్‌లా
ఈ ప్రపంచం ఎన్నో ఖండాలుగా,
న. పా. చిత్రాల్లా పలురంగులుగా కనిపిస్తుందట!
బాపూ బొమ్మల్లా బావుంటుందట!!
నాకేదో భయంగా వుంది!?

నా వేదాంతం, నా మతం, నా కులం,
నా 'మధుర గంభీర—తెలుగూ' ఎట్లా కనిపిస్తాయో ?
అసలు అద్దాల్లేకుండా చూడవచ్చా ?
తెలిసిన పెద్దలు చెప్పండి!
ఈ అద్దాలు నాకు అమరాయని, చక్కగా వున్నాయని,
దృష్టిదోషం తొలగించి లోక కల్యాణ దృష్టి ప్రసాదిస్తాయని.
మోక్షమార్గం చూపుతాయని—
శ్రేయోభిలాషు లంటున్నారు.........

అమ్మా నాన్నా పోయారు—
పెనవాళ్లు ఏమయ్యారో తెలియదు—
మీరైనా చెప్పండి, ఈ అద్దాలు తీసెయ్యాలా ?
ప్రపంచంలో అందరూ వాళ్లవాళ్ల అద్దాలు తీసేశారా ?
భారతదేశంలో అన్నిరాష్ట్రాలవాళ్లూ తీసేశారా ?

మా తమిళులు? మా కన్నడిగులు?
తీసేశారా?
మరి నేనూ తియ్యాలా?
గొ(్రె దాటు కాదు గదా ?

(ప్రపంచం ఎట్లా కనిపిస్తుందోనని భయంగా వుంది!
ఓ స్వర్గంలో వున్న నా తలిదం(డులారా!
నా వాళ్లారా!
నాకు కల్లో గనబడి మీరైనా చెప్పండి,
తీసెయ్యమంటారా ?
ఏమో నా కర్మ, తీసేస్తాను!
ఈ (ప్రపంచం ఎప్పటిలాగే నగించి నట్టు కనిపించకపోతే
మళ్లీ వుంచేసుకుంటాను!
తర్వాత మళ్లీ ఎప్పటికీ తీను!!
నా కర్మకు నన్నిట్లాగే వదిలెయ్యండి;
నా తలిదం(డుల్లాగే బతికి. స్వర్గానికి పోతాను!
నేను వాళ్ల బిడ్డను!!
నన్ను తొందరపెట్టకండి....
మీరు అద్దాలు తీసేసి, టెలిస్కోపుల్లో చూస్తున్నారు!
బుల్లిచుక్కలు (బహ్మండా లంటున్నారు!
అమ్మ బాబోయ్!
నాకు గత్తర పుడుతోంది;
జడుపు జ్వరం వచ్చేట్టుంది!
నన్ను కొంచెం నెమ్మదిగా బతకనీండి!
మీాకు పుణ్యం వుంటుంది.....
ఈ అద్దాలు నాకు అడ్జస్టయిపోయాయి :
తీసి చూశ్లాను!
అంతగా అయితే నిదానంగా చెప్తాను—
మా వాళ్లంతా తీసెయ్యనీండి!

సాహిత్యంలో రాజకీయాలు

"సంశోధక్"

స్వదేశానికో, స్వసంఘానికో, చివరకు ఎక్కువమందికో శ్రేయస్సంధాయకమైన ప్రయత్నాలు, ఆ ప్రయత్న సాధనకు, సిద్ధికి వేసే ఎత్తులూ పైఎత్తులూ రాజనీతి అని, రాజకీయాలని లోకజ్ఞులయిన ధర్మశాస్త్రజ్ఞులు నిర్వచించారు. రాజనీతి పరమ లక్ష్యం ఎక్కువమంది నిశ్శ్రేయసం. తత్సాధనకు రాజనీతిజ్ఞులు వంకరదారులు తొక్కినా, లక్ష్యం ఉత్తమం గనుక జనం దానిని తెగడక, అలాటి ఆరంభాలు ఫలానుమేయాలనే నమ్మకంతో పొగడేవారు. ఇలాటి రాజనీతిజ్ఞులకు సంఘంలో గౌరవం వుండడంలో ఆశ్చర్యంలేదు. ఆ రాజనీతిజ్ఞులు కూడా సంఘంలో తమ గౌరవ స్థానానికి భంగమో, విచ్యుతో కలుగకుండా నడుచుకునేవారు.

కాని, క్రమంగా ఈ లక్ష్యం కలుషితమై, స్వార్థంపాలు ఎక్కువయి, ఎత్తులు, పైఎత్తులు మాత్రమే రాజకీయాలనే అపోహ ఏర్పడి, తెలివితేటలు కేవలం ఎదుటివారిని పడగొట్టడానికే వినియోగమైపోవడంతో రాజనీతి, రాజకీయాలు జీవంలేని కళేబరాలై దుర్గంధ దూషితాలయాయి. రాజనీతిని తాము పైకి రావడానికి ఎలా వినియోగించుకుందామనే చూపు ప్రబలిపోయి, సంఘంలో స్వార్థపరులు అసంఖ్యాకంగా ఏర్పడ్డాయి. ఈ వికారమే సాహిత్య క్షేత్రంలోను ఇటీవల ప్రబలింది. సాహిత్యం సంఘ ప్రతిబింబమని వూరికే అన్నారా పెద్దలు?

ఈ వికారం లక్షణాలు నిర్వచించడం కష్టమే. ఇది విశ్వరూపి. కాని, వాస్తవమైన జ్ఞానసముపార్జనకు ప్రయత్నించక పోవడం, ఏవో రెండు పుటలు చదివి సర్వజ్ఞులమని అనుకోడం, తమ చుట్టూ కొందరు వైతాళికులను చేర్చుకుని, తమ కీర్తి లతను పెంచడంలో నిమగ్నులు కావడం, ఆశ్రితులకు అడపాదడపా ప్రజల ధనాన్ని విదిలిస్తూ వుండడం ప్రధాన లక్షణంగా విస్తరించవచ్చు. ఈ మంద వేయడమనే వ్యాపారంలో కొంచెం పైమెట్టు సభలు, సమావేశాలు, తర్వాతి మెట్టు కవితాగోష్ఠులు.

సభలు, సమావేశాలు; సంఘంలోని వారి మనోవికాసానికి అవసరమే. కాని, అవి ఏ ఒక్కరి జీవన ప్రాసాదానికో మెట్లు కారాదు. కొందరు ఒకచోట చేరడం, ప్రాచీన నవీన కావ్యాలలోని మధుర ఘట్టాలను పఠించడం, వాటిపై చర్చలు జరపడం మంచిదే. అదొక స్వప్రయోజనం కోసమయినప్పుడే దూష్యమవుతుంది.

కవిసమ్మేళనాలు

ఈ కావ్యగోష్ఠులు కవి సమ్మేళనాలు గత సంవత్సరం మరీ ముదిరిపోయి, పాతకాలపు మధ్యయుగాల రాజరికం అవసాన దశలోని నికృష్ట పద్ధతిలో జరిగాయి, జరుగుతున్నాయి. నిజమైన కవి సమ్మేళనాలు శ్రావ్యంగానే వుంటాయి. కాని, ఏదో సంప్రదాయమయినట్టు ఊరిలోని మోతుబరిని పట్టుకుని కవిసమ్మేళనాధ్యక్ష పదవికి పట్టంకట్టడం, ఏవో చదవడం పాడడం—ఇలా ఒకరిని పైకి తోయడానికో, తనకు ఇష్టమైన వారిని గౌరవించే తలంపుతోనో జరిగాయి. ఈ సభలు పూర్వం నవ్యసాహిత్య పరిషత్తు వారు, సాహితీ సమితి వారు, తుదకు అభ్యుదయ రచయిత సంఘంవారు జరిపిన సమావేశాల వంటివయినా కొంత మేలు జరిగేది. ఆ సభలలో పరస్పర స్తుతి, పరస్పర రచనా ప్రోత్సాహం వున్నా పలువురు ఉత్తమ రచయితలూ పైకి రావడానికి అవకాశం కలిగింది.

ఈ కవిసమ్మేళనాలకు ప్రతిరూపాలే అయాయి రేడియో కవిసమ్మేళనాలు కూడా. ఇవి ఆరంభమయి రెండు దశాబ్దాలు, రెండు ప్రభుత్వాలూ గడిచినా, కొత్త కవి గొంతు ఇంగున 1966 లోను వినబడలేదు. సహస్రమాస జీవుల, షష్ట్యబ్ది పూర్ణుల గొంతుకలే మళ్లీ మళ్లీ వినబడ్డాయి. అప్పటి కూనిరాగాలే, అప్పటి విరుపులే. నడివయస్సు వారిలోను కొత్త పోకడలు వినిపించలేదు. వచనగంధి పద్యాలతో విసిగించిన ఆ పాతవారే, ఆ ధోరణులే.

చదివే తీరు విందామా? మరీ ఘోరం. కొందరికి సంగీతం నగమెరిక, కొందరికి "పూర్తి ఎరిక". సంగీతం వదలివేద్దాం; శ్రావ్యత అనేది రేడియో ప్రసారాలకు ప్రధానమైన లక్షణం. కవితలో రీతి వృత్తి శయ్యా పాకాల ఉద్దేశమేమిటి? శ్రావ్యతతో ఆకృష్టుడయిన శ్రోతకు త్వరగా భావార్థాలు బోధపడి రసప్రతీతి కలుగాలనే కదా! పఠనం పట్లు ఇలా వుంటే, శ్రోతకు భావార్థాలే బోధపడనప్పుడు రసానుభూతి ఎలా కలుగుతుంది? శ్రోతృగణ వర్ధన కోసమే సంస్కృత నాటకకారులు శ్లోకాలకు రాగాలు సూచించి, వాటికి కాల దేశ వర్తమానాలు కూడా నిర్దేశించారు. అయితే మన కవులందరూ గాయకులుగా వుండాలని అనడంలేదు. శ్రావ్యంగా, అదీ చేతకానప్పుడు, స్పష్టంగా, శ్రోతలకు సుబోధంగా పఠించడం ముఖ్యం.

రేడియో కవితాప్రియులకు మరొక ఇబ్బంది కూడా వుంది. ఎంత చెవులు రిక్కించికొని కూర్చున్నా, కొన్నికొన్ని పదాలు, వాతావరణ సంక్షోభం వల్ల వినబడవు. విన్నదానితోనే వారు సంతృప్తిపడి, అర్థమైనంతవరకే సరిపెట్టుకుని వూరుకోవలసి వస్తుంది. శబ్దతరంగాల వేగం మనోవేగానికి మించింది కాకపోయినా, రేడియో కవితా రస తరంగాలను అందుకోడం మన చెవికీ, మనస్సుకూ చేతకావడంలేదు. అందువల్ల రచయితలు నీళ్లు నములడాలు, ముద్దమాటలు మాని, స్పష్టమైన ఉచ్చారణతో

భావావేశాన్ని ప్రస్ఫుటంచేస్తూ శ్రోతను ఆకట్టుకోడం అవసరం.

నవ్యత, ప్రయోజనం, ఉపయోగం, ఆనందంలేని రేడియో కవిసమ్మేళనాల లక్ష్యం ఏమిటో జనం ఆలోచించి, తమ సొమ్ము ఈ విధంగా వమ్ముకావడాన్ని ఆపాలి.

ఆ ఖ రు మె ట్టు

ఈ స్వప్రయోజన సాధన ప్రక్రియలో, అభ్యున్నతి సోపానాల్లో ప్రస్తుతానికి ఆఖరు మెట్టు అంకితోత్సవం. గత సంవత్సరం ఒకమాదిరి గవర్నమెంటు ఆఫీసర్లు తమపై వారినో, మంత్రులనో మెప్పించి ప్రమోషన్ల కోసం జరిపినంత పుస్తకాంకితాధ్వరం ఇదివర కెన్నడూ జరుగలేదు.

ఈ అంకితోత్సవాలనేవి తెలుగువారి స్వోపజ్ఞాలు. నన్నయ భట్టారకుడు మొదలయిన వారు తమ ఆప్తులకు, పోషకులకు తమ కృతి వినిపించి, వారిని శ్రోతలనుచేసి, వారి నామాంకితంచేసి రచనలతో వారిని ప్రాచుర్యానికితేగా, తక్కినవారురాజుల, ప్రధానుల, సేనానుల, వారి ప్రియురాండ్ర అనుగ్రహం కోసం వారి పుట్టుపూర్వాలు చిలవలూ పలవలూగా అల్లి గ్రంథ అవతారికనే ఒక కావ్యంగా చేసి, ఇచ్చుకొనాడారు. ఈ పద్ధతిని ఏ జమీందారో కవిని పిలిపించడం, "కప్పురపు వీడెం" వాడి మొఖాన కొట్టడం, ఒక పుస్తకం వ్రాసి, తన పేరును ఆ పుస్తకంలో అంకితం చేయమని కోరడంగా దిగజారి, తుదకు కొందరు నరాంకితం చేయబోమని భీష్మించుకుని, "నిజదార సుతోదర పోషణార్థమై" కందమూల కౌద్దాలికులు కావడం, శ్రీనాథుని వంటివారు, జీవితం బాగా అనుభవించదలచిన వారు రెడ్డి రాజులకు, వారి అన్నయమంత్రికి, వ్యాపారి అయిన అవచితిప్పయ్య శెట్టికి, ప్రతివాడికీ పుస్తకం అంకితమిచ్చి అందరినీ సంతోషపెట్టి తను రెండు డబ్బులు చేసుకోడం జరిగాయి. కావ్యం సప్త సంతానాలలో ఒక్కటి కావడమనే ధార్మిక చింత కన్నా, కావ్యం శాశ్వతం కాబట్టి, దానిలో ఉట్టంకితాలయిన తమ పేర్లు గూడ శాశ్వతంగా వుంటాయనే కీర్తి లోభమే ఎక్కువయింది. అంతమాత్రాన వచ్చే కీర్తి ఏపాటిదో ఇప్పటి చూపుతో చూస్తే మనకు అర్థంకాదు.

అలాటి వారు ఇప్పుడు అడుగడుగునా పుట్టుకొచ్చారు. తమ పేరు అచ్చులో చూస్తేనే మురిసిపోయే వీరు ఒక రచయిత తమ పేరును తమ రచనలో పొందుపరచి పదిలం చేస్తున్నప్పుడు ఎందుకు ఆనందించరు? అపరిణత మనస్కత, అపరిపక్వ బుద్ధిత ఇలాగే వుంటాయి.

గత సంవత్సరం ఒక సుమారయిన గెజెటెడ్ ఆఫీసర్ తమశాఖమంత్రి పుంగవునికి ఒకగ్రంథం అంకితమిచ్చారు ప్రమోషన్ కోసం. మరొక పండితుడు ఒక విశ్వవిద్యావేత్త పత్నీమణికి అంకితమివ్వడానికి ప్రయత్నించాడు ఆచార్య పదవి కోసం. మరొక పెద్దఆఫీసరు ఆ పై మెట్టు కోసం మంత్రికీ, మంత్రి మిత్రునికీ, మరికొందరికి పుస్తకాలు పుంఖానుపుంఖంగా అంకితమిచ్చారు. సినిమా మహానటుల ప్రేమ కోసం అంకితమిచ్చిన పుస్తకాలు కొక్కు. ఆ మహానటులకు ఆ కావ్యాలలోని పద్యాలు పఠించడానికి తీరిక ఏదీ? ఒక్కొక్క నిమిషమూ వారికి కొన్నివేల ఖరీదు. ఈ పద్యాలు వింటూ, చదువుతూ కూర్చుంటారా?

ఈ అంకితోత్సవాలకు మరొక మంత్రి ఆవిష్కరణోత్సవం, ఇంకొక మంత్రి అధ్యక్షోపన్యాసం, పుసమంత్రి ఉపసంహారోపన్యాసం—ఇలా అంతా ఒక "రాకెట్".

అంకితోత్సవాలలోను పరాకాష్ఠ "భాషన్నా తెలియని" వారికి అంకిత మివ్వడం. పూర్వం ఒక కవి భారతాన్ని సంగ్రహంగా రచించి ఒక నవాబుగారికి అంకిత మిచ్చాడట. నవాబుగారు ఖుష్ అయిపోయి అతనికి అగ్రహారాదికం ఇచ్చి సత్కరించాడట. ఆ కవి అంటే గిట్టని వారెవరో నవాబుగారి చెవిలో వూదారట, మీకు అంకితం ఇచ్చిన పుస్తకం వట్టి రంకు పురాణమని. దానితో నవాబుగారు అగ్గి అయిపోయి, కవిని పిలిపించి నానా అవమానాలు చేశాడట. అవమానం మినహాగా అచ్చంగా అలాటి ఉదంతమే జరిగింది ఆమధ్య. ఒక ఆంధ్ర పరిశోధకుడు తను ఒక తెలుగు మహాకావ్యంపై వ్రాసిన పరిశోధన గ్రంథాన్ని భాష తెలియని ఒక మంత్రికి అంకితమిచ్చాడు. ఆయన అంకితం పుచ్చుకుంటూ, "నాకు తెలుగు తెలియదు. తెలుగును గురించి తెలుసుకున్నాను. ఒకటిరెండు మాటలు కూడా పలుకగలను." అన్నాడు. ఇలాటి అంకితాలు ఎవరికి ప్రీతి!

నిరుడూ ఇలాటిదే జరిగింది. తెలుగు సాహిత్యం ఏమీ తెలియని కాంగ్రెస్ అధ్యక్షులు ఒక కావ్యాన్ని ఆవిష్కరించారు. ఆ కావ్యం, తెలుగు తెలియని ఒకరికి అంకితమిచ్చినట్టిది. తెలుగు రచన ప్రధానవృత్తి కాని మరొకరు గడచిన రోజులను గురించి వ్రాసిన ఒక ఆత్మకథవంటి గ్రంథాన్ని తెలుగు తెలియని కాంగ్రెస్ అధ్యక్షుడే అంకితం పుచ్చుకున్నాడు. ఆ అంకితోత్సవానికి ఒకమంత్రి అధ్యక్షుడు, మరొక మంత్రి ప్రారంభకుడు.

అంకితాలు ఇవ్వడం గురించి ఎలాటి ఆక్షేపణా ఎవరికీ లేదు. ప్రేమతో, స్నేహంతో, ఆదరంతో, గౌరవంతో, కృతజ్ఞతతో ఎవరికైనా ఇచ్చుకోవచ్చు. కాని, అది ఏదో భవిష్యద్దృష్టితో, స్వప్రయోజన ప్రాపాద నిర్మాణ లక్ష్యంతో జరిగితేనే ఈ విమర్శంతా.

ఇది ఇలా వుండగా, ఈ పద్ధతికి విరుద్ధంగా మరొక విడ్డూరపు పద్ధతి బయలుదేరింది. కొందరు అతితీవ్రవాదులయిన యువకులు "దిగంబర కవుల"నే పేరుతో కవితా సంపుటాలు ప్రచురించారు. మొదటి సంపుటాన్ని 1965 ఒక రిక్షావాలాతో నడిరేయి ఆవిష్కరింపజేశారు. మొన్నటి డిసెంబరులో "దిక్కులు—30" అనే కవితా సంపుటిని "దీనంగా హీనంగా హేయంగా చండాలంగా వుండే ఆంధ్రదేశమనే మురికి గుంటలోని" విజయవాడలో ఆవిష్కరించారు. ఈ పద్ధతి ప్రమోషన్ల కోసం పాటుపడడం కాకపోయినా విడ్డూరమైన అగాయిత్యంగానే వుంది. సహృదయులెవరో కొందరు చేరి పుస్తకంలోని నాలుగు పద్యాలు చదివి ఆనందించి, ఆవిష్కరించుకోవచ్చు గదా!

విమర్శంటే ఇంకా అసహనం

నిరుడు మరొక వైపరీత్యం విమర్శాసహిష్ణుత ఇంకా పెరిగిపోవడం. మనం వ్రాసింది సర్వాంగసుందరం, సర్వతోభద్రం అనే

రచయిత ఎలా ఎదుగుతాడు? మనం వున్నది సంఘంలో. మన అభిప్రాయాలను అభినందించే వాడూ, అధిక్షేపించేవాడూ ఉంటాడు ఈ సంఘంలో అనే పరిజ్ఞానం అవసరం కదా! అది లేకపోతే, మనిషే కాదు, రచనా ఎదగదు; అలాటివారున్న సంఘమూ ఎదగదు. అన్ని విషయాలలోను రాజకీయ నాయకులను తూ.చ. తప్పకుండా అనుసరించే ఈ సాహిత్య సేవకమ్మన్యులు విమర్శ సహిష్ణుత విషయంలో వారిని ఎందుకు అనుసరించరు? ఎదిరి పార్టీవారు ఉమ్మివేసినా, కండువా కొనతో తుడుచుకుని గంటల తరబడి ప్రసంగించారు ఒకప్పుడు రైట్ ఆనరబుల్ శ్రీనివాస శాస్త్రి. చెప్పులు తనమీద వర్షించినా, చెక్కుచెదరక నిలబడ్డారు వేదికమీద రాజాజీ. గాంధీజీ సంగతి చెప్పనే అక్కరలేదు. సహనం పెంచుకున్న కొద్దీ తమ అభిప్రాయాలను ఎదుటివారికి నచ్చచెప్పగలమనే అభిప్రాయం రచయితలకు ఎప్పుడు కలుగుతుందో! పూర్వపు పండితుల గోష్ఠులలోను, వాక్యార్థాలలోను ఏ పండితుడైనా ప్రతిపాదించిన సిద్ధాంతాన్నో, పఠించిన కావ్యాన్నో పదిమంది పండితులూ కలిసి చీల్చి చెండాడేవారు. ఆ పోరుకు తట్టుకునేదే నిలబడేది. ఎదుటివారు-విమర్శకులు-కూడా వైయక్తిక విద్వేషం వుంటే తప్పు తూలనాడరు కదా! ఒకరికి అలాటి ద్వేషమే వున్నా, గోష్ఠిలోని పండితులందరూ అలాటివారు అయివుండరు. పాత సంస్కృత కవి అన్నట్టు "మణిశ్శాణోల్లీఢః, సమరవిజయీ హేతిదలితః"—సానపెట్టిన మణి, ఆయుధాల గాయాలు తగిలిన సమరవిజయి ముచ్చట గొలుపుతారు. కనుక విమర్శ అచ్చమైన పరీక్ష రచయితలకు. దానికి గింజుకుంటే నష్టం వారికేగాని విమర్శకులకు గాదు.

ఈ అసహిష్ణుతలు సాహిత్య అకాడమీల వంటి వాటిలోనే వున్నాయి. ఈ సంస్థల సభ్యులు పరస్పరం దూషించుకోడం అన్నిచోట్లా కనిపిస్తుంది—మనదేశంలో మరీ హెచ్చుగా. ఒక విషయంలో వారిలో వారికే ఏకవాక్యత లేక వివదించుకోడానికి తార్కాణాలు వందలు వేలు చెప్పవచ్చు. ప్రసక్తానుప్రసక్తంగా అకాడమీల సంగతి వచ్చింది గనుక మన సాహిత్య అకాడమీల విషయమూ చూద్దాము.

సాహిత్య అకాడమీలు

"పులినిచూచి నక్క వాత పెట్టుకున్నట్టు" అనేది సామెత. సామెతలనేవి కొంత ఊహతో, కొంత పోలికతో, కొంత అతిశయోక్తులతో, కొంత వివరీత లక్షణతో పుడుతుంటాయని భాషావేత్తలంటారు. కాని, ఈ సామెత మాత్రం మన సాహిత్య అకాడెమీల విషయంలో అక్షరాల వర్తిస్తుంది. తలస్పర్శి అయిన పాండిత్యంతో, అనుభవ వైవిధ్యంతో పండిన వారితో నిండారిన విదేశాల అకాడెమీలు చూచిన మన ప్రభుత్వమూ, సాహిత్య పోషణ తన బాధ్యతలలో ఒక్కటి గనుక అకాడెమీలు స్థాపించింది. ఈ అకాడెమీలలోను, కులాలు, మతాలు, ముఠాలు, పీఠాలు, జిల్లాలు, కూటాలు, లింగభేదాలు—ఒకటేమిటి? సకలకల్యాణ గుణాలు అబ్బాయి ఈ సంస్థలకు. ఫ్రెంచి అకాడెమీలో బాల్జాక్ వంటి రచయితకు స్థానం దొరకలేదు. సభ్యత్వం కావాలని, తనను అకాడెమీ గుర్తించాలని బాల్జాక్ అంగలార్చిపోయాడు. ఆంద్రేజీడ్ వంటి వానికి అకాడమీ సభ్యత్వం ఇవ్వలేదు. ఇంకా పరిణతి పొందలేదు పొమ్మన్నది. మన అకాడెమీలు అలాకాదు. సంచి చేత పట్టుకుని, ఇంటింటికీ వెళ్లి, ప్రతి గడప ఎక్కి దిగి చందాలు సేకరించి, రశీదులు చించి యిచ్చే వారు చాలామంది మన అకాడెమీలలో పీఠం వేసుకున్నారు. అకాడెమీలు పాండిత్యానికి పరాకాష్ఠగా, గీటురాయిగా వుండాలనే పట్టుదలగాని, ప్రయత్నంగాని ప్రభుత్వానికిగాని, అకాడెమీ అధిష్ఠాతలకుగాని లేదు. ఏవేవో అభిమానాలతోను, అభిప్రాయాలతోను సభ్యత్వం ఇవ్వడం, ఏదో రూపంగా కొంత ముట్టచెప్పడం పరిపాటి అయింది. లేకపోతే సారస్వత సంఘాల నుంచి ఎన్నికల ద్వారా సభ్యులను ఏరుకోడం ఏమిటి? సారస్వతానికి కూడా వయోజన నియోజనాధికార సూత్రం వర్తింపజేస్తే, మంద వేయడమనే మంత్రం జపిస్తే, మరేముంది? సారస్వతంలో విద్వత్తుకన్నా మందీ మార్బలం కూడగట్టుకునే చాతుర్యం వున్నవారే సభ్యత్వం సంపాదించి, సిసలైన విద్వాంసులను తోసిరాజంటారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ 1957 ఆగస్టులో ప్రారంభమయినది మొదలు జరిగిన అన్ని ఎన్నికల తంతూ ఇదే. ప్రజాస్వామ్య మ[illegible]ని అన్నివర్గాలకు సమానావకాశమిచ్చి, ప్రోత్సహించడంలో చూపడం సముచితం, సహేతుకంకాని, అర్హతానర్హతా తారతమ్య పరిజ్ఞానంలేక పదవులు కట్టబెట్టడంలో చూపడం ఉచితమూ కాదు, సహేతుకమూ కాదు. ఈ పద్ధతివల్ల ఆర్థిక వ్యవస్థలో ఇన్‌ఫ్లేషన్ లాగే అర్హతల విషయంలో ఇన్‌ఫ్లేషన్ ఏర్పడి, మనిషి విలువ పడిపోతుంది, అలాటి మనుష్యులున్న సంస్థ విలువ మరీ తగ్గిపోతుంది.

ఈ అకాడమీ రచయితలను ప్రోత్సహించడం కోసం బహుమతులు నిర్ణయించింది. ఏవో కొన్ని విషయాలు పోటీకి ప్రకటించి, పోటీకి వచ్చిన వాటిలో ఉత్తమమైన వాటికి బహుమతు లిస్తున్నది. ఈ పద్ధతి ప్రకారం 1966—67 కు అకాడెమీ ప్రకటించిన విషయాలు (1) తెలుగులో తిట్టు కవిత్వం, (2) 1900 సంవత్సరం వరకు తెలుగు కావ్యాలలో అవతారికలు.

ఆయా సంవత్సరాలలో ఎంతో పరిశోధించి వ్రాసిన గ్రంథాలను ఏరి ముద్రింపు చేయించి, వాటికి బహుమతి ఇవ్వడం న్యాయంకాని, ఏదో విషయం ఇచ్చి కొంత వ్యవధి యిచ్చి, ఫలానా రీతిగా పుస్తకం వ్రాయమని పరీక్ష పెడితే, ఎలాటి రచనలు ఉద్భవిస్తాయో సహృదయ హృదయమే ప్రమాణం. ఇలాటి పద్ధతికి అభిమానధనులైన రచయితలెవ్వరూ పూనుకోరు; ఎవరో డబ్బు కక్కుర్తికి పూనుకున్నా మంచిపుస్తకాలు రావు; పేలవంగా తయారవుతాయి. అకాడమీ వంటి సంస్థ వ్రాయించే పుస్తకాలు ఇతర రాష్ట్రంవారు ఇతర దేశంవారూ మెచ్చదగిన అపూర్వ అముద్రిత విషయాలపై వుండాలిగాని, ఉత్తరోత్తరా భారతీయ సంస్కృతికి మరికొన్ని మణిభూషలు కాగలవిగా వుండాలి గాని, తెలుగువారయినా మరొకమారు చదవనట్టివిగా వుండరాదు. తిట్టు కవిత్వం ఏమంత పెద్ద సమస్య? అవతారికల జాబితా వ్రాయించకపోతే అకాడమీకి అపకీర్తి రాదుకదా! ఈసారి ఈ రచనలకు గడువు మరీ వింత! నవంబరులో ప్రకటన వెలువడింది. గడువు డిసెంబరు 31. ఈ రెండునెలల్లో రచయిత—అంటే

పరిశోధకుడు గ్రంథాలయాలకు వెళ్లి విషయం సేకరించుకొనే తీరికలేక (అన్నిపుస్తకాలూ తనవద్ద వుండవు గనుక), తనకు సాధ్యమయినంత వరకే కృషి చేసి పంపే సావకాశములేక సతమతమయి, ఏదో అరకొరగా వ్రాసి పంపుతాడు. ఇంత కొంచెపు వ్యవధి వల్ల ఇతరులకు కలిగే అనుమానం ఏమిటంటే, అకాడమీ ఆశ్రితులెవరో ఈ రెండు విషయాల పైన ఇదివరకే వ్రాసిన పుస్తకాలు వుంటాయని, వారికి అకాడమీ ధనం ముట్టజెప్పడానికి ఈ ప్రకటన జరిగింది అనిన్నీ.

ఇక అకాడమీ నవ్యాంధ్ర సాహిత్య గ్రంథాలకు బహుమతులిచ్చే తీరు మరీ వింత. ఇంతకుముందు చెప్పిన అకాడెమీ సభ్యత్వపు ఎన్నికలలాగే ఈ బహుమానార్హ గ్రంథ పరిగణనా జరుగుతుంది. అకాడెమీ సాహిత్యంలో ప్రయోజనములని అనుకున్న వారి బహుమతికి అర్హమైన పుస్తకాలను సూచించండని కోరుతుంది. వారు కొన్ని పుస్తకాలను పౌర్వాపర్యంతో సూచిస్తారు. అకాడెమీ వాటిలో "కావలసిన సమ్మతులు" లభించిన పుస్తకాలను పట్టీగా వ్రాయించి, మరొక దఫా వోటింగుకు పంపుతుంది. దానిలో కావలసిన సమ్మతులు లభించిన రచనను కొందరు "న్యాయమూర్తుల" నిర్ణయానికి పంపుతుంది. ఈ "న్యాయమూర్తులు" ఏదో ఒక పుస్తకాన్ని ప్రశస్తమైనదిగా నిర్ణయిస్తారు.

బహుమతి నిర్ణయంలో అకాడెమీ కొన్నిసూత్రాలు, సూక్తులు ఉద్ఘాటించింది.

(1) ఫలానా రచన బహుమతికి అర్హమో, కాదో సూచించేటప్పుడు రచయిత తెలుగు సాహిత్యానికి చేసిన సేవ, తెలుగు సాహిత్యంలో అతని స్థానం మనస్సులో పెట్టుకోవాలి.

(2) అనువాదాలు బహుమతికి అర్హమైనవి కావు.

(3) రచయిత తన రచనల బహుమతికోసం సలహాదార్ల, రెఫరీల సమ్మతికై ప్రచారం (కాన్వాస్) చేసుకుంటున్నాడని అకాడమీ కార్యనిర్వాహక మండలికి సంతృప్తికరంగా నిరూపితమైతే, ఆ రచన బహుమతికి అర్హంకాదు.

కాని, రాజకీయాలలో వోట్లకే ప్రచారం చేసుకుంటున్నప్పుడు, ఆ పద్ధతిలోనే నడిచే ఈ వోటింగులో కాన్వాస్ ఎందుకు చేసుకోరాదో అర్థం కావడంలేదు. ప్రతివారికి తమతమ పిల్లలు ముద్దయినట్టు, తమ రచనలూ ముద్దుగాను, పెద్దగాను కనిపిస్తాయి.—ఎంతో ధీరోదాత్తులకు తప్ప. అందువల్ల పబ్లిక్ పరీక్షకో, విశ్వవిద్యాలయ పరీక్షకో వెళ్లిన విద్యార్థి తండ్రి లేక పోషకుడు పరీక్షయిన వెంటనే తన కుమారుని గట్టెక్కించడానికి ఆసేతు శీతనగం మార్కుల యాత్ర చేస్తున్నట్టు బహుమానాపేక్షి సపరివారంగా ప్రతి రెఫరీ, ప్రతిన్యాయమూర్తి గడప ఎక్కిదిగడం, ఇలా పెక్కు ఆవృత్తులు (రౌండ్లు) తిరగడం పరిపాటి అయింది.

అకాడమీ నిర్ణయించుకున్న ఈ సూత్రం ఇలా అవ్యాప్తం, అతివ్యాప్తం కాగా, అనువాదాలు బహుమతికి అర్హమైనవి కావనే సూత్రాన్ని కేంద్ర సాహిత్య అకాడెమీయే పలుమార్లు ముక్కలు ముక్కలు చేసింది. మొదటి సూత్రం అసలు ఎవరికీ పట్టనే లేదు. తెలుగుసాహిత్యంలో ఆ రచయిత స్థానం చూడాలంటే, ఆ స్థానం ఎక్కడుంది చూడడానికి? అదేమిటి విక్రమార్క సింహాసనమా? మయూర సింహాసనమా? కనబడదు. దాని స్థానంలో కనబడేది సప్తధాతు సంభరితమైన రచయిత స్వరూపం.

బహుమతి ప్రదాన విషయంలో మరొక ముఖ్యాంశం మరిచాను. సాహిత్యక్షేత్రంలో పూర్వం లబ్ధప్రతిష్ఠులైన పెద్దలు పలువురు ప్రస్తుతం రచనలు చేయడంలేదు, చేసినా అవి పేలవంగా, పూర్వపు రచనల స్థాయికి అందుకోనివిగా వుంటున్నాయి. వారికి బహుమతులు ముట్టజెప్పుదామనే ఆబకొద్దీ కొందరు తదభిమానులు అకాడమీ నియమాలకు అనుగుణంగా వారి రచనలు పాతవి కొన్నీ, కొత్తవి కొన్నీ కలబోసి పుస్తక రూపంగా ప్రచురించి అకాడెమీకి సూచించి, కింది నుంచి పైవరకు ప్రచారంచేయడం ఉద్యమమైంది. ప్రస్తుత రచనలకు బహుమతులివ్వడం ఉచితంకాని, ఇంగువ కట్టిన గుడ్డలకు, చెట్టు పేరుతో వాసికాయలమ్మే వారికి బహుమతులివ్వాలని కోరడం, అవి పుచ్చుకున్నవారు ఆనందించడం ఏమి న్యాయమో అర్థం కావడంలేదు. కేంద్ర అకాడెమీ బహుమతులు గూడ చాలవరకు అలాగే వున్నాయి. బహూకృత గ్రంథాలు తద్రచయిత పూర్వపూర్వ రచనలకు దీటు రాకపోగా, వీరు వారు కారా అన్న అనుమానానికి కూడా ఆస్కారమిస్తున్నాయి. రచయిత రచన పరిణతికి, పరిపక్వదశకు ఉత్తరోత్తర రచన బలీయస్సై తార్కాణమవుతుంది. ఇక్కడ ఈ లక్షణం అవ్యాప్తి దుష్టమౌతున్నది.

కేంద్ర సాహిత్య అకాడెమీ చేయించిన అనువాదాలు కొన్ని తలచుకుంటే ఒళ్లు కంపర మెత్తుతుంది. అది అనువాదం చేయించిన ఆంగ్ల నాటకాలు, వంగ గ్రంథాలు దాని కీర్తికి, దక్షతకు పతాక. అనువాదకుని అర్హత మూలభాషను, అనువాద భాషను పిడిపెట్టడం మాత్రమే కాదు, రచన బాగా చేయగలిగి కూడా వుండాలి. అప్పుడే మూలంలోని సొగసులు అనువాదంలోకి వస్తాయి. కేవలం మూల తాత్పర్యానువాదంతో మూలకారునికి, అనువాదకునికి కూడా వెటకారాలు తప్పవు. గెటే నాటకాలను సర్ వాల్టర్ స్కాట్ అనువదించాడు— గెటే రచనలోని రామణీయకం అనువాదంలో రాకపోవడానికి తన అశక్తతే కారణమని వినయంగా చెప్పుకున్నాడు. షేక్స్పియర్ నాటకాలను చిలకమర్తివారు, ఇతర మహారచయితలు అర్ధశతాబ్దం క్రితమే అనువాదం చేశారు, అవి జనాదరం కూడా పొందాయి. చిత్తశుద్ధిగల ఏ రచయితా తనకు మాలిన అనువాదానికి పూనుకోడు. డబ్బు కక్కుర్తి కోసం పూనుకొనే వారి అనువాదాలు తద్వత్తుగానే వుంటాయి.

అకాడమీ చేయించిన అనువాదాల కన్నా కొందరు రచయితలు స్వచ్ఛందంగా చేసిన అనువాదాలే బాగున్నాయి. మీర్ మహమ్మద్ అలీఖాన్‌గారు "ది మ్యూజింగ్స్ ఆఫ్ ఎ మిస్టిక్" అనే పేరుతో వేమన పద్యాలు ఆంగ్లంలో అనువదించారు. మచ్చుకు ఒక్కటి:

"అడవి దిరుగలేదు ఆకసమున లేదు
అవని దీర్ఘయాత్ర లందలేదు
ఒడలు శుద్ధిచేసి ఒడయుని జూడరా
విశ్వదాభిరామ వినురవేమ."

"We may roam in woods
or soar on the wings
Or take many a dip
in secred springs
None of such pursuits
light to the soul brings
When mind in pure, We
behold the King of Kings"

అకాడెమీ పనులు ఇతర సామాన్య సంస్థలు చేయనట్టివిగా వుండాలిగాని, అది ప్రతి పుస్తక ప్రచురణకర్తకు పోటీ వచ్చేటట్టయితే దాని స్థాయి ఏమిటి? రవీంద్రుని పుస్తకాలో, మరొకరి పుస్తకాలో ఏ ప్రచురణ సంస్థయినా ప్రచురిస్తుంది. అకాడమీ ఆ పనికి పూనుకోనక్కరలేదు. శాశ్వతంగా ఉపయోగపడేవి, జనానికి అందుబాటులో లేనివి ప్రచురించడానికి, సాధ్యమైతే చవకగా అందివ్వడానికి అకాడమీ ప్రయత్నించాలికాని, పుస్తక వ్యాపారంతో పోటీ పడనక్కరలేదు.

మనం ఏ శతాబ్దంలో వున్నామో, విశ్వసాహిత్యం రెక్కలు విచ్చుకుని ఎలా వియద్విహారం చేస్తున్నదో సాహిత్య అకాడమీలు పరిశీలిస్తే, మరికొంత చక్కని నిర్ణయాలు చేయగలవేమో! మనం నేడు, విజ్ఞాన శాస్త్రాలలో, ఆర్థిక రాజకీయాది సాంఘిక శాస్త్రాలలో ఎంతో వెనుకబడి వున్నాము. సాహిత్య అకాడమీల వంటి సంస్థలు, ప్రజల సొమ్మును సాదువుగా వాడవలసిన సంస్థలు విజ్ఞానశాస్త్ర గ్రంథాలను ప్రచురించడం అవసరం. విశ్వవిద్యాలయాలు, ఇంకా ఎన్నో సంస్థలు విషయం ఇచ్చి నిర్ణీతమైన వ్యవధిలో థీసీసులు వ్రాయిస్తున్నాయి. అకాడమీలు ఆ పనిని ఆక్రమించితం చేయనక్కరలేదు.

ఒక మచ్చుతునక

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ ఆశయాలలో మూడవది "నిఘంటువులను, విజ్ఞానకోశములను, గ్రంథ వివరణ పట్టికలను, పదప్రయోగ కోశములను సిద్ధము చేసి ప్రచురించుట. ఈ మార్గమున కృషిచేయు వ్యక్తులకు, సంఘములకు సహాయము చేయుట."

ఈ ఆశయానికి అనుగుణంగా అకాడెమీ నన్నయ పదప్రయోగ కోశము, నన్నచోడ పదప్రయోగ కోశము, శ్రీనాథ పదప్రయోగ కోశము, తిక్కన పదప్రయోగ కోశము సిద్ధపరచింది; తక్కిన ప్రాచీన కావ్యాలకూ సిద్ధపరచదలచింది. వీటిలో నన్నయ పదప్రయోగ కోశం మొదటిది, ముఖ్యమైనది గనుక, దానిని సిద్ధపరచిన పద్ధతిలోనే తక్కిన పదప్రయోగ కోశాలన్నీ సిద్ధపరచారు గనుక దానిని మాత్రమే ప్రస్తుతం మచ్చుకు చూద్దాము.

నన్నయ పదప్రయోగ కోశం అనగానే ప్రతి వాఙ్మయాభిమానీ ఎంతో ఆశిస్తాడు, ఇంతో అంతో పరిశోధన దృష్టి కలవాడు మరెంతో ఆసక్తితో చూస్తాడు. నన్నయ పదప్రయోగకోశ నిర్మాతల బాధ్యత గురుతరమైనది. నన్నయది ఆదికావ్యం. వేద నిర్విశేషంగా ప్రామాణికం. నన్నయ ప్రయోగించిన ప్రతిపదమూ ఆ కోశంలో చేరాలి. సంస్కృత పదాలు మనదేశంలోని వివిధ భాషలలో వివిధ రీతుల అర్థాలలో ఉన్నాయి. మన ఉపన్యాసం హిందీ బెంగాలీ వారికి నవల. మన అవసరం తమిళులకు తొందర. మన కాదంబరి కన్నడులకు నవల. మన నిబంధం హిందీవారికి వ్యాసం. మన నిమంత్రణం హిందీవారికి కేవలం ఆహ్వానం. నన్నయ రక్తం అనే అర్థంలో అరుణ వారి (మాంసపంకారుణ వారి— 1—6—305) అని, యమగృహం అనే అర్థంలో అంతకక్షయం (హంమండు నా డింభకుఁడు నంతకక్షయ గతుఁడైన— 2—1—161) అని, అవిశ్రయం అనే అర్థంలో అనేకాగ్రత అని, కట్టు అనడానికి రచియించుమని ప్రయోగించాడు. ప్రయోగ వైశిష్ట్యం, అర్థభేదం ఉండడాన్ని బట్టి అటివి ప్రతి సంస్కృత పదమూ ఈ కోశంలో చేరవలసి వుంటుంది. ప్రతి పదానికీ ఉదాహరణం, అర్థభేదం చూపవలసి వుంటుంది.

ఈ కోశ నిర్మాణం ద్వారా మనకు నన్నయ కాలపు, ప్రాఙ్నన్నయకాలపు భాషాసాహిత్యాల సంపూర్ణస్వరూపం ప్రత్యక్షం కావాలి. ఈ లక్ష్యసాధనకు ప్రతిపద వివేచనమూ అవసరం. వ్యుత్పత్తి, సజాతీయ భాషా పదాలతోను, సమకాలిక, ప్రాక్కాలిక శాసన పదాలతోను తులనాత్మక చర్చ జరపాలి. వెల్వడు, కీడ్పడు, మన్మడు వంటి శ్లిష్టాక్షర మధ్య పదాలలో పూర్వపదం ఉకారాంతమా, అకారాంతమా అన్న నిర్ణయం జరుగాలి. నన్నయ కాలానికి గసడదవా దేశం నిత్యమే. (దీనికి తెలంగాణా జానపద వ్యవహారం తార్కాణం.) ఉభయ రేఫల సాంకర్యం, పూర్ణార్ధబిందు సాంకర్యం, కవిత్రయం చేయలేదని కొందరు, చేశారని కొందరు అంటారు. పవ్రాప వంటి విశిష్ట ప్రాసల నిర్ణయం, విభక్తి ప్రత్యయాల నిర్ణయం జరుగాలి.

115 సంవత్సరాల క్రితం ముద్రితమైన కరలపాటి వెంకటరంగయ్యగారు సంస్కరించిన భారత ప్రతులలోని పాఠాలు కొందరు పరిష్కర్తలు అధునాతన వ్యాకరణాల ప్రకారం ఎలా దిద్దివేశారో కొన్నిపద్యాలు చూస్తే తెలుస్తుంది.

"పాలిగ ధర్మశీలుఁడయి
భూరిబలాధికుడైన ధారుణీ
పాలకు రక్షమున్ బడసి
భార్యను బుత్రుల సర్థయుక్తి తా
నోలిన మేలుగా బడసి
యూళ్లను నున్నదియట్లుగాని వా
డేల గృహస్థవృత్తి! సుఖ
మేగి వనంబున నుండ్ర కష్టమే?"
(1—6—270)

అని కొన్ని ముద్రిత ప్రతులలోని పాఠం. దీనిని చదివితే మూడవ పాదానికి అర్థం కుదరదు. "మేలుగా బడయు నూళ్లను నున్నది యున్కి, కానివాఁ డేల గృహస్థవృత్తి?' అని రంగయ్యగారి ముద్రిత ప్రతిపాఠం. ఈ పాఠం చూస్తేనేగాని పద్యానికి అర్థం కుదరదు.

"ఇంద్రుడై పరగిన విద్మతేజ (1—2—83) నేటి కొన్ని ముద్రిత ప్రతులలోని పఠం. ప్రాతప్రతులలో "రుంద్ర తేజ" అనే పాఠం వుంది. నన్నయ ఈ సీసపద్యం ప్రతిపాదం రెండవ దళంలోను ప్రాస యతి పాటించి అందం చేకూర్చాడు. "ఇద్ధతేజుడు" అనే పాఠం అంగీకరిస్తే ఈ నియమం, అందం భగ్నమౌతాయి. సాంద్రతేజుడు అనే పాఠమున్నా బాగుంటుంది. ఆ సీసపద్యం పూర్తిగా ఇస్తాను. పాఠకులే అందచందాలు గ్రహిస్తారు.

"బ్రహ్మణ్యుడగు కాశ్యప బ్రహ్మవరమున
వినతకు బుట్టిన యనఘమూర్తి
వాలఖిల్యుల దయ వరపక్షికులమున
కింద్రుడై పరగిన రుంద్రతేజ
దుదధిలో నున్న యత్యుగ్ర నిషాదుల
నారంగ మ్రింగిన ఘోరవీరు
డిభకచ్ఛపముల శాఖిశాఖతో నెత్తి
కొని దివి బఱచిన యనిలవేగి."

ఇలాటి అందాలన్నీ కావాలంటే, ప్రతి పదం పదప్రయోగ కోశంలో చేరాలంటే నన్నయ భారతం ప్రామాణిక పాఠాంతో పరిష్కరించి ప్రకటించవలసిన అవసరం వుంది. అలాటిది జరుగనప్పుడు పదకోశాలూ నిర్దుష్టంగా వుండవు. ఈ అవసరాన్ని గురించి గిడుగు రామమూర్తి పంతులుగారు దాదాపు అర్ధశతాబ్ది క్రితమే రాజరాజ నరేంద్ర పట్టాభిషేక సంచికలో "రాజరాజ కాలమందున్న తెలుగుభాష" అనే వ్యాసంలో తెలిపారు.

నన్నయ పదకోశం అనగానే ఇలాటివి ఎన్నో జ్ఞాపకం వస్తాయి. సాహిత్య అకాడెమీ వారు సిద్ధపరచిన నన్నయ పద ప్రయోగ కోశం చూచిన తర్వాత నేనేకాదు, ప్రతి జిజ్ఞాసువూ హతాశుడవుతాడు.

ఈ నన్నయ పదప్రయోగ కోశానికి శ్రీయుతులు, అబ్బూరి రామకృష్ణరావుగారు, డాక్టర్ దివాకర్ల వేంకటావధాని గారు సంపాదకులు. ఇది డబుల్ డెమ్మీ సైజులో 798 పుటల గ్రంథం. బరువు దాదాపు మూడు వీసెలు. వెల రూ. 40.

"దేశ్య వైకృత పదాల కన్నిటికీ, సంస్కృత సమాలలో క్రియలకు మాత్రమూ ఆరోపాలు కూర్చాలి" మొదలయిన ఎనిమిది నియమాలతో ఈ కోశం సిద్ధపఱచినట్టు సంపాదకులు తొలి పలుకులో తెలిపారు. "ఈ పదప్రయోగ సూచి సహాయంతో నన్నయ భారతభాగానికి నిర్దుష్టమైన వ్యాకరణం వ్రాయడం సులభసాధ్య మవుతుంది. ఈలాటి సూచికలు భాషా తత్త్వాన్ని సువ్యక్తంచేసే విజ్ఞాన దీపాలవటం సమంజసంగానే వుంటుంది" అని ఆ తొలిపలుకులోనే తమ భుజం తామే తట్టుకున్నారు— పదప్రయోగకోశాన్ని చూచిన తర్వాత ఎవరూ తమను అభినందించరని మొదట్లోనే అనుకొన్నారేమో పాపం! "అపరితోష

ద్విరుషిం" అన్నది కాళిదాసు పద్ధతి. "పరితోషో హ్యస్మాకం" అనే పద్ధతి ఈ సంపాదకులందైనట్లు తోస్తుంది.

"గత యుగాలలోని భాషా వ్యవస్థను అవగాహన చేసుకోటానికి ఆయా కవుల గ్రంథాలే ఆధారమైనా, కేవలం గ్రంథాన్ని చదివినంత మాత్రాన అప్పటి పదప్రత్యయాల సుస్వరూపం విదితంకాదు. ఈనాటి భాషతో అప్పటి పదాలను పోల్చిచూడటానికి వీలుండదు. పద ప్రయోగ సూచికల సహాయంతో యే పద మే ప్రత్యయ మే కవి కాలంలో యేవిధంగా వుండేదో తెలిసికోవటానికీ, ఆయాపదాలు పొందుతూ పొందుతూ వచ్చిన పరిణామాన్ని గుర్తించటానికీ అవకాశం కలుగుతుంది. ఈ నన్నయ పదప్రయోగకోశం ఆనాటి పదప్రత్యయాల స్వరూపాన్ని అసందిగ్ధంగా సాక్షాత్కరింపజేస్తుంది..... దీని సహాయంతో సవిమర్శంగా పరిష్కృతమైన నన్నయ భారత ప్రతిని ముద్రించటానికి అవకాశం ఏర్పడుతుంది. భాషా తత్త్వ జిజ్ఞాసువుల కీ సూచీకరణ మెంతగా ఉపకరిస్తుందో చెప్పవలసినపని లేదు." అని కూడా సంపాదకులు తొలిపలుకులో లోకోద్ధరణ, సాహిత్యోద్ధరణ, భాషోద్ధరణ వాక్యాలు వ్రాశారు.

ఈ పదప్రయోగ కోశాలు చూచిన తర్వాత, సంపాదకుల మాటలేవీ సహేతుకమైనవని తోచవు. ఇవి సామాన్యుడైన చదువరికి కూడా ప్రయోజనం లేనప్పుడు, పరిశోధకులకు ఎలా ఉపయోగపడుతాయో అర్థం కావడంలేదు. ఇవన్నీ అర్థవివరణ గాని, విశేషాంశాల చర్చగాని లేని కేవల పదసూచికలు. ఆత్మానాత్మ వివేకమంటే ఏమిటో— వేదాంతులు ఉపన్యసిస్తూ వుంటే— తెలిసేది కాదు. ఇప్పుడు, ఈ పద ప్రయోగకోశాలవల్ల నన్నయ అభిలషితార్థాలు తెలియకపోయినా, ఆత్మానాత్మ వివేకం బాగా కలుగుతుంది, కలిగింది. ఆత్మ భిన్నం అనాత్మ, అనాత్మ భిన్నం ఆత్మ. ఆత్మ అర్థమని (రసం, రీతి ఆత్మ అనే విషయంవేరు),పదం అనాత్మ అని స్పష్టమయింది. ఆత్మ స్థానీయమైన అర్థాలు వీటిలో లేవు గనుక ఆత్మలేని శరీరాలుగా, ప్రాణాలు లేని కళేబరాలుగా ఇవి ఉన్నాయి. నన్నయవంటి ప్రాచీనుల పదకోశాలు ఎలా వుండాలో, జనం ఊహించుకొన్నదేమిటో మొదట్లో మనవి చేసుకున్నాము. ఈ కళేబరాలకు లక్షలు కుమ్మరించి తమ సొమ్ము దుబారాచేశారే అనే ఆవేదనతో ప్రజలు కుములిపోతారు. ఆ ఆవేదన ఎంత సమంజసమో చెప్పడానికి నన్నయ పదప్రయోగకోశంనుంచి తొట్టి అనే మాట వివరణ భాగాన్ని ఇక్కడ ఉదాహరించడం పాఠకులకు ఎంతో మనోవికాసం కలిగిస్తుంది.

తొట్టి=పాండుభూపతి దొట్టిసకల ధరణీశులెల్ల 2—1—?2
ఉత్తర కురూత్తము దొట్టి యుత్తర
దారుణీశులు వశ్యులై 2—1—241
భీష్ముదొట్టి సద్బంధుజనుల్ 2—1—285
గంధర్వ హయంబుదొట్టి దుగ్ధసావశారి
తండుల ఖాదనంబులం బెరుగుచున్న 2—2—177
అమరినాథు దొట్టి యమరులెల్ల 3—1—376
పరము దొట్టి సాలుపతమాదిగా పాండు
యశంబు వెలుంగుచుండ నా ఖండలుదొట్టి 3—1—390
నలుదొట్టి యున్న జేతాకారులై 3—2—54
ఈనున వీటుదొట్టి సురలెల్ల నభీష్టవరంబు
లిచ్చుటన్ 3—2—295
అమరపతి దొట్టి వేల్పులు 3—3— 3
ఇట్లు కాలకేయులం దొట్టి 3—3— 43
శతక్రతు లోకము దొట్టి 3—3—57
దొమ్మ్యదొట్టి సకల ధరణీసురులు 3—3—300
త్రిదశేంద్రుం దొట్టి యున్న దిక్పాలవరుల్ 3—4— 37
ఇంద్రు దొట్టి సురలెంతయు సంతసమందగా 3—4—72
(పుట 544.)

తొట్టి అనేపదం ఇన్నిసార్లు ప్రయుక్తమైందీ జాబితా వేశారు. బాగానే వుంది. దానివల్ల ప్రయోజనం ఎవరికి?దాని అర్థం అంతో ఇంతో ప్రకరణాన్ని బట్టి తెలుస్తుంది గనుక పంచమీ విభక్తి ప్రత్యయం అని సామాన్య భారత పురాణశ్రోత కూడా గ్రహిస్తాడు. కోశకారులని అంతమాత్రంతో వీరు లేరు గదా! తొట్టికి మూలమైన తొడరు— తొడర్ క్రియ, ఆరంభమగు, మొదలగు అనే అర్థాలు, తెలుగుతోబుట్టువులతో దానిసామ్యం మొదలయినవన్నీ చర్చించడం అవసరం కదా! ఇలాగే ప్రతి పదస్వరూపమూ నిర్ధరించవలసిన బాధ్యత లేదూ? అలాటివన్నీ వదలివేసుకుని ఇది చాల ప్రయోజనకరమన్పి వ్వ....మర్దనం చేసుకోడం వల్ల ప్రయోజన మేమిటి?

మఱియు, మఱియుం, మఱియుః, మఱియున్, మఱియును, మఱియునుం, మఱియునున్ అనేపదాలు 688, 689, 690 పుటలలో 187 ఆరోపాలలో ఉన్నాయి.

ఇలాటి కళేబరాలను ఎన్ని ఉదాహరిస్తే ఏమి ప్రయోజనం?

నన్నెచోడ పదప్రయోగకోశానికి డాక్టర్ దివాకర్ల వేంకటావధానిగారు, అబ్బూరి రామకృష్ణరావుగారు సంపాదకులు. డబుల్ డెమ్మీ 374 పుటలు. వెల రూ 20. లు.

ఇది కూడ నన్నయ పదప్రయోగకోశం తీరులోనే నడిచింది. అయితే "ఎడఎడ" కొన్ని పదాలకు అర్థం ఇవ్వబడింది. నన్నిచోడుని కుమార సంభవంపై రేగినంత దుమారం ప్రపంచంలో మరొక కావ్యంపై రేగలేదు గదా! దాని ప్రతి ప్రయోగం, ప్రతి కథన వైఖరి తెలుపవలసినవి. అయితే, ఇవేవీ ఈ కోశంలో లేవు. కాని తొలిపలుకులో సంపాదకులు కొన్ని మాటలతో మనకు ఆశపెట్టారు.

నన్నెచోడని కావ్యంలో "..... అమరలేమలు, పుడమీశుడు, వనేచరియులు మున్నగు వింత సమాసములున్నవి. కొన్ని సంస్కృత పదములందలి సంయుక్తాక్షరముల నడుమ నచ్చు చేర్పబడుటచే అవి వింత రూపములు దాల్చినవి. (బరిహి, కలువోర, సారువ.) రుషి, బ్రాహ్మడు, తశ్య, అల్పి, కుర్య మున్నగు స్వతంత్ర ప్రయోగములున్నవి. ఇట్లే ఛందో వ్యాకరణ విశేషము లనేకములు కానవగును (ద్రుతద్విత్వసంధి, క్వ్వర కేకారసంధి). అందుచే ఆనాటి ఆంధ్ర భాషా స్వరూపమ్మే

నెరుంగుట కీ గ్రంథము చాల తోడ్పడును. ఏ తత్ప్రయోగ సూచిక కావిధముగ ఒక ప్రత్యేకత ఉన్నదని చెప్పవచ్చును''

ఈ మాటలతో పాఠకులు ఈ చర్చలన్నీ ఈ పదప్రయోగ కోశంలో ఉన్నాయనే భ్రమతో కోశాన్ని తిరుగవేసి, తిరుగవేసి అలసిపోతారు. కాని, భ్రమ తొలగి శ్రమ కలుగుతుంది. ఆత్మా నాత్మ వివేకం ఏర్పడుతుంది, ఇది కూడా కేవల కళేబరమేనవే నిర్ధారణ అవుతుంది. సంస్కృత సమాలలో క్రియాపదాలను మాత్రమే ఇచ్చినప్పుడు తొలిపలుకులో ఇలాటి మాటలతో భ్రాంతి కలిగించడం ఎందుకో! సంపాదకుల కిది పాడికాదు.

లక్షలు పోసి కూర్చిన ఈ పదప్రయోగకోశాలలో మొదటి రెండింటిలోని అంశాలు స్థాలీపులాక న్యాయంగా ఇవి. మరీ లోతుకు వెళ్లితే గొంగళి న్యాయ మవుతుంది. ఏమైనా, ఇది పెద్ద ప్రజల సొమ్ము దుబారా.

“ఆశ అనంతం”

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ 1965 వరకు 32 కు పైగా పుస్తకాలు ప్రచురించింది. వీటి అమ్మకాన్ని గురించి లోగడ ఆడిట్ నివేదిక చేసిన వ్యాఖ్యను ఉట్టంకిస్తే చాలు పాఠకులకు అన్ని విషయాలూ కరతలామలకం అవుతాయి. ''ఉత్పత్తి విషయంలో ఆశ చూద్దామా అనంతం. ప్రచురణల అమ్మకం చూద్దామా బొత్తిగా అత్యల్పం.'' ఇది ఈ నివేదిక వ్యాఖ్య.

''ప్రచురణలలో చాలవరకు విడివిడిగా అమ్ముడుగాని పరిశీలన గ్రంథాలవి, అదీగాక మార్కెటులో ప్రచురణ కర్తలతో పోటీ పడలేకుండా వున్నట్టు'' అకాడమీ కార్యదర్శి చెప్పారట.

అకాడమీకి సామాన్యపుస్తక విక్రేతలతో పోటీ రావడానికి కారణమేమి? అదికూడా వాళ్ళ ప్రచురించేలాటి పుస్తకాలు ప్రచురిస్తున్నప్పుడు గదా! పరిశీలన గ్రంథాలు సాహిత్యాభిమాని అయిన ప్రతివాడూ కొంటాడు, పదకోశాన్ని కొన్నట్టు, తరతరాలదాకా ఉపయోగిస్తుందన్న ఆశతో, విశ్వాసంతో. కాని అకాడమీ ప్రచురించిన పరిశీలన గ్రంథాలలో పెక్కు నిర్గంధ కుసుమాలు,ఆత్మరహిత కళేబరాలు వున్నప్పుడు ఎవరుకొంటారు?

అకాడమీ అత్యున్నత ప్రామాణిక పరిశీలన గ్రంథాలను ప్రచురించడం వినా మరొక దానికి పూనుకోనక్కరలేదు. ఇదేమి రష్య కనుకనా, ప్రభుత్వమే అన్ని పుస్తకాలూ ప్రచురించి లక్షల ప్రతులలో అమ్మడానికి?

''1965—66 ఆర్థిక సంవత్సరమున రచయితలకు ఆర్థిక సహాయము కొరకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ తన బడ్జెట్టులో రు 15,000 లను కేటాయించింది. ఈ పథకము క్రింద యీ ఆర్థిక సంవత్సరము 18 మంది రచయితలకు విద్వాంసులకు ఆర్థిక సహకారము చేయుటజరిగినది.'' అని 1965—66 అకాడమీ వార్షికనివేదికలో తెలియజేయబడింది. ఈ 18 మంది పేర్లు అనుబంధంలో వున్నాయి.

రచయితలకు సహాయం చేయడం అవసరమే, మంచిదే. కాని, ఆ రచయితలు తమ పుస్తకాలను— ఆ పుస్తకాలు ఉత్తమాలు, శాస్త్ర విషయాలు, అపూర్వాలు అయివుంటే— ప్రచురించలేని స్థితిలో వుంటే, వాటిని అకాడెమీయే ప్రచురించడం సముచితం. ఏదో వేయో, ఐదువందలో దానం చేయడమో, అప్పు ఇవ్వడమో చాలదు. ఈ 18 మందిలోను కనీసం పది మందైనా బాగా సంపన్నులని ఆంధ్రదేశంలోని ఎవరినడిగినా చెబుతారు. అలాటి వారికి ధన సహాయం చేయడం ఎంతవరకు సమంజసం?

అర్జన బాగా గల ప్లీడర్లు, లాయర్లు, ప్రొఫెసర్లు, రచన ప్రధాన వృత్తి కానివారు అకాడెమీల సహాయం కోసం వారినీ వీరినీ పట్టుకుని ప్రాధేయపడడం, సంపాదించడం జరుగుతున్నాయి. ఇలాటి వారికి నిజంగా రచనాసక్తి వుంటే, తమ డబ్బుతో తామే తమ పుస్తకాలు ప్రచురించుకొని, పెట్టుబడికి నష్టం లేకుండా చూచుకోవచ్చు. అకాడెమీలను దేబిరించ నక్కరలేదు. లక్షలార్జించిన ఒక ప్రిన్సిపాల్, ఆయన అల్లుడూ అకాడెమీ నుంచి, అలాటి ఇతర సంస్థల నుంచి ధన సహాయం పొందినట్టు తెలిసి సాహిత్యసేవకులు విస్తుపోయారు. రచన ప్రధానవృత్తికాని ఈ ప్లీడర్లు మొదలయినవారు తమ విషయమైన శాస్త్రగ్రంథాలు వ్రాస్తారా—అంటే, అదేమీ కాదు. ఏ సంస్కృతాంధ్రటీక లనో, వేదాంతగ్రంథమో వ్రాసి, దానిని అచ్చు ఒత్తించాలనే మథన, తర్వాత అవి అమ్ముడుపోవడానికి గ్రంథాలయాధికారుల వెంట తిరగడం మొదలయిన చర్యలు. అదివరకు అలాటి పనులు అనీతి అని ఉపదేశించినట్టివారే వీరు. తమకు అవసరమైతే ప్రతిసూత్రానికి అపవాదసూత్రం. అందువల్ల అకాడెమీ అధికారులు పాత్రాపాత్ర విచారణ క్షుణ్ణంగా చేసి, సత్పాత్ర సహాయం, సత్పాత్ర దానం చేయడం అవసరం.

1966 లో తెలుగు సంస్కృత భాషలలో స్వీయరచనలను ప్రచురించడంకోసం 22 మంది పండితులకు, రచయితలకు రు. 11,838 లు మంజూరుచేసింది అకాడమీ.

సాహిత్య అకాడమీ పూర్వం రాజులు, రారాజులు చేస్తూ వుండిన భాషాపోషణకు పూనుకున్నది గనుక, దేశంలోని సాహిత్య సంస్థలలో అధికారికమైనది, అర్థబలం కలది గనుక, దాని పనులు అనర్థదాయకాలు కారాదని ఇంతగా చెప్పవలసి వచ్చింది.

అనధికార ప్రసంగాలు

గత సంవత్సరం పూటుగా పండిన పంట అనధికార ప్రసంగాలు. తనకు తాహతు వుందా, లేదా అనే వివక్ష లేకుండా, ఆలోచన లేకుండా, ఎక్కడలేని విశ్వాసంతో ప్రసంగించడమనేది అధికారంతోను, ఆర్థికమైన తాహతుతోను వస్తుందేమో! అధికారం అనే విక్రమార్కుని గద్దె ఎక్కినవాడు పలికేవన్నీ ''పసిడి'' తునకలే గనుక, చెలామణి అయిపోతాయి. అధికారీ, మంత్రీ మాత్రమే కాదు, అధికారపక్షం స్వచ్ఛంద సేవకుడు కూడా ఎంతో ఆత్మ ప్రత్యయంతో మాట్లాడుతాడు.

హిందీ ప్రచారం అర్ధ శతాబ్దిగా చేస్తూ, హిందీవారి కరుణా కటాక్షంతో పెద్దవాడయిన ఒకాయన భాషా శాస్త్రం గురించి, కొన్ని తెలుగు పదాలకు హిందీ పదాలకు గల ఉమ్మడి మాతృకను గురించి ప్రసంగిస్తుండగా విని నా మెదడు పనిచేయక ఆగిపోయింది, తీరా చూచుకుంటే గుండె కూడా ఆగిపోయినట్టు తెలిసింది. ఆ మధ్య ఒక పెద్దమనిషి నిండు పండితుల సభలో భాష పుట్టుపూర్వోత్తరాలను గురించి ప్రసంగించారు. అక్కడి వారందరికీ అది కంటకప్రాయంగానే వుంది. కాని, ఆయనతో తమకున్న అవసరాన్నిబట్టి కొందరు, మనకెందుకు, ఏమో అన్నాడు, అంతమాత్రాన మునిగిందేమిటి అని "తుష్యతు న్యాయం"గా మరికొందరు పూరికేనే వున్నారు. పూరికేవుండడం అర్ధాంగీకారంగా మాత్రమే కాక, సంపూర్ణాంగీకారంగాను ఆయన గ్రహించి, స్వేచ్ఛగా మాట్లాడారు,పాణిని కూడా అంత ధీమాగా మాట్లాడేవాడు కాడేమో!

మిడిమిడి జ్ఞానంతో ప్రసంగించే ఇలాటివారిని గురించే ఎవరో చెప్పిన మణిప్రవాళ శ్లోకం వుంది:

ఇండెక్సు పండితాః కేచిత్
కేచిత్ ఫోర్వర్డు పండితాః,
అపెండిక్సు పండితాః కేచిత్
బుక్‌రివ్యూ పండితాః పరే.

ఒక విషయాన్ని క్షుణ్ణంగా తెలుసుకోవడం సాధ్యం కాకపోయినా అవసరానికి తగినంతయినా తెలుసుకోనక ఏదో "దానిని గురించి" మాట్లాడే "గురించి విరించులు" ఎక్కువ అయ్యారు. కొన్ని వృత్తం వారిది మరీ ఆగడం! అన్నీ తెలిసినట్టు నటన, కొన్నైనా సరిగా తెలియవు. రాజకీయనాయకులకు ఇలాటి బూకరింపులు, బిభీషికలు అవసరం కాని, ఇతరులకు అవసరంలేదు. జిజ్ఞాస లేనిదే, ఏదీ బాగా మనస్సుకు పట్టదు. అరకొర జ్ఞానంతో తనకూ, ఇతరులకూ అనర్థం. పలువురితో మెలగనేర్చిన లోకజ్ఞులు కొన్ని విషయాలు ఇలా చేకూర్చుకుని డ్రాయింగు రూము సంభాషణలలో రాణిస్తుంటారు. ఇది కేవలం ఉబుసుపోకకు ఉపయోగమే కాని, ఉన్నతికో, ఉత్థానానికో ఉపయోగించదు. ఇలాటి సంభాషణను గురించే ఒక ఫ్రెంచి కథ వుంది. పూర్వం పారిస్‌పరిసరాలలో కొందరు ఇలాటి "అర్ధపండితులు" చేరి గొర్రెను "గురించి" చర్చ జరుపుతున్నారట. మూడు గంటలు ఈ చర్చ సాగింది; అయినా దాని స్వరూప స్వభావాలనుగురించి ఎవరూ నిర్వచించలేదట. ప్రతివారూ మొండిగా వాదిస్తున్నారట. ఈ చర్చంతా వింటున్నాడట ప్రశాంతంగా ఒక గొర్రెలకాపరి. "ఎందుకింత శ్రమ పడుతున్నారు? ఒక గొర్రెను మోసుకుని వచ్చాను. చూడండి ఒళ్లంతా తడిమి." అన్నాడట వాడు. "నీవు గొర్రెను మోసుకొనివస్తే ఇంత చర్చ ఎలా సాగుతుంది?" అన్నారట వారు. నిరర్థక కాలహరణమంటే యిదే.

ఈ అనధికార చేష్టకు కారణం ముఖ్యమైంది ఒక్కటి వుంది. తను అనుకున్నదానికన్నా ఎక్కువ సాధించాననే మహత్త్వం ఏర్పడినప్పుడు కలిగే అహంకారం ఇలాటి వెర్రితలలు వేస్తుంది. సర్వజ్ఞంమన్యత, సర్వశక్తంమన్యత, సర్వనాయకంమన్యత సాటమరిస్తాయి. దానితో ఎక్కడలేని అవాకులూ, చెవాకులూ బయలుదేరుతాయి. అలాటి వారిని ఆశ్రయించి వుంటారు కొందరు వందిమాగధులు స్వార్థంకోసం. వారు, అవసరమైనప్పుడల్లా 'భళాభళి' అంటూ వంత పాడుతుంటారు.

ఈ పరిస్థితి తొలగి సాహిత్యరంగంలో నీత్యుషస్సు ఉదయము కావడానికి 19 వ శతాబ్దం ప్రారంభంలో జనించినట్లు నిస్స్వార్థ సేవాపరులు, అన్యాయాన్ని అచంచలధైర్యంతో ఎదుర్కొనగల ధీరులు పుట్టాలి. అప్పుడుగాని ఈ కల్మషం తొలగదు; ఈ చీకట్లు తొలగవు. అలాటివారు ఇకమీద పుట్టి పెరగనక్కరలేదు. అలాటి గుణాలు మనలోనే పుట్టాలి. వాటికి ఏకా సుముహూర్తం అంటూ ఏమీ లేదు; ఎప్పుడైనా పుట్టవచ్చు. దానికి కావలసింది న్యాయదృష్టి అనే క్షేత్రం, సాహిత్య శ్రేయస్సు, తద్వారా లోక కల్యాణం కలుగాలనే దీక్షాదోహదం, ధైర్యమనే ఆతపవర్షాలూను.

*　　　*　　　*

ఈ సంవత్సరం జరిగిన వాస్తవమైన గొప్పఘటనను చివరన పేర్కొంటాము. అది కలకత్తాలోని భారతీయ జ్ఞానపీఠ్ వారు దేశంలోని ఉత్తమోత్తమ రచనకు లక్ష రూపాయల బహుమతి ఏర్పాటుచేసి, ఈ సంవత్సరం మొదటి బహుమానం ఇవ్వడం. ఈ మొదటిసారి బహుమతి మలయాళకవి శ్రీ కె. శంకరకురుప్ గారికి— ఓడక్కుళల్— (వేణువు) అనే కవితాసంపుటికి లభించింది.

ఇలాటి బహుమతి భారతదేశంలో— ఆసియాఖండంలోనే— అపూర్వం గనుక జ్ఞానపీఠ్ వారు అభినందనార్హులు.

ఎన్నికలు - సమస్యలు

ప్రొఫెసర్ మాక్స్ బెలోఫ్

ఇప్పుడు భారతదేశములో సర్వము రేపు ఫిబ్రవరిలో వచ్చేఎన్నికలకు సంబంధించిన వ్యవహారముగా వుంటున్నది. మరి ఎన్నికలకు సంబంధించిన రాజకీయాల యంతటి ముమ్మరముగా బయటికి వచ్చెడి విషయములు వుండవు. ఇది ప్రతిదేశమునందును జరిగెడి విషయమే అయినను భారతదేశమునందు మరియు ఎక్కువ. ఇక ఈ ఎన్నికల సంబరమును గురించి పరిశీలన చేయవలయునని అమెరికా నుండి వచ్చిన కొందరు పెద్దలకు ఇంతకన్న ఎక్కువ రసవత్తరమైన సమాచారములు లభించు చోటు అన్నదే వేర యుండదు. భారతదేశమునందలి ప్రతిపక్షములు ఒకదారియు, తెన్నును లేకుండా నున్నవి. కాంగ్రెస్‌పక్షము వారికింకను భారత దేశమునందలి గ్రామీణ జన సమూహములపై పలుకుబడి యున్నది. అందువలన కాంగ్రెస్‌పార్టీ ఓటమి యన్నది అమూహ్యమైన విషయము.

ఈ పరిస్థితిని దృష్టియందుంచుకొని పరిశీలనమును జరిపినచో రెండు ప్రధానములైన విషయములు బుద్ధికి గోచరము కాగలవు. (1) ప్రతిపక్షములు వున్నవి. ఈ ప్రతిపక్షములు, ఏ యొకటి రెండు రాష్ట్రములయందో లేక మూడు నాల్గు రాష్ట్రముల యందో, స్వంత ప్రభుత్వములను నెలకొల్పుటకు సమర్థమైన బలమును సాధించగలవా యన్నది మీమాంసించ దగిన విషయమగుచున్నది. ఇప్పుడు కేరళలో ప్రతిపక్షము అధికారములోనికి రావచ్చునన్న అభిప్రాయ మొకడు సర్వేసర్వత్ర ఉన్నది. ఇది ఒకటి. (2) కొన్నికొన్ని ప్రత్యేకమైన నియోజక వర్గములకు ఎట్టిఎట్టి వారికి, ఎవరెవరికి టిక్కట్లు లభించినవి అన్నది రెండవది. దేశము వంక చూచినచో,ఆ దేశము ఎదుర్కొను చుండిన సమస్యలు, అంతరంగికములు, అంతర్జాతీయములు నయినవి,అతి జటిలముగ నున్నవి.అయినను భారత ప్రధానియేమి, మరియు నితర కాంగ్రెస్ నాయకులేమి వ్యక్తిగతమైన, 'వర్గ సంబంధము'లైన వివాదముల యందు అధికమైన కాలమును వ్యయ పెట్టుచుండుట గోచరించుచున్నది. ఇది ఆశ్చర్యకరమైన విషయము. అదేవిధముగ శ్రీ కృష్ణమీనన్ స్థానము వ్యవహారము గూడ పత్రికలలో నధికమైన స్థలమును ఆహరించుచుండుటయు విచిత్రముగ నున్నది.

పరిస్థితి ఇట్లున్నది. ఈ పరిస్థితి యందు ప్రజాస్వామ్య ధర్మ వ్యవస్థల యందు భ్రాంతివడులు చుండుటయు కాన్పించు చున్నది. ఈ భ్రాంతి వదలుట యన్నది వర్తమాన నాయకత్వము నుండియే విస్తరణము చెందుచుండుట ఆశ్చర్యపడవలసిన విషయముగా నగపడుటలేదు. ఏ విదేశీయుడైన భారతదేశమును గూర్చి అడిగెడి ప్రశ్న ఇది: భారతదేశమున ప్రజాస్వామ్యము బ్రతికి బట్టగట్టునా? ఈ రకమైన జాడ్యము భారతదేశమునందు వ్యాపించుటకుకారణము ప్రధానమంత్రి బలహీనతయే. నెహ్రూ మృతి వలనగాక, శాస్త్రి మరణము వలన దేశముయొక్క అదృష్టములో నిజమైన సంధిబంధమేర్పడినది. భారతదేశము యొక్క అదృష్టచక్రమిప్పుడు మలుపు తిరిగినది. శ్రీమతి ఇందిరాగాంధి ఇప్పుడు అధికారము నందున్నారన్నను, మరియు ఎన్నికల అనంతరము అధికారమునందుండుట సంభవము కాగల్గుటయున్నను— అందుకు ఒక ప్రత్యేకమైన కారణము కన్పించుచున్నది. కాంగ్రెస్ పక్షమునందలి వేరువేరు వర్గముల నాయకులు, సమర్థుడైన యొక నాయకుడు అధికార ధూర్వహుడు కాకుండ, అధికారమును చేబట్టకుండ కలిసి పనిచేయుట వలన, పని చేయగల స్థితి యున్నందువలన జరుగుచున్నది. అయితే ఒక ప్రధానమంత్రి ఒక ముఖ్య నియామకమును చేయదలచినప్పుడు, ఆ ఆలోచనము వాయిదా పడునట్లు చేసిన పనియందలి అవమానావలేపనము, తనకు అక్కర లేదనుకొనిన ఇద్దరు మంత్రులను పదవుల నుండి తొలగించడము కూడా సాగిరాని విషయము త్వరగా మరుపునకు వచ్చు విషయములు కావు.

ఇక భారతదేశమునందలి కొన్నికొన్ని రాష్ట్రములలో ప్రతిపక్షములు అధికారములోనికి రాగల అవకాశమున్నదన్న విషయము ఏల ఒక సమస్య యగుచున్నదనగా, అది జరిగెడి పక్షములో భారతదేశమందలి ఫెడరల్ రాజ్యాంగ వ్యవస్థా ధర్మమిప్పుడు ఒకవిధమైన అగ్నిపరీక్షకు గురిచేయబడినది కాగలదు గనుక. అట్టి పరిస్థితియే యేర్పడినచో, రాష్ట్రముల యందలి,కేంద్రము నందలి ప్రభుత్వముల మధ్య పార్టీ యంత్రాంగము అనుసంధాన విషయము కాజాలదు గనుక. మరి ఇప్పుడు ఆ పద్ధతి సరిగా పని చేయుచున్నదనికాదు. బీహారు రాష్ట్రమునందు క్షామ పరిస్థితులు ఏర్పడిన సందర్భమున, ఉత్తరప్రదేశమునందు కొన్నిప్రాంతముల యందు, మరిరెండు ఉత్తరరాష్ట్రములలో కొన్ని లఘు ప్రాంతముల యందు, దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడిన సందర్భమున, ఈ విషయము స్పష్టముగ తెలియవచ్చినది. రాష్ట్రములలో సరియైన గణాంకములు లేకపోవడము, పరిస్థితులు ఏవిధముగా రూపము కట్టునో సరిగా మదింపు చేయుటయందు ప్రజ్ఞ యన్నది కొరవడటము, ప్రభుత్వ విధానమునందలి జాడ్యములకు, తాత్పరములకు, పరస్పర విరుద్ధ లక్షణములకు కారణమై,

కూర్చున్నదని చెప్పుటకు వలయు సాక్ష్యము బహుళముగా నున్నది. రెండవ సంవత్సరము తిరిగి అనావృష్టి బాధయున్నది తటస్థమైన కారణమునుజేసి, జరిగిన నష్టమెంతయో, నిజముగా అలక్ష్యముగా, పరిస్థితులు ముంచుకువచ్చిన తరుణములో తెలిసి వుండవచ్చునని చెప్పుటకు, కారణమును ఉన్నది. బీహారు ప్రభుత్వము యొక్క అసామర్థ్యము సర్వవిధములను అంగీకరింపబడిన విషయము. అవసరమును ఎరిగిన అనంతరము ఏదియో చేయవలయునన్న తలంపు పుట్టినను, అది ప్రతిబంధకమగుచున్నది. కొంతమంది ఇచ్చట మరియు విపరీతముగా మాటలాడుచున్నారు. బీహారు ప్రభుత్వమునకు అసలు విషయమునందు కన్న, క్షామనివారణకు గాను పని చేయుచుండిన సహాయసంస్థ, ఎన్నికలలో కాంగ్రెసునకు పరిస్థితులు అనుకూలించునట్లు పని చేయవలయునని చూచుకొనుటయందే శ్రద్ధ అధికముగా నున్నట్లు చెప్పబడుచున్నది. మరి బీహారు నందును కాంగ్రెస్ పార్టీయందు ఎన్ని చీలికలు లేవు! అందువలన అందున కూడ కష్టములు ఏర్పడి, ఈ పనియు సరిగా జరుగుచున్నట్లు కన్పించదు. క్షామప్రాంతములకు మిగులు ధాన్యములను సమకూర్చుట యందు పంట అధికముగ గల రాష్ట్రములు ముందునకు దూకటములేదు. క్షామ ప్రాంతములకు మిగులు ధాన్యములను పదలవలయునని కేంద్రము తెచ్చుచు ఒత్తిడి యందు ఈ రాష్ట్రములు పెడముఖము పెట్టుచున్నవి. ఇచ్చట ప్రభుత్వముగాని, పార్టీగాని ఏమి చేయుటకును అసమర్థము లగుచున్నది. ఇటీవల ఒక పత్రిక ఒక వ్యంగ్యచిత్రమును వేసినది. అందు కేంద్రఆహారశాఖ యుద్యోగి యొకడిట్లనును: "ధాన్యముల కోసము అమెరికాను అడిగితిమి. రష్యాను అడిగితిమి. కెనడాను, ఆస్ట్రేలియాను అడిగితిమి. ఇక మద్రాసును, ఆంధ్రప్రదేశమును కూడ అడుగవలయునట్లు సర్వమును కన్పించుచున్నది." భారత దేశమునందలి పత్రికలలో యీ వ్యంగ్యమునకు, యీ రకమైన ఎత్తిపొడుపులకును తోడు, ఒక్క మహాగుణమును వున్నది. ఆ పత్రికలు యదార్థ విషయములను మార్చి చెప్పవు. కనుక పరిస్థితి నిజముగా దుర్భరముగా నుండియున్నదనిఇచ్చట మనము భావింపవచ్చును.


రాజకీయరంగమున నిస్పృహయున్నది. ఆర్థిక పరిస్థితుల యందును పట్టి నిస్పృహయే అలముకొని యున్నది. రూపాయి మారకపు విలువ అయితే తగ్గించబడినదిగాని, అందువలన కలుగు ననుకొన్న ఫలితములు కలుగలేదు. వీని వలన భారతదేశమున దిటీవలి కాలమున విద్యమాన మగుచుండిన దౌర్జన్యవాసనా వాసితములైన లక్షణముల సంగతిని కొంతవరకు ఎరుగవచ్చును. ఇందుకు బహుకారణములున్నవి. లేక కారణములని చెప్పదగినవి యున్నవి. విద్యార్థులలో అలజడి. గోవధ నిషేధము నిమిత్తము ఉద్యమము. మరి యొక ఉక్కుకర్మాగారము స్థాపనము నిమిత్తము ఆందోళన. ఏదియైనను ఉరేగింపులు లేవదీయుటకు, ప్రదర్శనములు జరుపుటకు, ప్రభుత్వపు టాస్తులను, ప్రైవేటు ఆస్తులను నాశనము చేయుటకు, చాలును. ఇట్టి యాగడములకు వెనుక రాజకీయములు, రాజకీయమైన ప్రేరణము, ప్రోత్సాహమును లేవని అనలేము. పార్లమెంటులో ఒక వర్గము వారలట్టి చర్యలను ఖండించ లేకపోవుటయు, మంత్రులపై ధ్వజము లెత్తుటకు పార్లమెంటరీ పద్ధతిని వినియోగించుకొను లక్షణమును, పార్లమెంటులో చర్చలను అపరమైన స్థితికి తెచ్చుటయు—మొదలైన విషయములన్నియు కూడ గమనించవలసిన విషయములే. శ్రీ నందా వ్యవహారమును గూడ మరిచిపోరాదు. ఏలన, ఆయనకు హిందూ అతివాదముతో అనుబంధమున్నది. గోవధ నిషేధ విషయమున నేర్పడిన పరిస్థితి యందు ఆయన పదవి నుండి తొలగుట యయినది. ఆవెంటనే ఆయన పార్టీ సంస్థ యందొక ప్రముఖమైన పదవి యందుంచబడినారు. ఇదియు ప్రధానమంత్రి యొక్క బలములేని తనమును చూపుచున్నది. ఇప్పుడు శ్రీ చవాన్ దేశీయాంగమంత్రి అయినారు. ఆయన ఆయా రకములైన విషయముల యందు గట్టిగా వ్యవహరించి, ఈ రకములైన పనులను క్రియలచేతను, ఉదాహరణము చేతను తుదముట్టించగల్గుచో, అప్పుడు ఆయన ప్రతిష్ఠ అధికమై, ఎన్నికల యనంతరము ప్రధానమంత్రి పదవికి ఆయనకు గల అవకాశములు అధికము లయి, తక్కినవారు అట్టి స్థితి ఏర్పడ రాదనుకొనుచున్నను, ఆ పదవికి ఆయన రాగల స్థితికి కూడ ప్రోది ఏర్పడవచ్చును. సాధువులును, వారి అనుయాయులును జరిపినటువంటి పనులు మరల భారత రాజధానిలో జరుగకుండా ఆయన చూడగల్గవచ్చును గాని, రాష్ట్రముల యందలి పరిస్థితులను సంబాళించుటయున్నది కొంత కష్టము కావచ్చును.

దేశముయొక్క భవితవ్యమును గురించి ఆలోచనము చేయునప్పుడు విద్యార్థుల యాందోళనము ప్రధానమైన విషయమగుచున్నది. మత సంబంధముగ జరుగు నాందోళనములకన్నను, రాజకీయముగ నల్లరులు లేపెడి వారి చెయ్దముల కన్నను, ఈ ఆందోళనము ఎక్కువగా పట్టించుకొనవలసిన విషయము. ఈ ఆందోళనముల యందు కొన్నిటిని గూర్చి, అవి ఫలానా కారణములను జేసి యేర్పడినవని చెప్పుటకు వలను వున్నది. బలమైన కారణములున్నగాని అంత యెత్తున విద్యార్థులు సమ్మెలు చేయుటయు, పికిటింగ్‌లకు పూనుకొనుటయు జరుగదు. ఒక కారణము కళ్లకు కట్టినట్లగుపించుచున్నది. పట్టభద్రులయిన వారికి ఉద్యోగములు కరవైనవి. ఐరోప యందిట్టి పరిస్థితి ప్రథమ ద్వితీయ ప్రపంచయుద్ధముల నడిమి కాలముల యందేర్పడి, అచ్చటి దేశముల యందు రాజకీయ సంబంధమైన అతివాదములకు మార్గములు చేసి యున్నది. మరియొక కారణము కొంచెము జటిలమైనది. భారతదేశమున విద్యార్థులకును, అధ్యాపకులకును సాన్నిహిత్యము లేకుండపోయినది. ఒకరిని యొకరు ఎరుగని వారివలె నైపోయినారు. వారి నడుమ సంపూర్ణమైన ప్రత్యాఖ్యాన పరిస్థితి చెల్లుబడి యగుచున్నది. విశ్వవిద్యాలయమ్ములందు విద్యార్థుల సంఖ్య మితిమీరి పెరుగుచుండుట ఇందుకు కారణమై యున్నది. దీనితో విశ్వవిద్యాలయముల ఏలుబడిలో నైయుక్తిక సంబంధ మంథమైపోయినది. విద్యార్థుల యందు కూడ నెక్కువమంది ఉన్నత విద్య నభ్యసించుటకర్హమైన సంభారములు లేనివారును, ఆ ఉన్నత విద్యాభ్యాసమునందు ఏమి చేయవలయునో ఎరుక లేనివారుగ నుండుచున్నారు. మరియు విద్యార్థుల

యందు క్రమశిక్షణమును నూరిపోయవలయునన్నచో, ప్రతిబంధకములు కొన్ని ఎదురగుచున్నవి. ఆ క్రమశిక్షణమును నూరిపోయుట యన్న సంస్కృతము కూడ ప్రబలముగనున్నది. ఇందులకు చరిత్ర కొంత కారణము కావచ్చును. కాని అధికమైన కారణము రాజకీయములకు సంబంధించినదియని చెప్పుకొనక తీరదు. ఇతర దేశముల యందీ క్రమశిక్షణమును నూరిపోయుట విధాయకము. ఆ విధాయక భావమిచ్చట శిథిలమగుచున్నది. కలకత్తా యందు విశ్వవిద్యాలయ భవనముల ముందు అటకాయింపులు జరుపుటకు విద్యార్థులు తెగబడగా, కాదనినవారు లేరు. ఈ అటకాయింపు పని, లేక పికెటింగ్ ఎందుకట? కొంతమంది విద్యార్థులపై క్రమశిక్షణచర్య కైకొనబడినందులకు. ఈ అటకాయింపుపని దీర్ఘకాలము సాగిసాగి, చివరకు విశ్వవిద్యాలయపు పనులన్నియు స్తంభించిపోయినవి. అంత దాకా నిది సాగింపబడినది. పరీక్షలు జరుగలేదు. తుదకు విశ్వవిద్యాలయమును మూసివేసివారు. ఇందుమూలముననేమి జరిగినది. కొన్ని వేల మంది విద్యార్థుల విద్యాభ్యాసము నడుమధ్యమున దెబ్బతిన్నది. పాడైపోయినది. వారి భవితవ్యము కూడ కుంఠితమైనది. ఇది యంతయు నల్పసంఖ్యాకమైన కొందరి పనులవలన జరిగినవని. ఇట్టి పనులు భారత దేశము నందితర పట్టణములయందు కూడ జరుగుచున్నవి. కలకత్తా యందు జరిగినవి అందులకు ఉదాహరణములు.

దేశము నం దింతలు జరుగుచుండగా, నంతర్జాతీయ వ్యవహారములకు పెద్దగా ప్రాముఖ్యము లభించదు. మరి ఢిల్లీకి ప్రముఖులు వచ్చుచునే యుందురు. వచ్చియుండిరి. టిటోయు, నాసర్‌ను వచ్చిరి. మంతనములు జరిపిరి. సమిష్టి ప్రకటనము కూడవెలువడినది. భారతదేశమునందలి పత్రిక లీ ప్రకటనమును గురించి వ్రాయుచు, నందు భారతదేశము అరబ్ రిపబ్లిక్ ఇష్టముల నవలంబించుట యున్నదిగాని, అరబ్ రిపబ్లిక్ భారత దేశము ఇష్టములను మన్నించి యుండుట కన్పించలేదని వ్రాసియున్నవి. భారతదేశమునకు పాకిస్తానము వలన, చైనా వలన వచ్చిన కష్టములు నెత్తిమీద కూరుచున్నట్లున్నవి. వానిని గురించి నాసర్ పలికినది లేదనియు, ఉలికినది లేదనియు కూడ వ్రాసినవి. మరి యిక విబంధ రాజ్యముల నడుమ ఆర్థిక సంబంధమైన సహకారమును గూర్చిన ప్రస్తావనమున్నది కదా యున్నచో, దానిని గురించి ఎవరును నిజముగా పట్టికొన్నదియే కన్పించదు. ఏలన భారతదేశము ఆహారమునకు, అర్థమునకు కూడ నగ్రరాజ్యములపై నెంతగ నాధారపడి యున్నదో, విబంధ రాజ్యముల కన్నిటికిని తెలిసిన విషయము. ఈ ఆధారము పడక జరుగునది లేదన్న విషయము కూడ నీ రాజ్యములకు స్పష్టముగ తెలియును. భారత ప్రభుత్వమునయందు ఈ ఆధారము పడియుండుట వల్ల నైమనస్యమున్నది. ఆ నైమనస్యమును ప్రకటించు సావకాశములు గూడ బాగుగా నుపయోగించుకొన బడుచున్నవి. ఇక యీ నైమనస్య ప్రదర్శనము, షరతు లుండినచో నహాయ మక్కరలేదు—అన్నంతమేరకు మాత్రమే పోవుచున్నది. "మిస్ వరల్డ్" ఉదంతమున్నదనగా, నచ్చట భారత ఉద్యోగి బృందము నడచిన నడక ప్రసహాసనము మాదిరిగానున్నది. కాని ఇది మరియొక విధముగు నిస్పృహకు చిహ్నము. భారత విదేశాంగ విధానము పడుచున్న అవస్థలలో నిది యొకటి. ఇప్పుడు "అటమ్ బాంబు"ను చేసినచో, దేశమునందుత్సాహశక్తి దీపించునని ఇంకను విశ్వసించుచున్న వారగుపడుచుండుట—దయనీయమైన విషయము.

(ఫోరమ్ వరల్డ్ ఫీచర్స్)



"సీమంతినీ కల్యాణము"

విజయనగర సామ్రాజ్యమునందాంధ్ర వాఙ్మయమున పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు, "వాణి నారాణి" యని జెప్పుకొనిన మహాకవి యని ఈనాటికీ సాహిత్య లోకమునకు సుపరిచితము. ఈతడు సాళ్వగుండ నరసింహరాయల సమకాలికుడు. (15 వ శతాబ్ది ఉత్తర భాగము). ఈతడు (పినవీరన) వీరభద్రుని యవతారమేయని, విష్ణుంతునను గాదిరాజు చేసిన తపఃఫలమే పినవీరభద్రుడనియు, పెనుమళ్ళ సోమమంత్రి వ్రాసిన "సీమంతినీ కల్యాణము"లో గల ప్రథమాశ్వాసమున నున్న పద్యములలో దెలుపబడినది.

ఓయి మహీసుర ప్రవర యుల్లము
నందిక జింత యేమియుం
జేయకు రెండు రూపముల జెంది,
భవత్పతి గర్భసీమ నే
నే యుదయింతు నగ్రజుడు
విక్రముగాగ మదంశ సంభవుం
డాయనుజుండు నేన యిది
యంతయు నమ్ముము నిశ్చయంబుగన్,

(సీమంతినీ పరిణయము, పుట 7 పద్యము 40.)

ఈ పద్యమాధారముగ, పెదవీరభద్రుడు, వీరభద్రాంశ సంభూతుడనియు, పినవీరన వీరభద్రుడే యనియు గ్రహింపనగును.

"ప్రథిత సుగుణాళియైన యా భద్రకాళి,
వారలకు జెల్లెలై పుట్టు"

(పద్యము 41, సీ. క.)

అనుటలో వారికి గల జెల్లెలు భద్రమ్మయను నావిడ భద్రకాళియే యనియు దెలియనగుచున్నది.

ఈ గ్రంథము యొక్క ప్రాధాన్యము స్థూల దృష్టితో జూచిన రెండు ముఖ్య విషయములు గోచరములగును. (1) పినవీరన వంశావళి యంతయు నీ గ్రంథాది గల ప్రథమాశ్వాస పద్యములలో వర్ణితము. ఒక్కమాటలో జెప్పవలయునన్న నీ గ్రంథము లభ్యము కానిచో పినవీరనయు, నాతని వంశక్రమమును, చారిత్రిక వృత్తాంతమును, సోమవార వ్రత మహాత్మ్యమునకు ప్రాధాన్యత వహించు నీగ్రంథ ప్రాశస్త్యమును ప్రజలకు దెలియకుండెడిది.

(2) ఆంధ్ర ప్రబంధవాఙ్మయ ప్రక్రియలో పినవీరన పాత్ర ప్రధానమైనది. కొన్ని చోట్ల, ఈ కవిని "ప్రబంధ పితామహుడ"ని పిలువబడిన పెద్దన అనుకరించినట్లు ఆధారములు గలవు. అట్టి పినవీరన వంశావళి, చరిత్ర, ముఖ్యముగ విజయ నగర, రెండవ రాజ్య స్థాపకుడగు సాళువ గుండ నృసింహ భూపతి, చరిత్రమునకు గూడ నిది యాధారము.

ఈ గ్రంథము వలన గ్రహింపబడిన వంశ వృక్షము.

(భారద్వాజముని సంతతి)
|
(కూటస్థుడు) గాదిరాజు.
|
పెదవీరన — పినవీరన (15 వ శతాబ్ది)

పినవీరన (15 వ శతాబ్ది)
|
(ఈతని వంశములో)
సోమేశ్వరుడు
|
డాచిరాజు
|
సాపిడి సోమన్న
|
పెదసీలన్న
|
పెనుమళ్ళ సోమమంత్రి
(సీ. క. గ్రంథకర్త)

కాన దీనినిబట్టి పినవీరభద్రునికి, పెమ్మళ్ల సోమ మంత్రికి గల సంబంధము కానవచ్చుచున్నది. ఈతని వంశమున గల మల్లేశ్వరుని కాలము నాటి నుండి, వీరు "పెనుమళ్ల"[1] గ్రామమున నుండిరి. కాన వీరికి పెనుమళ్ల వారని ఇంటిపేరు యేర్పడినది. చారిత్రికాంశములను బట్టి జూచిన, పెనుమళ్ల సోమ మంత్రి, పినవీరనకు దాదాపు 150 సంవత్సరములు, అనగా క్రీ. శ. 1620 ప్రాంతము వాడని చెప్పవచ్చును. ఇట్టి ఈ గ్రంథమునకు తాళపత్ర ప్రతులు రెండు మాత్రమే లభించినవి.[2] (1) చెలికాని లచ్చారావుగారివద్ద నున్నది. (2) మదరాసు ప్రాచ్య లిఖిత గ్రంథాలయము.

ముఖ్య విషయ మేమనగా, 'వంశావళి'ని గూర్చి చర్చించుచు, శ్రీ అరుద్ర — తన 'సమగ్రాంధ్ర సాహిత్యము'లో

"ఈ పెద్దన్నగారు క్రీ. శ. 1360 లో ఉండేవారు. ఈయన కుటుంబంలోనే బహుశా మరి రెండు తరాలకు గాదిరాజా అనే ఆయన జన్మించాడు." అని తెలిపి తరువాత పెదవీరభద్రుడు, పినవీరభద్రుడు — అను ఇద్దరు ఉన్నట్లు తెలిపారు. కాన నీ విషయమును బట్టి చూచిన, శ్రీ అరుద్ర, సమగ్రాంధ్ర సాహిత్య రచనా కాలమున, ఈ గ్రంథమును (సీ. క. ను) గాని, అందు పేర్కొన బడిన వంశ వృక్షమును గాని జూడలేదని స్పష్టముగ దెలియుచున్నది. పెద్దన్నగారు, అంటూ ఎవరు లేరు. ఆ పెద్దన్నయే — పెదవీరభద్రుడు.

ఇక—[3]ఈ కవిని గూర్చి తెలిపిన వారు ఆచార్య నిడుదవోలు వేంకటరావుగారు. అందు వారు,

"ఈ గ్రంథకర్తయగు పెనుమళ్ల సోమ మంత్రి, పూసపాటి తమ్మభూపాలుని మంత్రి యని తన సీమంతినీ కల్యాణములో చెప్పుకొనియున్నాడు.

జయవాటికా పురాశ్రయమైన దుర్గాంబ
కృపగాంచె నే నృపాగ్రేసరుండు
మాధవ వర్మ క్ష్మాధవోత్తము వంశ
భూషణుడయ్యె నే భూభుజుండు
కలివారి హృదయ భీకర మన్నె సుల్తాను
బిరుదంబు పూనె నే నరవరుండు
సకల యాచకుల కాశాపూర్తి నొనరించు
నతిదాన శూరు డే యవని నేత
భువన వర్ణితుడైన యా పూసపాటి
తమ్మ భూపాలునకు సమ్ముఖమ్మునందు
మంత్రి నై త ద్దయా సుధామయ కటాక్ష
మహిమ గాంచితినయ్య సోమప్రధాన.

పూసపాటి తమ్మ భూపాలుని మంత్రియగుట చేతనే నతని కృతిని పూసపాటి వంశీయులలో వేరు కోవ వారగు పూసపాటి అచ్యుత రామరాజుగారు దీనిని కాళ్లకూరి సూరయ కవి చేత లిఖింపజేసిరి" అని వ్రాసినారు.

"సీమంతినీ కల్యాణమును ఆంధ్ర పరిశోధక మండలి — ప్రచురణగా శ్రీ చెలికాని లచ్చారావుగారు క్రీ.శ. 1919 లో ప్రకటించిరి. కాని దీనిని గూర్చి సవిమర్శనము వెలువడనే లేదు. సోమ వార వ్రత మాహాత్మ్య మిందలి కథ" అని తెలిపారు.

పై విషయమును పురస్కరించుకొని యిందలి కావ్య విశేషములను యీ క్రింద సమీక్షించు చున్నాను.

సీమంతినీ కల్యాణము (1) అయిదాశ్వాసముల మహాప్రబంధము — అను విషయము దీని చివరగల గద్యను బట్టి తెలియుచున్నది.

గద్య—"ఇది శ్రీశైలనివాస భ్రమరాంబా సమేత మల్లేశ్వరస్వామి కృపాపాత్ర భారద్వాజ గోత్ర పవిత్ర పెనుమళ్ల సోమమంత్రి పౌత్ర పెదవీర ప్రధాన పుత్ర సకల సుకవిస్తుత్య సోమనామాత్య ప్రణీతంబైన

---

1. పెనుమళ్ల: ఈ గ్రామము 'పెరువాళ్ల' యను పేరుతో, విశాఖపట్టణ మండలమున బొబ్బిలి తాలూకాలో నున్నది. అది మామిడిపండ్లకు ప్రసిద్ధి.

2. ఈ వృత్తాంతము "భారతి"—సెప్టెంబరు 1966 లో "లేఖలు" అను శీర్షిక క్రింద గల వాలేఖలో నిచ్చియున్నాను.

3. "విజయనగర సంస్థానము — ఆంధ్ర వాఙ్మయ పోషణ" — గ్రంథకర్త, శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు. (పుట 32). ఈ గ్రంథము 1962—63 ఆంధ్రప్రదేశ్ సాహిత్య ఎకాడమీ వారి పోటీలో బహుమతి నందినది. (ముద్రణము 1965).

సీమంతినీ కల్యాణంబను మహాప్రబంధంబునందు పంచమాశ్వాసము సంపూర్ణము'' అనబడునది.

ప్రబంధ లక్షణములన్నియు విందు గలవు. ఆశ్వాసాంతమున వృత్తములు మార్చబడినవి. ప్రథమాశ్వాసాంతమున మాలిని, రెండవ యాశ్వాసాంతమున స్రగ్విణి, తృతీయాశ్వాసాంతమున మాలిని, చతుర్థాశ్వాసము చివర తోటకము, పంచమాంతమున వనమయూరము వ్రాయబడినవి.

ఆశ్వాసాది పద్యముల, షష్ఠ్యంతముల, ఆశ్వాసాంత గద్యల బట్టి జూచిన ఈ గ్రంథకర్త శివభక్తుడని స్పష్టముగ దెలియును.

ఈ కవి స్తుతించిన సంస్కృతకవులు వాల్మీకి, వ్యాస, కాళిదాస, భారవి, మాఘ, బాణ, మయూర, దండి, భవభూతి, శ్రీహర్ష, మల్హణులు.

తెనుగుకవులు—నన్నయభట్టు, తిక్కన సోమయాజి, ఎఱ్ఱాప్రగడ, నాచన సోమన, హుళక్కి భాస్కరుడు, బమ్మెర పోతన, అనబడువారు.

ఇందలి విశేషమేమన ఈతని వంశమునకు పూర్వుడగు పిల్లలమఱ్ఱిపినవీరనస్తుతింపని "ఎఱ్ఱయ"ను ఈ కవి స్తుతించినాడు.

ఇందలి శైలినిబట్టి, స్తుతించిన కవులను బట్టి ఈతడు సంస్కృతాంధ్రములు చక్కగా గౌరవముతో జదువుకొనిన వాడని తెలియును. ఈతడు తన వంశ చరిత్ర చెప్పుకొని పూర్వుల స్తుతించి, తద్వారా లోకోపకారమొనర్చుట విశేషము.

కథాక్రమము

ప్రథమాశ్వాసము : సూతుడు ఈ కథను శౌనకాదులకు జెప్పినాడు. నైమిశాటవీ వర్ణన, మౌనీంద్ర వర్ణనము, సోమవార వ్రత మాహాత్మ్యము.

వింధ్య గిరిమధ్య ప్రాంతమున గల కథ— ఆ ప్రాంతమునకు రాజు చిత్రవర్మ. కడుంగడు శివభక్తుడు. ప్రతాపవంతుడు. దానశీలి. ఈయన కొక్క కొమరిత. పేరు సీమంతిని. ఈమె విషయము సర్వమును, బ్రాహ్మణుల రావించి యడుగగా పదునాల్గవ యేట ఆమె భర్తృవిహీన యగునమట తెలియును. పిమ్మట అందామె అంగప్రత్యంగ వర్ణనాదులు గలవు.

ద్వితీయాశ్వాసము : ద్వితీయాశ్వాసమున, యాజ్ఞవల్క్య మునిపతి, రాజగు చిత్రవర్మ కడకు వచ్చుట, అట నా మునిపతికి సీమంతిని కనుపడుట, వారి సంభాషణము, సుజనదుర్జన వర్ణనము, సజ్జన లక్షణము, ధర్మాధర్మ వివరణము, బ్రాహ్మచర్య ధర్మములు, గృహస్థాశ్రమ ధర్మములు, వానప్రస్థాశ్రమ ధర్మములు క్షత్రియ ధర్మములు గలవు. అంతేగాదు. పతివ్రతా లక్షణములు, శివభక్తి మాహాత్మ్యము, విభూతి మాహాత్మ్యము, రుద్రాక్షధారణ మాహాత్మ్యము, పంచాక్షరి మంత్ర మాహాత్మ్యము, సోమవారవ్రత మాహాత్మ్యమును కూడగలవు.

సంభాషణమున మునిపతికి, తనకు రాబోవు వైధవ్యమును గూర్చి తెలుపుట, దానికి మునిపతి సర్వమును శివుని యధీనమేగాన సర్వకార్య సాఫల్యమునకు శివుని గొల్వుమనుట. నాటి నుండి సీమంతిని యట్లే జేయును. అటనుండి వరునకై వెదకుదురు. అందు నిషధ రాజ తనూభవుడు—చంద్రాంగదుడు తగినట్లు నిర్ణయింతురు. పిమ్మట సీమంతిని విరహవర్ణనము.

తృతీయాశ్వాసము : సీమంతినీ విరహవృత్తాంతము చెలులచే రాజు వినుట. దానికి తగిన వరుడగు రాకుమారునికై రహస్యముగ వెదకును. మిత్రుల వలన నిషధరాజు సర్వము విని యొప్పుకొనును. పెద్దల నిర్వుర సమ్మతపరుతురు. పరిణయము జరుగును. పిమ్మట సీమంతిని అత్తవారింటికి వెళ్లి తిరిగివచ్చును.

చతుర్థాశ్వాసము : విరహవర్ణనము, కొంత ప్రకృతి వర్ణన, పిమ్మట జలకేళి—అందునవే యమునాంతర్భాగమునకు నోడ గొట్టుకొనిపోవుట. పరిచారకులు రాజుతో సీమంతినితో జెప్పుట. అందులకు సీమంతినియు దాను పెనిమిటి మార్గమునే అనుసరింతునని తెలుపుట, వారు వారించుట, చంద్రాంగదుని పరలోక క్రియలు జరుగుట. ఇక సోమవార వ్రత మారంభించును. దుఃఖాక్రాంతుడగు ఇంద్రసేనుని రాజ్యమును శత్రువులు ఆక్రమింతురు. చిత్రవర్మ కారాగారబద్ధుడగును. యమునానదిలో బడిపోవు చిత్రాంగదుని నాగకన్యలు జూచి రూపలావణ్యములకు ముగ్ధులై అబ్బురమంది యా వృత్తాంతమును ప్రశ్నింతురు. వివరించిన పిమ్మట। వారిలోవారాతని పొందు నుద్దేశించి రమ్మని వెంట తమపాతాళలోకము

నకు గొంపోదురు. పాతాళ వర్ణనము, పాతాళ రాజ్యాధినేతను గాంచుట, వారి సంభాషణము. సర్వమాతడు దెలిపిన పిమ్మట రాజాతని సర్వభోగముల ననుభవింపమనును. కాని యాతడియ్యకొనక నిజరాజ్యమునకు బోదునని దెల్పును. సమధికబలుడగు దానవుని, అశ్వమును, కొంత భూషణ సంచయము నిచ్చిపంపును. తిరిగివచ్చు సీతని జూచి సీమంతిని యబ్బురమందును. సర్వము నాతడు దెలిపికొని సోమవారవ్రత మాహాత్మ్యమనుకొని, మీ భర్త సఖుడను, రేపు నీ పతి రాగలడని యభయమిచ్చి, నిజ జనకుని కడకు వెళ్ళును. కాని ఆమె సందేహము తోడనే ఉండును. నిజ రాజ్యమునకు వెడలి స్వవిషయముల జూచి, విచారించి, శత్రురాజుల దన బలముచే భయపెట్టి దాసోహమ్మనునట్లు గావించి తండ్రిని సంతోషపరచును.

పంచమాశ్వాసము : ఇందు వివిధ దానాదికములు, సీమంతినీ చంద్రాంగదుల పునర్వివాహము, సుతజననము—సోమవారవ్రత మాహాత్మ్య వర్ణన.

ఇది స్థూలముగ నిందలి కథ—

ఇందలి విశేషములు

"ఎపుడేమి ప్రమాదమో యెఱుగరాని
మనసు గెల్చితి ననుచు నమ్మంగరాదు" అను సీతని వాక్యము ఈ కవికి గల మనస్తత్త్వ శాస్త్రోద్దేశ్యమునను దెల్పుచున్నది. (Psychological attitudes). ద్వి. అశ్వాసము. ఇది ఆనాటికిగాదు. ఏనాటికి మరువరాని విషయమని వేరుగ జెప్పనేల?

పంచమాశ్వాసములోగల వివిధ వృత్తములు—ఈతని భక్త్యుద్రేకములకు దార్కాణములు. ఈతడు వాడిన "మణిగణ నికరము" ప్రాచీనులగు వారిలో నన్నెచోడుడు దక్క మరెవ్వరు వాడలేదు. ఈతడు బంధకవిత్వమున ప్రవీణుడని నాగబంధ, చక్రబంధముల వలన దెలియుచున్నది.

ఉదాహరణములు:—

నాగబంధము—

అనఘ గవేశయాన భువ నావన ధర్మ
సదాసదాగమో
ఘనత దయావిధాన శివ కావలె విష్ణు
శరాయు మాధవా
ధనద సఖాయ జాను శమ ధామచలజ్జని
యోగ భావితా
మనన యుతా సమానజన మానసగణ్య
యభేదశీలనా.

చక్రబంధము:—

విత్రాసోద్యను శ్రీసతీభసన పృథ్వీశస్య
సత్రిప్రియా
సూత్రానుస్తుత గీర్యధీశ వరచకు:
కృత్త సంకల్పజా
చిత్రానంద శరీర ప్రోవువటువేషీ తిగ్మ
భావిప్రదా
పాత్రోత్తానిహతాసురాసుర ....
దేవజాలాధిపా.

ఇక—ప్రథమాశ్వాసమున—

"హరునిచరితంబు నిస్సంశయంబుగాగ
బలుక వాణీవధూటికాప్రాణభర్త
యైన జాలడు నా నేర్చినట్టి కొంది
మీకు వివరింతు విమల వివేకులార." అను గీతిలో 'వాణీవధూటికాప్రాణభర్త' యనుచోట ధ్వని పూర్వకముగ సాక్షాత్తు వాణీప్రాణనాథుడైన చాలడు, ఎవరింక జాలుదురని తెలుపుట ఇట గల విశేషము.

ఇందు గల శబ్దాలంకారములు పెక్కులు ప్రబంధమునకు గల అంగ ప్రత్యంగ వర్ణనము, సూర్యోదయ, రతి, వివాహ, పుష్పాపచయ, సలిలకేళి వర్ణనములన్నియు గల్గినది. నాయకుడు చంద్రాంగదుడు, ధీరోదాత్తుడు. సంపూర్ణ వస్త్వైక్యము గల గ్రంథము. భక్తియే ప్రధానముగ గల్గినట్టి శృంగారమంగిరసముగా గల భక్తిప్రబంధము. కవి ఇందలి భక్తిని శృంగారముతో మేళవింపజేసినాడు.

ఇందలి లోకోక్తులు—

"పువ్వు జనియించువేళనే [illegible]ట్టుగాని,
పట్టి యొకచోట దె[illegible]నే పరిమళంబు"
"పాము బలసిన గరళ[illegible] ప్రబలమగును
గోవు బలసిన దుగ[illegible] గురియు"
అనబడునవి మిక్కిలి [illegible]నోజ్ఞముగ గలవు.

ఇక పుష్పాపచయ సందర్భమున 'రగడ'ను

(28 ఏంకౢ_త్తలలో) వాడినాడు. ఇది చాల మనోహరముగ నున్నది. ఉదాహరణము..

"చెలియంగా కనుమీ సిరిగల తావులు
చలువలతో వెదజల్లెడు తావులు
జిగిగల యా దిరిసెపు విరికేసరి, తగ సీ
మెత్తని తనువునకే సరి
చేరెదరందఱు జెలులీ పొగడకు, నూరక
యుండగ నుచితమె పొగడక"

అని వ్రాయుబడినది.

ఇక వియ్యంకులగు విద్వర సమముగ జెప్పు సమయమున

"శబ్దార్థ సమేతమై చాల వెలయు,
నర్థయోగంబుచే
శబ్దమలరు" అని వ్రాసి, కాళిదాసు వ్రాసిన
"శబ్దార్థములు—పార్వతీపరమేశ్వరుల" వంటి వను భావమును దెలియజెప్పినాడు.

ఈకవికిగల వేదాంత జ్ఞానమున కుదాహరణము
దేహగతములైన స్త్రీపుంస భేదముల్,
నిజము లౌనె యాత్మ నిజము గాక" అని యుటంకించి తన ప్రౌఢిమను దెలుపుకొనినాడు.

ఈ కవి చిత్రకవిత్వమున సిద్ధహస్తుడని నిరోష్ఠ్యమువలన చతుర్విధ కందమువలనను దెలియు చున్నది.

చతుర్విధ కందము

"సామూర్త జూట ఖండిత
కామా కమనీయ వేష గౌరీ రమణా
హేమాద్రి జార రంజిత
భీమా విమల ప్రకాశపుంగవ గమనా."

అనునది. దీనిని మూలమున గల వ్రాతప్రతుల సాయమునగాని నిర్ణయింప వీలులేదు.

ఇట్టి మహోత్కృష్ట గ్రంథము ఆంధ్ర వాఙ్మయమున నుండుట, అది నేటికి, మనకు గన్పట్టుట గమనార్హము. ప్రతియొక్కరు జదువదగిన గ్రంథరాజము.

ఇట్టి ప్రబంధము నేడు, ముద్రింపబడినను, అపురూపముగుచున్నది. కేవలము శృంగార ప్రబంధములతో భక్తిని సమ్మేళనము చేసిన, ఈ ప్రబంధమును వ్రాత ప్రతులతో సరిజూచి, పరిశోధించి, సుసంస్కృతముగ పునర్ముద్రణము జేసిన యెడల ఇది ఆంధ్ర ప్రబంధ వాఙ్మయమునకువొక యలంకారము కాగలదు. ఈ క్రిందివి ఇందలి ముఖ్యలక్షణములు. అవి:— 1. చారిత్రికాంశములు. 2. కథారమ్యత 3. రసప్రతీకము 4. వృత్తముల విశేషములు 5. అలంకార వైవిధ్యము 6. ధ్వని 7. వర్ణనములు 8. వ్యాకరణ విశేషములు 9. నిత్యజీవితోపయోగకరములగు విషయములు. 10. వేదాంత విషయములు.

కావున ఇట్టి సర్వవిషయ సమూపేతము, విజ్ఞాననిధి, యగు గ్రంథము, ఆంధ్ర పాఠకలోకమునకు తప్పక ఉపయోగపడి, సాహితీ ప్రపంచమున వేఱొక్క మాహాత్మ్య గ్రంథముగుననుటకు సందేహములేదు.

—శ్రీ ముదిగొండ వీరేశలింగము.

బట్టి ఇంతకు పూర్వమే ఆ భాషలు వ్యాప్తిలో నుండెనని, ఆంధ్రకవులు ప్రాకృతభాషాపరేంగితజ్ఞులని తెలియుచునే యున్నది. నన్నయభట్టారకుని "వాగనుశాసన" బిరుదము ఆంధ్రశబ్ద చింతామణి మూలముననే సిద్ధించెననియు, సార్థకమైనదనియుగదా ప్రతీతి. అది యటుండనిండు. "తెలుగు వ్యాకరణములో వర్ణసమామ్నాయమున ప్రాచీనము నుండియు సంస్కృత ప్రాకృత విభజన లేదు" — "తద్భవప్రక్రియకు తప్ప, తక్కిన వ్యాకరణ కార్యముల కేవిధమైన సంబంధము లేకపోవుటచేత తెనుగున 10 వ శ. పూర్వము వైయాకరణులు,లక్షణ గ్రంథకర్తలు ఎవ్వరునూ తెలుగువ్యాకరణములో ప్రాకృత భాషా ప్రసక్తిని తెచ్చినవారు కారు" — "చిన్నకోట పెద్దనకూడ వర్ణసమామ్నాయమున ప్రాకృతము పేరైన ఎత్తలేదు. కాబట్టి వర్ణ సమామ్నాయ విషయమున ప్రాకృతభాషా ప్రసక్తి లేదు" ఇత్యాది వాక్యములతో ప్రాకృతమునకు, ఆంధ్రమునకు సంబంధము లేదు అని పదే, పదే తెలుప ప్రయత్నించుటయే కాక అట్టి భాషా విభజన, వర్ణసమామ్నాయ వివక్షతగల గ్రంథరాజము ఆంధ్రశబ్ద చింతామణికాలమును 1600 లకు మార్చ యత్నించిరి.

ఈ వర్ణసమామ్నాయ వివరణమున ఆంధ్రశబ్ద చింతామణి ఆంధ్రమునకొక మార్గమున సంబంధములైన ప్రాకృత, సంస్కృత శబ్దములకు బాంధవ్యమును నిరూపింప యత్నించినది. కొంత వరకు సఫలీకృత అయినది. దీనికి తద్భవ రూపములే సాక్షి. సంస్కృత పదముల నుండియేగదా తద్భవములు ఉదయించె. ప్రాకృత మాతృకలు ప్రాచీనులచేత నిరూపింపబడకుండినను వ్యాసకర్త కొన్నింటిని చూపియున్నారు. కాలక్రమమున తద్భవము లన్నింటికి ప్రాకృతత్వము సిద్ధించినది. వర్ణ సమామ్నాయ వివరణము ఆంధ్రశబ్ద చింతామణి కన్న అధికముగాగాని, విస్పష్టముగాగాని, ఉన్నతముగాగాని చేయగలధీమణి లేకున్న అది నన్నయ దోష మేలఅగును. అందుమూలమున ఆంధ్ర శబ్ద చింతామణి క్రీ. శ. 1100 ప్రాంతముననే రచింపబడెననియు కాలక్రమమున పండితులు వర్ణ సమామ్నాయ విభజనయందుకన్న వ్యాకరణ కారక నిరూపణము, తద్భవరూపముల అన్వేషణ ఇత్యాదుల యందు శ్రద్ధవహించిరి అని అనుకొన్న వివాదమునకు తావులేదు.

కావున ప్రాకృత ఆంధ్ర జన్య జనక సంబంధమునుగూర్చి గాని, ఆంధ్రశబ్దచింతామణి కాలమును గూర్చి గాని నిర్దుష్టమైన అభిప్రాయమునకు రా యత్నించుటకు ముందు తగిన ఆధారములు నిరూపింప గోరుచున్నాను. పరస్పర వివాదాస్పదములైన ఇట్టి ఆధారములవలన లాభమేమియు నుండదు. నిర్దుష్టములైన ఆధారములతో నేనొక వ్యాసమును రచియింప శ్రీ నిడుదవోలు వెంకటరావు గారిని ప్రార్థించు చున్నాను.

—వి. సత్యనారాయణరాజు.

గురజాడ ముత్యాలసరాలు ఉత్కళికావృత్త అనుకరణమే!

ఆర్యా!

పధ్నాలుగో శతాబ్దంలో రావిపాటి త్రిపురాంతకుడనే మహాకవి, "త్రిపురాంతకోదాహరణము" అనే మహాకావ్యం వ్రాసి యున్నాడు. ఆ కావ్యంలో "ఉత్కళిక"లు ఉన్నవి. ఉత్కళికావృత్తమన్నను, ఉదాహరణ వృత్తమన్నను ఒకటే! రెంటి లక్షణం కూడా ఒకే స్వభావం కలది.

అనంతుని ఛందములోను, అప్పకవీయంలోనూ యీ వృత్త లక్షణ వివరము ఉన్నది. శివకవులైన పండితారాధ్యులు, పాల్కురికి సోమనాథుడు కూడా యీ "ఉదాహరణలు" వ్రాసినట్లు వాఙ్మయ చరిత్రలో ఉన్నది కూడా.

గురజాడ అప్పారావుగారు తన ముత్యాలసరాల ఛందస్సును పారసీక గజల్ నుండి స్వీకరించినట్లు ఇప్పటివరకు ప్రచారములో ఉన్నది. కానీ సత్యాన్వేషకులైన వారికి, రావిపాటి త్రిపురాంతకుడు వ్రాసిన ఉత్కళికా వృత్తములే మూలమైనట్లు, వాటినే అనుకరించినట్లు బోధపడుతుంది.

యీ "ఉత్కళిక"నే ఆ కొస యీ కొసవూర్చి

ముత్యాల సరాలని" క్రొత్తపేరు పెట్టుకొన్నాడు గురజాడ. యుక్తివాదం చేత యిది త్రోసిపుచ్చే విషయంగాదు. ఆంధ్రభాషలో గురజాడకు కూలంకష మైన పాండిత్యం, పరిశోధన కలవు. ఆయన తప్పక యీ ఉత్కళికా వృత్తాలను చూచి ఉండక తప్పదు. ఆ వృత్తాలే గురజాడను ముత్యాల సరాలను వ్రాసే దానికి ప్రేరేపించి ఉండవచ్చు. పారశీక గజల్ నుండి ఆ ఛందస్సును గ్రహించాడనేది వాదనకు నిలబడదు. విమర్శకులు అంగీకరించరు.

ఉత్కళికావృత్తాలను, ముత్యాలసరాలను దగ్గర పెట్టుకొని చదివితే, యేది మూలమో, తేలిపోతుందని సహృదయులైన పండితులను అభ్యర్థిస్తున్నాను.

దాదాపు ఆరువందల సంవత్సరాల వాడు ఆంధ్ర దేశంలో అన్నిమూలలా ప్రచారంగావింపబడి, వ్రాయబడి, తుదకు జానపద సాహిత్యంలో కూడా ప్రవేశం గల్గిన "ఉత్కళిక" నుండిగాక, పారశీక గజల్ నుండి గురజాడ ఆ నడకను స్వీకరించాడనడం, అసంబద్ధం, విడ్డూరము అనిపించుకొంటుంది.

గురజాడ చేసింది గ్రంథచౌర్యంగాదు. కానీ ఉత్కళికా వృత్తాలకు, అనుకరణ మాత్రమే. పారశీక గజల్ కంటే, ఉత్కళికావృత్తం, గతిలో గమకంలో అందమైనది. మధురమైనది గురజాడ ముత్యాల సరాలకు "ఉత్కళిక" యే మూలవృత్త మనడం నిర్వివాదం.

—వై. ఆదిశేషారెడ్డి.



గ్రంథ విమర్శలు

"అసురసంధ్య" (నవల)

(రచన: ఆర్. యస్. సుదర్శనం; ప్రచురణ: ఆదర్శ గ్రంథ మండలి, విజయవాడ—2. వెల: సాదా ప్రతి రు. 6—00.)

ఇటీవలి తెలుగు నవలా రచయితలూ, రచయిత్రులూ తమ రచనల్లో ముడిసరుకు కోసం స్వంత అనుభూతిపై ఆధారపడటం ఎప్పుడో మానివేశారు. తెలుగునవల ఎదిగేదశ (Formative stage) లో వున్న తరుణంలో వుప్పెనగా వచ్చిపడిన హిందీ, బెంగాలీ నవలల అనువాదాలు ఒకవిధంగా యిందుకు దోహదం చేశాయి. ఈ అనువాదాలచేత ఉత్తేజితులై పాశ్చాత్య నవలతో పరిచయం లేకుండా (ఈమాట ఎందుకంటున్నానంటె మనకు నవల పాశ్చాత్య సాహిత్యం లోంచే వచ్చింది గనుక) వ్రాస్తున్న రచయితలిప్పటికీ శరత్ నవలలలోని కన్నీళ్లు కార్పించే జాలీ (Lachrymose—Sentimentality), జైనేంద్రకుమార్ నవలల్లోని నకిలు గాంభీర్యమూ (Pseudo-Solemnity) మొదలైన లక్షణాలను అలవర్చుకుని, కృత్రిమావేశాలనూ, కృత్రిమానుభవాలనూ చిత్రించి తృప్తిపడుతున్నారు. ఈ ధోరణికి లోబడకుండా అనుభూతుల ప్రేరణతో, విజ్ఞతతో రచింపబడి ఆలోచనలు రేకెత్తించే నవలలు చాలా అరుదుగా వస్తున్నాయి. అలాంటి అరుదైన నవలల్లో ఒకటి సుదర్శనంగారి "అసురసంధ్య".

"అసురసంధ్య" భారతదేశ చరిత్రలో స్వరాజ్యం వచ్చినప్పట్నుంచి చైనా దాడివరకూ దిగజారుతూవచ్చిన జాతి సత్వానికీ, వ్యక్తి ఆత్మకూ సంకేతం. స్వరాజ్య సంపాదనతో, ఆ క్షణం వరకూ దేశంలో సాగిన రాజకీయ విప్లవం ఒకదారికి వచ్చింది కాని, ఆ నాటినుంచి దేశంలో ప్రారంభమైన సాంఘిక విప్లవమూ, దానిపై పాశ్చాత్య జీవన విధానం, శాస్త్రీయ విప్లవం చూపిన ప్రభావమూ—వీటి ఫలితంగా సమాజస్వరూపం శీఘ్రంగా మారి ఒక అనిశ్చిత పరిస్థితి ఏర్పడింది. అంతకు పూర్వం మతంలో రాజకీయాల్లోవున్న సమైక్యత (Integrative) విశ్వాసాలు నశించి, వ్యక్తిలో సంఘర్షణ బయలు దేరింది. ఈ సంఘర్షణను అంతంచేసి గీతా ప్రవచనం దగ్గర్నుంచీ సార్త్ర్ అస్తిత్వవాదం (Existentialism) వరకూ మారుతూ వచ్చిన విలువలకు రాజీ కల్పించి నిర్వీర్యమైపోతున్న జాతిని పునరుజ్జీవనం చేయాలంటే అందుకు మొదటి మెట్టుగా సమాజాత్మజిజ్ఞాస జరగాలి. ఆ సమాజాత్మజిజ్ఞాసకు నాంది అయిన వ్యక్తి ఆత్మజిజ్ఞాసకు ప్రతీక, "అసురసంధ్య" కథానాయకుడు శ్రీధర్.

స్వరాజ్యం వచ్చిన కొద్దిరోజులకే ఒక అసురసంధ్యవేళ గాంధీ హత్య చెయ్యబడ్డాడని విని విచారంగా బందరువీధుల్లో నడుస్తున్న శ్రీధర్‌ని డీకొట్టి, "గాంధీగారు చచ్చిపోతే స్వరాజ్యం పోదా అండీ?" అని ప్రశ్నించిన కుర్రవాని ఆత్రమూ, అమాయకత్వమూ శ్రీధర్‌నికూడా. ఆ ఆత్రం అజ్ఞానం వదిలించుకుని శ్రీధర్ తన బాధలతో, అనుభవాలతో, సంఘర్షణలతో, క్షాళితుడై తన స్వధర్మాన్ని గుర్తించిన రోజున అతడికి కొత్త విశ్వాసం వస్తుంది. "స్వరాజ్యంపోదు, చైనా దాడిచేసినా పోదు" అన్న సమాధానం స్ఫురిస్తుంది. ఆ క్షణం వరకూ, దాదాపు పదిహేనేళ్లపాటు శ్రీధర్ చేసుకున్న జిజ్ఞాస, అతడు పొందిన సాంఘిక తాత్విక పరివర్తనమూ (Socio-Philosophic metamorphosis) నవలలోని కథ.

మొదటి శ్రీధర్‌లో మనకు కనబడే లక్షణాలు అతడి ఆదర్శ ప్రియత్వమూ (Idealism), అతిసుకుమారత్వమూ (Hyper-Sensitiveness), ఆడపిల్లలంటే కాల్పనిక ఆరాధన (Romantic Adoration) తో కూడిన సిగ్గూ. ఈ ఆరాధన నంతా చిన్ననాటి స్నేహితురాలు పద్మమణి మీద కేంద్రీకరించాడు. ఆ తర్వాత, అనుభవాన్నిమించి విలువైనది లేదన్న నమ్మకంతో జీవితంపట్ల భయం, గౌరవం లేకుండా తిరిగే మద్రాసు స్నేహితుడు నాగరాజూ, అతడి ద్వారా పరిచయమైన మాయలతాసిసీలియాలూ—అతడి అతిసుకుమారత్వాన్నీ, కాల్పనిక దృష్టినీ సగం భగ్నం చేస్తారు. నాగరాజు జీవితాన్ని, విలువల్నీ వేరుచేసి చూస్తున్నాడని బాధపడ్డ శ్రీధర్, అప్పటిదాకా తన విలువల్ని నిశ్చయంగా ఏర్పరచుకోలేదు. మాయలతతో పరిచయం చేసే టప్పుడు తననిగురించి నాగరాజు చెప్పిన అబద్ధాలను ఖండించే ధైర్యం లేదుకాని ఆ తర్వాత నాగరాజుని కోప్పడతాడు, తనని 'అబద్ధాలకోరు'ను చేశాడని. అప్పటిదాకా తను వైవాహిక ధర్మానికి కట్టుబడ్డాననుకున్న వాడు, నాగరాజూ సిసీలియాల ప్రణయకలాపం గమనించాక తనకు "ప్రేమమార్గం శాశ్వతంగా మూయబడిం"దని నిట్టూర్చుతాడు. (పే. 46). ఇది వ్యవస్థతో బంధం తెంచుకోలేక అతడు పడే సంఘర్షణ.

అతడి యీ వ్యవస్థాప్రియత్వంపై దెబ్బతీసినవ్యక్తి చంద్రావతి. మహాబలిపురం వెళ్లినప్పుడు ఆ శిల్పాలను చూసిమూ చంద్రావతి అన్నది: "నిలిచిందేదో అది గట్టి. దీన్ని రేవు అలలు పైబడివచ్చి ముంచివేసి లోపలికి లాక్కుపోరాయా, పోనీ. అంతేకాని మంచిదిపోయిందన్న ఏడుపు అనవసరం. ఇదీ డార్విన్ సిద్ధాంతము లాంటిదే...... ఆ మాత్రం వ్యవస్థ, సంస్కృతీ, శిల్పమూ, నాగరకతా వగైరాలకూ అన్వయిస్తుంది." కాని నాగరాజు అతడికి జీవిత సత్యాలను నిర్దాక్షిణ్యంగా ప్రదర్శిస్తే, చంద్రావతి అతణ్ని సానుభూతితో అర్థం చేసుకోవటానికి ప్రయత్నించింది. అతడింకా ఆదర్శానికీ సత్యానికీ

పొత్తు కుదరక బాధపడుతున్నాడు. ప్రతిమనిషికీ ప్రత్యేకంగా ఒక ఏకాంతభాగం తనలో తనదిగా వుండాలని వాదించే చంద్రావతి నిజజీవితంలో దాపరికం లేకుండా ప్రవర్తిస్తుంటే, శ్రీధర్ మనిషి తన వ్యక్తిత్వంలో వచ్చే పరిణామాలన్నిటినీ బహిరంగం చెయ్యాలంటూనే మరోవేపు అడ్డుగోడలు (Inhibitions) పెంచుకుంటున్నాడు. అతడి యీ ద్వంద్వ వ్యక్తిత్వంపై కూడా దెబ్బతీసి, సహజంగా ఉండటం నేర్పింది చంద్రావతి. చంద్రావతి బేథింగ్‌సూటుతో స్నానం చెయ్యటాన్ని అతడు సహించలేక పోవటం, అతడిలో యింకామిగిలి వున్న కాల్పనిక దృష్టికీ, అయోమయమైన విలువలకూ ఉదాహరణ.

అతడు పూర్తిగా అంతర్ముఖుడై నిజమైన విలువల్ని సృష్టించుకోవాలంటే అందుకు కొందరు వ్యక్తులు ప్రతిబంధకంగా ఉన్నారు. వాళ్ళు మంగమ్మా, ఓబయ్యా, నరసింహాలూ, తారా, రుక్మిణమ్మా. వీళ్లలో మంగమ్మ, ఓబయ్య, నరసింహాలూ భౌతిక ప్రపంచపు విలువల (Material Values) కు ప్రతినిధులు. ఆ ప్రపంచంలోంచీ తప్పించుకోవటం శ్రీధర్ కేమంత కష్టం కాదు. పోతే, రుక్మిణమ్మా, తారా అతడు సంబంధం తెంచుకోలేని వ్యవస్థకు రెండుముఖాలు. ఈ వ్యవస్థకూ, వైయక్తికధర్మానికీ మధ్య కొట్టుమిట్టాడేటప్పుడు అతడు రుక్మిణమ్మనుంచీ ఎదురు చూచిన మాతృత్వ ప్రేమను చంద్రావతిలోనూ, భార్యగా తార యివ్వలేకపోయిన అనుభూతిని పద్మమణిలోనూ పొందాలని అనియంత్రితం (Unconscious)గా ప్రయత్నిస్తాడు. వీటిలో మొదటి ప్రయత్నం అర్ధాంతరంగా ఆగిపోతుంది. ఆగిపోక తప్పదుకూడా. ఇక పద్మమణితో సన్నిహితమయ్యేటప్పటికి అతడు కొంతవరకూ ఎదిగాడు. అహం (Ego) చంపుకున్నాడు. అతడిలో యిప్పుడున్నది భౌతిక వాంఛ (Sexual Urge) కాదు, చంద్రావతి విషయంలో పేర్చుకున్న కాల్పనికభావాలూ కావు. అతడి కిప్పుడు కావలసింది వీటన్నిటినీ మించిన, ఏ తర్కానికీ అందని, కేవలం తన సొంతమైన అనుభూతి. పద్మమణికి సమాధానంగా అతడు చెప్పే మాటలివి: "ఈ దీపశిఖలో జ్వలించి నశిస్తానో, అమరత్వం పొందుతానో! నాకు నువ్వు కావాలి..... నీలో లీనమై నేను తెలీకుండా పోవాలి...... శరీరంతోకాదు, నా సర్వస్వంతో, నీతోకాదు, నీలోని నీతో.... కాని శారీరకంగా దగ్గరకు రావటం శాశ్వతంగా దూరంగా పోవట మౌతుందేమో!...." వ్యక్తిత్వం లయించగా మిగిలిన అస్తిత్వపు తాలూకు నగ్నత్వాన్ని, అనందాన్ని అన్వేషించటం అత డిప్పుడు నేర్చుకున్నాడు. అతడు స్వధర్మాన్ని తెలుసుకున్నప్పు డా అన్వేషణ సులభమౌతుంది.

స్వధర్మం అంటే నమ్మకాలతోనూ మతాచారాలతోనూ సంబంధంలేని, వ్యవస్థకూ వైయక్తికమైన విలువలకూ అందని, హేతువాదులూ, వేదాంతులూ అంగీకరించని, ఒక 'అంతరంగిక'మైన సత్యంమీద ఆధారపడినట్టిది. జీవితంలో మనం గౌరవించే విలువల్లో ఏదీ సార్వజనీనం (Universal) కాదు. విలువ లనేవి ప్రతిమనిషి తన జీవితాన్ని నిర్మించుకునేటప్పుడు తన వ్యక్తిత్వానికి సరిపోయేవిధంగా సృష్టించుకోవలసినవి. "జీవితానికే ప్రాముఖ్యం యిస్తూ అవసరమైన విధంగా నా నైతికధర్మాన్ని రూపొందించుకోవటమే నా పద్ధతి", (పే. 48) అని చెప్పిన నాగరాజాది కూడా యీ మార్గమే. ఈ మార్గంలో పయనించటానికి శ్రీధర్‌కు కావలసిన ధైర్యం యిచ్చి, అతడింకా ప్రేమిస్తున్న సంకెళ్లనుంచీ పూర్తిగా విముక్తి పొందడానికి తోడ్పడిన వ్యక్తి ఆత్మానందస్వామి. ఆయన పూర్వాశ్రమంలో శిష్యుడిగా శ్రీధర్‌లోని కాల్పనికవాదిని ఆకర్షించిన రసోన్మాది. తర్వాత ఆత్మానందస్వామిగా సనాతన ధర్మానికీ స్వధర్మానికీ సామరస్యం కుదిర్చి శ్రీధర్‌లోని జిజ్ఞాసువును సంతృప్తిపరచే వేదాంతి.

శ్రీధర్ తన లక్ష్యంవైపు చేసే యీ ప్రయాణాన్ని రచయిత ప్రశంసనీయంగా చిత్రించాడు. నవలలో కథాగమనాన్నంతా మనం శ్రీధర్ పాత్ర ద్వారా చూస్తాము. కాని రచయిత ఆ పాత్రను సాంతం పూర్తి ఆలోచనామయం (Intellectualise) చెయ్యటంవల్ల శ్రీధర్‌లో మొదటవున్న మానవ స్పర్శ (Human Touch) చివరన కనిపించదు. నవల ఆముఖంలో పేర్కొన్నట్లు శ్రీ సుదర్శనంగారు నవలను ఒక దృష్టి (Point of View) గా భావించటంతో నాకు పేచీలేదు. కాని ముఖ్యంగా గుర్తుంచుకోవలసింది నవల జీవితానికి ప్రతినిధి అని. శ్రీధర్ సందేహాల్లో, సంఘర్షణలో, జిజ్ఞాసలో, 'మనిషి' అడుగున పడిపోయినా కనిపిస్తుంది. ఆత్మానందస్వామి విషయంలోనూ అలాగే అయింది. ఆయన ఆధ్యాత్మిక భావాలు అలావుంచి, శ్రీధర్‌కు స్నేహితుడుగా, గురువుగా, వేదాంతిగా దారి చూపించేందుకు కావలసిన వాత్సల్యం, స్పందనా ఆయనలో కనిపించవు. దీనికి కారణం రచయిత తన దృష్టికీ కథా వస్తువుకూ పూర్తిగా సామరస్యం సాధించలేకపోవటమే.

నవలలో పురుష పాత్రలకన్నా, జీవంతో తొణికిసలాడేవి స్త్రీ పాత్రలు: ముఖ్యంగా చంద్రావతీ, పద్మమణీ. తను హాయిగా వుంటూ, చుట్టూవున్న వాళ్లను ఆహ్లాద పరచటం తప్ప మరే ఆదర్శం బరువూ చంద్రావతికి గిట్టదు. కాని ఆమె స్వతంత్రంగా నిరాడంబరంగా ఆలోచిస్తుంది. మాటల్లో, ప్రవర్తనలో ఆమె చూపే స్వాతంత్ర్యం కేవలం సందర్భోచితమైంది కాదు, అది ఆమె జీవన శైలికొక ప్రాథమిక నిబంధన. అందుకే ఆమె మేధావి కాకపోయినా శ్రీధర్‌ను అంతగా ఆకర్షించింది, ఆమెతోటి స్నేహం ఆగిపోతుందేమోనని అతడు అంతగా భయపడ్డాడు. చివరకు ఆదర్శాలు లేవనుకున్న చంద్రావతే ఆదర్శాలు ఎక్కువైన శ్రీధర్‌కు ఆదర్శం అయింది, జీవితం మీద కోల్పోయిన అధికారాన్ని తిరిగి సంపాదించుకోవటం ద్వారా. రచయిత చంద్రావతి పాత్రను అంతటితో వదిలిపెట్టకుండా చివరి వరకూ శ్రీధర్ జీవితంలో సంబంధం వుండేటట్టు చిత్రించి వుండవలసింది. పద్మమణి పాత్ర శ్రీధర్‌కే కాక పాఠకులకు కూడా ఒక తన్మయానుభూతి. ఒకప్పుడు రాఘవరావుతో వుండిన సంబంధంవల్ల సంఘంలో గౌరవింపబడకపోయినా, దానివల్ల ఏమాత్రమూ తక్కువకాని వ్యక్తిత్వం ఆమెది. చంద్రా

వతి నుంచి శ్రీధర్‌కు లభించింది మనిషికీ మనిషికీ మధ్య నున్న ఆత్మీయతలయితే పద్మమణి దగ్గర లభించింది 'ప్రేమ' 'స్నేహం' అనే ఏ నిర్వచనానికీ అందని ఒక ఏకీభావం. అందుకే ఆ తర్వాత నాగరాజు అతడితో అంటాడు: "నీవు పద్మమణి ద్వారా పొందిన అనుభూతి అలౌకికమైన దర్శనానికీ, యోగులు అన్వేషించే సమాధ్యవస్థకూ చేరువగా వుంది. ఆ అనుభూతి తర్వాత యీ మామూలు ప్రపంచం నీకు శూన్యంగా కనిపిస్తుంది." (పే. 385). చలమయ్య ఆమెపై దౌర్జన్యం చేసే సినిమేటిక్ (Cinematic) సంఘటన లేకుండా వుంటే ఆమె వ్యక్తిత్వం మరింత బాగా రాణించి వుండే దనిపిస్తుంది. ఇకపోతే, రుక్మిణమ్మ పరపోరాటా తెలుసుకోవాల్నా. వ్యవస్థ శ్రీధర్‌పై పెట్టిన బరువు తార, రుక్మిణమ్మ ఆ వ్యవస్థ కల్పించే రక్షణ.

కథను సుస్థితంగా, వాస్తవికంగా చెప్పటంలో సుదర్శనం గారికి గలనేర్పు యీ నవలలో మరింత స్పష్టంగా వెల్లడయింది. రచయిత తన జీవిత పరిశీలనను ఒక కళాత్మక రూపంలోకి అనువదించటానికి కావలసిన సంకేతాలను ఎన్నుకోవటంపైనే నవలలో వాస్తవికత ఆధారపడుతుంది. (Realism means selection). ఈ దృష్టితో చూస్తే "అమరసంధ్య" లో ప్రధాన పాత్రలకే కాక, నాగరత్నమ్మ, శ్యామ్, శ్రీధర్‌ని కాటిలనుంచి కాపాడే రంగడూ— వంటి చిన్న పాత్రలకు కూడా వాస్తవికతాముద్ర వుంది. నవలలో రచయితలు కొత్త ప్రయోగాలు చేస్తున్న యీ యుగంలో, ప్లాటుకు ప్రాముఖ్యం యివ్వకున్నా ఫరవాలేదు. కాని ప్లాటుకన్నా స్వరూపం (Form) ముఖ్యం నవలకు, ఎందుకంటే నవల ప్రాతినిధ్యం వహించే జీవితానికి స్వరూపం వుంది కాబట్టి. "అమరసంధ్య" లో చంద్రావతి పాత్రను మధ్యలో గాలికి వదలివెయ్యటం, చివరన శ్రీధర్ ఆత్మదర్శనాన్ని త్వరితం చెయ్యటంకోసం వేదాంత చర్చలపై ఆధారపడటం— లాంటి దోషాలవల్ల నవలా స్వరూపం కొద్దిగా దెబ్బతిన్నది. ఈ లోపాన్ని సవరించుకుని అన్ని విధాలా సమగ్రంగా వ్రాయవలసిన మరో గొప్ప నవలను తెలుగు పాఠకులకు బాకీ వున్నారు సుదర్శనంగారు.

గెటప్ నవలకు తగినట్టుగా లేదు. అక్కడక్కడా అచ్చు తప్పులున్నాయి. 278 వ పేజీలో 'చలమయ్య'కు బదులు 'పరమయ్య' అని పడింది. ఇవన్నీ మరిముద్రణలో సవరించ బడవలసిన దోషాలు.

—పి. ఆర్.

నలుపు చేసిన నేరమేమి?

[నలుపు చేసిన నేరమేమి? కర్త : బి. స. బంగారయ్య, ప్రాప్తిస్థానము తెలుగు నుడి నానుడి కూటమి. బెజవాడ, వెం 7—00].

తెలుగువారికి బుద్దులు సుద్దులు చెప్పుటకు వెలువడిన రచన యిది. ఈ బంగారయ్యగారు తెలుగువారికి ఆత్మావలోకనము అలవరించుటకు ఆచార్యపీఠము అధిష్ఠించిరి. వారు సృష్టించుకొనిన యీ ఆచార్యపీఠము గాలిమేడవంటిది. బంగారయ్యగారి పరిశీలనము ప్రకారము తెలుగువాడు తనను తాను కానలేకపోవుచున్నాడు. తన దేశభాషలపట్ల, తన సీమ పట్ల యెఱుకమాలిన తెలుగువాడు ఈసడింపు చూపుచున్నాడు. తన సభ్యతకు, సంస్కృతికి తిలోదకములిచ్చు చున్నాడు. వేయేల? నేటి తెలుగువాడు త్రిశంకుని పోలియున్నాడు. ఈ స్థితిని చూచిన బంగారయ్యగారు గుండె చెఱువు కాగా ఆంధ్రజాతిని ఉద్ధరించుటకు దీక్షాకంకణమును ధరించి, వైతాళికుని పట్టము గట్టుకొని మనుధర్మశాస్త్రమును పోలిన గ్రంథములు రచించుచున్నారు. తెలుగు బాసకు వన్నెలు చిన్నెలు చక్కదిద్దుటకు వారొక గ్రంథము నిదివరకు వెలువరించిరి. అది చరిత్రకు దుర్భాష్యములు రచించిన, ఆంధ్రభాషా పరిణామమును తెప్పుగా గుర్తించని, ఆర్యద్వేషము బ్రహ్మరంధ్రము దాకిన రచనము. హేతువులు ధూమకేతువులవలె నున్న రచనయది. ఈ గ్రంథము పైతము ఆకోవకు చెందినదే. ఆ పోకడపోయినదే.

ఒకజాతి పతనోన్ముఖమయినపుడో, పతనమయినపుడో వేగుజుక్క వంటి ప్రతిభామూర్తులు పుట్టి, దానిని పునరుద్ధరింతురు. వారు సమకాలిక దోషములను చూపుదురు. ఆ దోషములకు గల కారణములు వక్కాణింతురు. వానిని పరిహరింతురు. సహేతుకమయిన సిద్ధాంతములు చేయుదురు. రాబోవు తరతరముల వారికి మెఱుగులు దిద్దు బాటలు చూపుదురు. వారిది నిష్కామసేవ. తెలుగుజాతికి వెలుగు కలిగించుటకు నడుము బిగించిన బంగారయ్యగారు, తెలుగువారి దౌర్భాగ్యవశమున ఆ వైతాళికుల త్రోవ త్రొక్కలేదు. సుప్తచేతనాజగత్తు (Subconscious Mind)లో ఏవో తలపులు మెదలగా, బుద్ధిబలమును త్రోసిరాజని, అపమార్గమున పోయి, దుష్టసిద్ధాంతములు చేసి ఎందులకు పనికిరాని యీ మూడువందల యేబది పుటల గ్రంథమును తెలుగువారి కందిచ్చిరి. బంగారయ్యగారి సాహసము మెచ్చుకోదగ్గది!

అత్యుష్ణమండలవాసులు అభివృద్ధి చెందజాలరనియు, సమశీతోష్ణ మండలవాసులు సంస్కృతి స్థాపకులనియు, సమగ్రాభ్యుదయము సాధింతురనియు బంగారయ్యగారి సిద్ధాంతము. ఈ సిద్ధాంత కందమునుండి పుట్టిన పిలుక యీ పొత్తము. అత్యుష్ణమండలవాసులు నల్లగానుందురు. ఈ మండలము దరిదాపుల నివసించు తెలుగువారి జాతీయవర్ణము నలుపే. కాని యీ మర్మమును మఱచిన తెలుగువాడు తెలుపు మోజులో పడి కొట్టుకొనుచున్నాడు. నలుపును నెట్టివేయుచున్నాడు. ఈ తెలుపు రంగు ఎవరిది? బ్రాహ్మణులది. అనగా ఆర్యులది. వేలకొలది యేండ్ల నుండి నిలద్రొక్కుకొనిపోయిన యీ తెలుపు త్రుళ్ళు త్రుళ్ళగించివేసినగాని తెలుగుజాతికి కైవల్యములేదు. లేదని మనలను నమ్మించనుచున్నారు బంగారయ్యగారు. ఈ దృష్టితోడనే యీ గ్రంథమును రచించిరి. ఈ గ్రంథగత విషయము లిట్లున్నవి.

తెలుగుదేశమును కలయజూచిన బంగారయ్యగారికి క్రింది కిటుకులు తెలిసినవి. తెలుగు పల్లెలలో, వీధిబడులలో తెలుపు నలుపు నణగద్రొక్కుచున్నది. ఎల్లరు తెలుపునే వలచుచున్నారు.

ప్రాథమిక పాఠశాలనుండి కళాశాలలదాక, పల్లెల నుండి పట్టణముల దాక తెలుపు స్వైరవిహారము చేయుచున్నది. ఉపాధ్యాయులు నలుపు పట్ల రోయింపు చూపుచున్నారు. రాజవీధులలో, విపణి వీధులలో నలుపు అవమానింపబడుచున్నది. ఎఱ్ఱనివారు, తెల్లనివారు పెద్ద చదువులు చదివి పారుపత్తెము గుత్తకు తీసికొనగా, నల్లనివారు కండలు కరిగించి వెట్టిచాకిరి చేయుచున్నారు.. నన్నయాది కవులు తెలుపు గొప్పదనమును చాటుటకు కావ్యములు వ్రాసిరి. తెల్లనివాడే నాయకుడు కావలయును. నల్లనివాడు ప్రతినాయకుడు కావలయును. ఇది సాహిత్యశాస్త్ర సిద్ధాంతమయినది. బడులలో, మడులలో ధవళవర్ణాధిక్యము నిలబెట్టు చదువులే సాగుచున్నవి. సంస్కృతము తెల్లనివారి భాష. తెలుగు నల్లనివారి భాష. లోకము కూడ నలుపును హీనముగా చూచుచున్నది.

ఈ నాడు నలుపుపట్ల ఈ హేయభావము పెరిగినదిగాని, ప్రాచీనకాలమునందు ప్రజల నుడికారములో, పాగను దిద్దుకొనుటలో నలుపునాణెమే చెల్లినది. బలిష్ఠుని ఉక్కుమానిసి యనెడివారు. ఉక్కు నల్లనిదే గదా! కవి సమయములు సైతము నలుపునాణెమునే వెల్లడించుచున్నవి. కురులు ఎలతుమ్మెదల బారనియు, చన్నులు తాటి పండ్లనియు(?) తొల్లిటివారు, గానము చేసిరి. ఆ నాడు తెల్లనివారిని, ఎఱ్ఱనివారిని కోతులని హేళన చేసెడివారు. స్త్రీలు నల్లపూసలను, నల్లకాటుకను, నల్ల పాదును ఉపయోగించెడివారు. కాని కాలక్రమమున ఎల్లరు తెల్ల రంగును చూచి భ్రమసిరి. వర్ణవ్యవస్థను ప్రచారము చేసిన బ్రాహ్మణులు తమ శరీరవర్ణమును కాపాడుకొనుటకు కుట్రపన్ని తెలుపు నలుపుతో కూడకుండునట్లు చేసిరి. నల్లతెగవారు తమ వారెక్కడ తెలుపువలలో పడుదురోయని చుట్టును గిరిగీసికొనిరి. ఇవన్ని రంగులేర్పడుటకు సూర్యరశ్మి కారణము. ప్రపంచములో ఆదిమ కాలమున శీతలమండలములలో ఉష్ణమండలములలో మానవులుండిరి. శీతలమండలవాసులు వలసలుదీసి యుష్ణమండలములకు వచ్చిరి. మొదట తెల్లగా నుండిన వీరు వేడికి ఎఱ్ఱబడిరి. అందుచేతనే కాబోలు నలుపును నాశనము చేయుటలో తెలుపు ఎఱుపు రెండు నొకటేయగును. ఉష్ణమండలవాసులగు భారతీయులు దక్షిణము నుండి యుత్తరముగా వెళ్లి మంచుకొండలను దాటిరి. బర్మా థాయిలాండుల మీదుగా చైనావఱకు ఎగబాకిరి. వారి శరీరవర్ణము నలుపురంగు నుండి పసుపురంగుగా మాఱినది. అవయవముల రూపురేఖలు మాఱినవి. నలుపునకు పసుపురంగు ఇంత దగ్గరిది కాబట్టియే, మనయాడువారు ముఖవర్ణము పెంచుకొనుటకు పసుపును వాడుదురు. ఇది బంగారయ్యగారి పరిశోధనములవల్ల ఈనాటికి బయటపడిన జగత్సత్యము.

బంగారయ్యగారు రంగును భారత చరిత్ర కన్వయించిరి. మంగోలులు మున్నగువారు యూరపు వైపునకు తరలిరి. వారి దాడికి తట్టుకొనలేని యూరపు తెల్లరంగువారు చెల్లాచెదరైరి. అట్లు చెల్లాచెదరైన వారిలో ఒకగుంపు భారతదేశమునకు వచ్చినది. ఆ గుంపువారే ఆర్యులు. ఆర్యులు తెల్లనివారు. యూరపు వైపునకు తరలిన పసుపురంగు మంగోలులు అటనున్న తెల్లవారితో ఏకమయిరి. కాని సప్తసింధు సీమకు వచ్చిన ఆర్యులు మాత్రము దేశీయులయిన ద్రావిడులతో నల్లనివారితో ఏకము గాలేకపోయిరి. వీరు తమ తెలుపురంగు గొప్పదనమును నిలుపుకొనుటకు వ్రాసిన గ్రంథములే వేదములు. వేదములలో నల్లనివారు దూష్యులయిరి గదా! నానాడు ఆర్యులలో రెండు తెగ లేర్పడినవి. ఒకరు అతివాదులు. వీరే ఋషులు. ఈ ఋషులు ఆర్యరక్తము మిశ్రము గాకుండ చేయుటకు పూనుకొనిరి. రెండవ తెగవారు మితవాదులు. వీరు దేశీయులతో కూడిమాడ గలిగిరి. వీరే క్షత్రియులు.. వైశ్యులు. అతివాదులయిన బ్రాహ్మణులు క్షత్రియులను సమస్కంధులనుగా అంగీకరింపరైరి. వే ంగములు, ఉపనిషత్తులు క్షత్రియుల సిద్ధాంతముల నంగీకరింపక, తెలుపునాణెము కాపాడుకోదలచిన బ్రాహ్మణులచే వ్రాయబడినవి.

ఆర్యావర్తమున వ్యాపించిన కొలది బ్రాహ్మణుల పలుకుబడి సన్నగిల్లినది. క్షత్రియుల చెల్లుబడి పెరిగినది. రెండు కొలముల నడుమ రాయిడి యెక్కువయయినది. ఈ కథను తెలుపునవే పురాణములు. కొందరు బ్రాహ్మణులు క్షత్రియుల యెండజొచ్చి తన్మతము స్వీకరించిరి. అదియే శైవము. ఆర్యుల మతము, వైష్ణవము. తమకు తొత్తులై యుండిన శూద్రులను, క్షత్రియులను బ్రాహ్మణులు తమ మాట విని శైవ చక్రవర్తుల మీదికి పురికొల్పిరి. వారిని సింహాసనభ్రష్టులుగా చేసి వైష్ణవ చక్రవర్తులను గద్దెపై నిలిపిరి. లోకము కనులు కప్పుటకై బ్రాహ్మణులు కల్పించినదియే హరిహరనాథ తత్త్వము. ఈ బ్రాహ్మణులు దేనికయిన తెగించువారు. వారు పన్నిన పన్నాగములెన్నో కలవు.

ఇంతలో బౌద్ధమతము తలయెత్తినది. నలుపు తెలుపుపై చేసిన తిరుగుబాటే బౌద్ధమతమయినది. బౌద్ధమతము భారతదేశమంతట మహావేగముతో ప్రాకినది. కానిబౌద్ధమతము సైతము నానాడు దేశమును దోచినది. ప్రజలకు దానిపట్ల విసుగు కల్గినది. సందు చూచికొని బ్రాహ్మణులు ప్రజలను బౌద్ధమతము పైకి ఎసకొల్పిరి. తిరుగుబాటుదారులకు సాయము చేయుటకై, బ్రాహ్మణులు బాక్ట్రియనులను, పార్థియనులను హూణులను ఆహ్వానించిరి. మగధరాజ్యమును మంటగలిపిరి. తమకు సాయము చేసిన పరజాతులను రాజపుత్ర జాతిగా నిలిపిరి. ఆర్యావర్తమున ఈ రీతిగా ఆటాడిన తెల్లనిరంగు బ్రాహ్మణులు తుదకు దక్షిణాపథమంతట తమ యుచ్చులు పన్నిరి. ఇది బంగారయ్యగారి భారత దర్శనము.

ఇక వారి ఆంధ్రదర్శనమును అవలోకింతము గాక! మహారాష్ట్రులు తెలుగు మాటాడువారిని మానలు అనియుందురు. తెలుగువారు మహారాష్ట్ర దిశ నుండియే, యీ మాగాణమునకు వచ్చిరనియు, మానలే మొదటి తెలుగుజాతియనియు, ఈ జాతికి ఉత్తరముగా నుండిన తెలుగులు సిదపచేరి యీ జాతికంతటికి "తెలుగులు" అను పేరు ప్రసాదించిరనియు ఈ భాషాచరిత్ర పరిశోధకుని తీర్పు. మానలే నానాడు స—ల గా మారి మాలలని యయినది. ఈ మానశబ్దము నుండియే మన్నీడు, మన్నెదొరలు అనురూపము లేర్పడినవి. వృత్తిని బట్టి, అక్కలను బట్టి

ఈ మాలలు చాకలి, మాదిగ, కుమ్మరి, కమ్మరి మున్నగు కులములుగా రూపొందిరి. బలిజలు, కాపులు, కోమటులు వెలసిరి. ఆర్యావర్తము నుండి, తదితర ప్రాంతముల నుండి వచ్చినవారు రెడ్లు, కమ్మలు, వెలమలు నైరి. ఇతరజాతుల సంపర్కము గిట్టక పట్టక అతివాదులయినవారు, స్వసంస్కృతిని కాపాడుకొను చున్నవారు ఈనాటి మాలలుగా నిలిచిరి. బంగారయ్యగారి యొటుక ప్రకారము ఈనాటి మాలలే అచ్చమయిన తెలుగుజాతివారు. ఆర్యావర్తము నుండి వచ్చిన యార్యులు తెల్లనివారు బ్రాహ్మణులు. ఈ బ్రాహ్మణులు అంతకుముందేర్పడిన తెలుగుకులములు ఏకముగాకుండ తమ వర్ణవ్యవస్థను బిగించిరి. వీరి తంత్రమున ఏకము కాబోవు తెలుగుకులములు వేఱుపడినవి. నన్నయ తిక్కనాది కవులు వియంతలై యచ్చతెనుగుజాతివారి కథలు గానము చేయరైరి. అందుచేతనే బంగారయ్యగారి వంటివారు తమ సిద్ధాంతములకు వలయు సాక్ష్యములు లభింపక యింతగా నేలవిడిచి సాము చేయవలసిన యిక్కట్టు కలిగినది. ఈ గ్రంథకర్త చేసిన యీ పరిశీలనమును బట్టి తెలియువదొకటే! వారు ఈనాటి మాలలను ఆదిమజాతికి వారసులనుగా చిత్రించి, ఆకాశమున కెత్తిరి. బ్రాహ్మణ పిశాచము వారిని మొదటినుండి చివరిదాక పట్టిపల్లార్చుమనే యున్నది. ఇది వెనుకటి గాథ. మొదటి, నుండియు తెలుగువారికి ఉత్తరాదుల యొత్తిడి తప్పలేదు. ఈనాడు గూడ గుజరాతువారు, పాంచాలదేశీయులు, మార్వాడీలు, పార్శీలు, కాశ్మీరవాసులు గుంపులు గుంపులుగా వచ్చి, వర్తక వాణిజ్యములు చేసికొనుచు తెలుగునాటిని దోచుకొనుచు పీల్చి పిప్పి చేయుచున్నారు.

ఈ చారిత్రక పరిణామము వలన తెలుపు గెలిచినది. నలుపును నలిపివేసినది. ఆత్మవిశ్వాసము నశింపగా నలుపు తెలుపునకు బానిస యయినది. రామాయణము నెఱుగుదురు గదా! అది తెలుపునలుపుల నడిమి పోరు. భారతము, పురాణములు తెలుపు దౌర్జన్యమును చాటుచున్నవి. హనుమంతుడు, వాలి సుగ్రీవులు, ఘటోత్కచుడు, బలి, శూర్పణఖ, విశ్వాసుడు, మున్నగువారు ఆర్యుల సిద్ధాంతములకు వంచనలకు బలియైరి. ఏకపత్నీవ్రతము, పాతివ్రత్యము, సత్యవాక్పరిపాలనము మున్నగు ఆర్యసిద్ధాంతములకు తెలుగుజాతి బలియయినది. తెలుపుయొక్క ఇంద్రజాలము వలన నలుపు తననుతానీసడించుకొనుచున్నది. నలుపే నలుపును త్రొక్కివేయుచున్నది. ఆర్థికముగా, నైతికముగా, సాంఘికముగా నలుపు తెలుపు బాటలో నడచి నాశనమయినది. ఈనాడు కూడ అదే స్థితియున్నది. బజారులలో బట్టల కొట్టులలో, కార్యాలయములలో, ఫలాహారశాలలలో నలుపు పరాభవోపాలంభముల పాలగుచున్నది. మొదట బంగారయ్యగారు తెలుపును బ్రాహ్మణ పర్యాయపదముగా వాడిరి. తెలుపు, ఎఱుపు వేఱనిరి. ఇక్కడకు వచ్చునరికి వారు తెలుపు, ఎఱుపు పర్యాయపదములుగా వాడి గజిబిజి పాలయిరి. తెలుపు సర్వవర్ణముల యందలి ఎఱ్ఱనివారిని తెలియజేయుచున్నది. ఈ యెఱ్ఱని వారి మైకములోపడి నలుపే జాతీయవర్ణమగు తెలుగులోకము కొట్టుకొనుచున్నది. అసలన్ని కులములలో తెల్లనివారో, యెఱ్ఱనివారో యుండుటకు హేతువేమియో యీ సామాజిక శాస్త్రవేత్త చెప్పడు.

ఇంతదూరము వ్రాసి బంగారయ్యగారు వర్తమానకాలమునకు వచ్చిరి. నేడు తల్లిదండ్రులు తెలుపు (ఎరుపు) మత్తుతో ఆర్థికముగా నాశనమగుచున్నారు. నల్లని యాడుపిల్లలు పెండ్లికాక, యుద్యోగములు చేసికొనుచు, నవనాగరికతకు లోబడి తుదకు వేశ్యలగుచున్నారు. నల్లని కుఱ్ఱడు ఎఱ్ఱని పెండ్లము కొఱకు అఱ్ఱులు చాచును. చాచి చాచి యొక యెఱ్ఱని పెండ్లము మెడలో తాళికట్టును. అది వీని మెడ ఉరిత్రాడగును. తానా నల్లనివాడు! తన భార్య యెఱ్ఱనిది. ఆమె యెఱ్ఱని వాని వెంటబడునేమోయని వీని యనుమానము. తుదకు ఇల్లు నరకమగును. ఆ యెఱ్ఱని భార్య యెఱ్ఱని వారివెంటబడి శీలము చెడగొట్టుకొనును. నల్లని పడుచు ఎఱ్ఱని వానిని పెండ్లాడును. వాడు కట్నమున కాసపడి యీ నల్లదానిని పెండ్లియాడును. కాని యా యెఱ్ఱనివాడు ఎఱ్ఱని పడుచులను వెంటాడును. ఈ నల్లపడుచు క్రుంగి కృశించి పోయి వాడి త్త లగును. తల్లిదండ్రులు సైతము ఇరుగుపొరుగు వారి యెఱ్ఱబిడ్డను వంచినట్లుగా, తాము కన్న నల్లబిడ్డను ప్రేమింపరు. దుస్సాహసముతో, అవివేకముతో ఈ వ్రాతలు వ్రాసిన బంగారయ్యగారు ఏ కులములలో ఇట్లు జరుగుచున్నదో చెప్పరు. అన్నికులములలో ఇట్లు జరుగుచున్నదని వారి యభిప్రాయమా? వేశ్యలలో సైతము ఎఱ్ఱవేశ్యకు వచ్చెడి రాబడి నల్లవేశ్యకు రాదు!

గ్రంథాంతమునందు బంగారయ్యగారు ఈ దుస్థితిని నివారింపగా ఒక కొన్ని సూచనలు చేసిరి. ఆంధ్రదేశము యొక్క భౌగోళిక స్థితిని మార్చుటకు శక్యము గాదే! వర్షములు కురియించి యీ దేశమును అతిశీతల ప్రాంతముగా చేసి ఎల్లరను తెల్లనివారిగా చేయువీలులేదే! మఱి మార్గాంతరమేమి? నలుపును ఆంధ్రుల జాతీయ వర్ణముగా ఎంచినచో సర్వోపద్రవములు నివారితములగును. ఉత్తర హిందూస్థానము నుండి గుజరాతీయులు మున్నగు తెల్లనివారు తెలుగునాటికి వచ్చి దోచుకొనకుండ కట్టుదిట్టములు చేయవలె. వర్ణాంతర వివాహములు జరుగునట్లు శాసనములు చేయవలె. నల్లనివారికి రక్షణ చూపి కులములను రద్దుపఱుప వలయును. స్త్రీపురుషులు కలిసికట్టుగా తిరుగు నేర్పాటులు చేయవలె. నీతి కంటె సంఘమునకు జాతికి ప్రాధాన్యమీవలె. స్త్రీపురుషులు కూడి తిరుగుటకు వీలుగా బృందగానము, బృందనాట్యము పెంపొందింపవలె. ప్రాచీనాంధ్ర చరిత్రయంతయు తెలుపు నలుపునకు చేసిన దాడియని విద్యార్థులకు బోధింపవలె. ఇట్టి సూచనలతో బంగారయ్యగారు ఈ గ్రంథమునకు భరతవాక్యము పలికిరి.

ఈ గ్రంథము చరిత్రగాదు. మనస్తత్త్వశాస్త్రముగాదు. భాషాశాస్త్రముగాదు. సామాజిక శాస్త్రముగాదు. మఱియేమి? గ్రంథకర్త తన మనసునందంతట కులద్వేషము నించికొని, యాశాస్త్రములను తన దుష్టసిద్ధాంతముల కనుగుణముగా మలచుకొన్న రచనమిది. ఎవరి మీదనో కచ్చకొలది వ్రాసిన గ్రంథమిది. ఎవరి మీదనో యననేల? తెల్లని వారిమీద, ఎఱ్ఱని వారిమీద తనకున్న ద్వేషమునంతయు ఈ పుస్తకరూపములో వెళ్లగ్రక్కినాడీ రచయిత. ఆయా శాస్త్రములను క్షోదక్షమముగా పఠించి, వర్తమాన సంఘమును గాఢముగా పరిశీలించి,

ప్రామాణికములగు సాక్ష్యములను సేకరించి సముచిత సిద్ధాంతములు చేయుట ఉత్తమ రచయితల విధి. ఈ గ్రంథకర్తగారు ఆ జాతివారుగారు. మరి తన ద్వేషమయ చిత్తములో కొన్ని పురస్సిద్ధాంతములు చేసికొని, ఆ సిద్ధాంతములకు సాక్ష్యములను చరిత్రలో, సంఘములో వెదకుటకయి బంగారయ్యగారు పడరాని పాట్లు పడిరి. చరిత్రకు దుర్వ్యాఖ్యానము చేసిరి. వర్తమాన సంఘమును పాక్షికదృష్టితో పరిశీలించిరి. ఈ తప్పుడు వ్రాతల పాత్రమును తెలుగువారి మీద పడవేసిరి.

పాశ్చాత్యదేశ చరిత్ర పఠించి, తత్సాంఘిక సిద్ధాంతములను ఈ భారతదేశ చరిత్రకు అన్వయించుటకు కొందఱు ప్రయత్నించిరి. అమెరికాలో తెల్లవారు నల్లవారిని పురుగుల కంటె హీనముగా చూచిరి. అట యీనల్లనీగ్రోలను బాగుచేయుట కెందరో మహాత్ములు కృషి చేసిరి. చేయుచున్నారు. కాని అమెరికా దక్షిణరాష్ట్రములవారు ఇంకను ఏవో చిలుక పలుకులు వల్లించుచునే యున్నారు. బంగారయ్యగారు ఆ అమెరికా జాతివిచక్షణను యథాతథముగా ఈ దేశచరిత్ర కన్వయించిరి. అమెరికా నల్లకళ్ల జోడు దాల్చి చూచుటచే వారికీ దేశమంతయు నల్లగనే కన్పించినది. ఒకానొక యాంగ్ల దినపత్రిక నీగ్రోలను గూర్చి "నీగ్రో స్త్రీలలో పట్టణములలో నివసించువారిలో 22.9 శాతము భర్తృపరిత్యక్తలయినవారో, భర్తల నుండి విడిపడినవారో భర్తలకు విడాకు లిచ్చినవారోయై యున్నారు. శ్వేత స్త్రీలలో 7.9 శాతమునకే యీ దుర్గతి పట్టినది. నీగ్రో పిల్లలలో నాల్గవ వంతుమంది అధర్మ సంతానమై యున్నారు" అని వ్రాసెను. దీనిని తెలుగునాటి కన్వయించి బంగారయ్యగారు "ఇదే పరిమట్టుల నేడు తెలుగునాటిలో సాగుదల కలిగి ఉన్నాయి. పెళ్లి అయిన నల్లటి మగువలలో (ఎక్కువగా పట్టణాలలో) చాలామంది వేరు అయిపోతారు. విడిపోతారు. ఒదిలిపెట్టబడుతారు. చాలామంది నల్లటి మగువలు పెళ్లి కాకుండానే మొగుడు లేకుండానే బిడ్డలను కంటారు" అని వ్యాఖ్యానించిరి. ఏ జనాభా లెక్కలను బట్టి వారీ తీరుగా వ్రాసిరి? ఈ వ్రాతలను వేనిక్రింద జమ కట్టవలయును? ఏ కులములలో ఇట్లున్నది? వీనిని చదివి 'అయ్యో' అనువారు చాలమంది యుందురు. ఈ గ్రంథము ఆద్యంతము ఇట్టి యువ సిద్ధాంతమే యంతస్సూత్రముగా నున్నది.

బంగారయ్యగారి యెత్తుగడయే తప్పు. ఉష్ణమండలములో నివసించుట తిరోగమనమునకు లక్షణమయినచో, ప్రాచీనాంధ్ర జాతి మహానాగరకతను సాధించుటకు హేతువులేమి? ఈనాటి తెలుగువారి వెనుకబడిన తనమునకు చారిత్రక కారణములు గలవు. వానిని తెలిసికొనవలయునన్నచో బంగారయ్యగారు తాము ధరించిన నల్లకళ్ల జోడు తీసివేయవలయును. వారు దానిని తీసివేయరు. తీసివేసినచో ఇట్టి పుస్తకములు వ్రాయలేరు గదా? ఒకానొక నాడు శీతలమండలవాసులగు పాశ్చాత్యులు కన్ను దెఱువని కాలమునందు, ఉష్ణమండలవాసులగు భారతీయులు బృహత్సంస్కృతిని నెలకొల్పిరి. దీనికి వారు చెప్పు హేతువులేవి? ఈ నాటి యాసియాగాని, ఆఫ్రికాగాని వెనుకబడుటకు అక్షాంశ రేఖాంశ రేఖలు కారణములు గావు. మఱి చరిత్రయే కారణము. వారు వర్ణించినట్లుగా నేటి పల్లెపట్టులుగాని, నగరములుగాని అమెరికా దక్షిణరాష్ట్రముల వలె లేవు. ఈ గ్రంథమునందలి మొదటి భాగమంతయు గ్రంథకర్తగారి దోషమయమయిన పరిశీలమునకు తార్కాణము. బ్రాహ్మణులు తెలుగును ఈసడించినట్లు బంగారయ్యగారు వ్రాసిరి. వారు ఆంధ్రసాహిత్యమును సరిగా చదివియుండరు. తిక్కన, అన్నమాచార్యులు మారన మున్నగువారు బ్రాహ్మణులుగారా? మఱి బ్రాహ్మణేతరుడగు భట్టుమూర్తి కావ్యముల యందలి తెలుగు పలుకుబడి యెంత? భారతీయ సంస్కృతి పరిరక్షిత మగుటకు బ్రాహ్మణులు చేసిన సేవయెంతయో యున్నది. వీరు ఈ సత్యమును మఱచి గ్రంథమునందంతట బ్రాహ్మణ నింద చేసిరి. దీనివలన—సత్యమును కప్పిపుచ్చుటవలన—వీరి సంస్కారమేపాటిదో తెలియును.

బంగారయ్యగారు భారతదేశ చరిత్రను, ఆంధ్రదేశ చరిత్రను వ్యాఖ్యానించిన తీరు అప్రామాణికము. చెత్తనూర్పిడి. 'ఆంధ్రు'లను పూర్తిగా మరచిరి వీరు. ఐతరేయ బ్రాహ్మణ గాథ నెత్తరైరి. మఱి తెల్లవారు నాగజాతి కెంతయో ఋణపడి యున్నారు. వారు దానియూసైన ఎత్తలేదు. మహారాష్ట్రులు తెలుగువారిని మానలందురు గదా! ఆ మహారాష్ట్రభాషలో ఆమాట ఆ యర్థమునందు ఎన్నివందల యేండ్ల నుండి వాడబడుచున్నది? అది యిటీవలిది కాకూడదా యేమి? ఈనాడు ఆయా మండలములలో ఆయా కులముల వారెక్కువగా నున్నారు. ప్రాచీన కాలమునందు నైతమిట్లే యుండి యుండురనుటకు తార్కాణమేమి? భారత భూమిపై దండెత్తిన హూణులు మున్నగువారిని శ్వేతవర్ణాధిపత్యమును నిలబెట్టుకొన నిశ్చయించినవారు ఆహ్వానించిరనుటకు తార్కాణమేమి? తెలుగునాటికి వలసదీసిన వారు బంగారయ్యగారు చెప్పినట్లే చేసిరా?

ఈ గ్రంథకర్త పంచముల నుద్ధరించుటకు బయలు దేరిరా? సర్వవర్ణములలోనున్న నల్లనివారిని ఉద్ధరించుటకు పూనిరా? లోకము గుణకర్మలను బట్టి మనుష్యులను పొగడుటయో, తెగడుటయో చేయుచున్నది. కాని నల్లనివారిని మాత్రమే యీసడించుటలేదు. హైందవుల దేవతలు నీలమేఘశ్యాములు. ఋషులు కొందఱు కాలవర్ణులు. ఆయా వ్యక్తుల మానసిక దౌర్బల్యమును సంఘమునకు, జాతికి అంటగట్టుట తగదు. వీరు చెప్పినట్లుగా నల్లని మగవారిని చేసికొన్న యెఱ్ఱపడుచులు జారిణులగు చున్నారా? తల్లిదండ్రులు తమ నల్లని బిడ్డలను ప్రేమించక యుందురా? లోక వ్యవహారమునందు నల్లరంగు తిరస్కరింపబడుచున్నదా? నల్లపడుచులు సంఘబహిష్కృత లగుచున్నారా? బంగారయ్యగారిది యొక స్వప్నజగత్తు. నలుపు నారాయణునితో సమానమని ఈ గ్రంథకర్త దండయాత్ర చేసిన లోకమే యనుచున్నదే. రంగును బట్టి లోకమును, ఆ లోకము చరిత్రను సమీక్షింపబూనినచో వికృత సిద్ధాంతములు, హేయరాద్ధాంతములు సిద్ధించును. ఈ గ్రంథకర్త చేసిన కృషి నిష్ప్రయోజనకరమయినట్టిది. ఇట్టి పుస్తకములను వెలువరించుటకుమున్ను పాటికి పదిసారులు ఆలోచించుకొనుట లగ్గు.

గ్రంథకర్తగారు పైకి చెప్పరుగాని పంచములను దృష్టి యందుంచుకొనియే యీ గ్రంథము వ్రాసిరి. దానిని కప్పిపుచ్చు కొనుటకు "నలువు" గోత్రోద్ధారకులై నటించిరి. బ్రాహ్మణులు మాత్రమే పంచములను ద్వేషింపలేదు. ధర్మశాస్త్రముల ప్రకారము శూద్రులనబడువారు సైతము మాలలు మాదిగలు అనబడు వారిని ఒత్తివేసిరి. పల్లెలలో పంచములను నడివీధిని నడువనీనిది యెవరు? మోతుబరి రైతులు రచ్చబండపై కొలువుదీర్చి, యుండగా, గొడుగు వేసికొన్న మాలవాడు వారు చూచుచుండగా వెళ్లగలిగి నాడా? శూద్రులలో పేరుమోసిన పెద్ద కొలములవారు తమ బావి నీటికి మాలలను రానిచ్చిరా? ఒకానొకనాడు అగ్రహారము లందెంతగా అధర్మదేవత వికటతాండవము చేసినదో, అంతగా శూద్రవర్ణములు నిండిన గ్రామసీమలలో సైతము అస్పృశ్యత విశ్వరూపము అవధరించినది. మాలలను తమతోపాటు సమానముగా చూచిన బ్రాహ్మణులెందరో యున్నారు. బాపూజీ నాయంకరము పరిస్థితులను మార్చినది. భారత రాజ్యాంగము సకల వర్ణముల వారికి సమాన ప్రతిపత్తి నిచ్చుటయేగాక, హరిజనులకు గిరిజనులకు తదితర నిమ్నజాతులకు ప్రత్యేకాధికరణములను సృష్టించినది. ఈ పద్ధతి రానురాను రాజ్యాంగ మూలలక్ష్యమయిన వర్ణసమానతకే ప్రతిబంధకముగా పరిణమించినది. భారతోన్నత న్యాయస్థానము తీర్పులను బంగారయ్యగారు చూచి యుండరు. కులాభిమానము బ్రాహ్మణులలోనేగాక, శూద్రులలో పంచములలో కూడ ముదిరినది. ఈనాటి యాగడములకు కారణమెవరు?

నలువును కాపాడుటకై బంగారయ్యగారు చూపిన బాటలు నిస్సందేహముగా తిరస్కార్యములే. భారతదేశము (పాకిస్తాన్ విడిపోయినది) అఖండము. దీనినింకను ముక్కలుముక్కలు చేయనేల? గుజరాతువారిని, పంజాబువారిని తెలుగునాటికి రాకుండ నిషేధింపవలయునా? ఇతర రాష్ట్రములవారు తమ నడుమనున్న తెలుగువారిని తోలివేసిన నేమగును? ఒక్క మద్రాసు రాష్ట్రమునందు తెలుగువారెందరు లేరు? ఆర్యావర్తములోనున్న తెలుగు వారెందరు? భారతదేశమునందలి ఆయారాష్ట్రములు— బర్మా, సింహళము, పాకిస్థానము భారతీయులను, హైందవులను గెంటివేసినట్లుగా ఇతర రాష్ట్రముల వారిని పోద్రోల వలయునా? అట్లయినచో ఈ భారతదేశము చక్కలకుక్కల పాలు గాదా? ఈ నాడిట్టి సిద్ధాంతములు ఆదరణీయములా? తెలుపు నలుపును అణచి వేసినదేయని ఆక్రోశించు బంగారయ్యగారు, తెలుపు నలుపు పట్ల చూపిన యీసడింపును ఇతర రాష్ట్రముల వారిపట్ల చూపవలయునని అనుచున్నారు. ఒకచోట అధర్మమయినది మరొకచోట ధర్మమగునా? ఏదుర్గుణము లున్నవని మన మితరులను దూషించుచున్నామో, ఆ దుర్గుణము లనే మన మలవరచుకోనేల?

సంఘమునకు సంబంధించినంతవఱకు బ్రాహ్మణ ద్వేషము, భారతదేశమునకు సంబంధించినంతవరకు ఆర్యావర్త ద్వేషము బంగారయ్యగారి వ్రాతలకు మూలపదార్థములు. ఈ ద్వేష దర్పణముల సులోచనములను ధరించి వారు ఆంధ్రదేశమును, భారతదేశమును ఆలోకించుచున్నారు. మద్రాసురాష్ట్రమునందలి ద్రవిడమున్నేత్ర కజగము సిద్ధాంతములివి. ఇట్టి పిచ్చి వ్రాతల వలన, అంతకుపూర్వము ఒకవ్యక్తి యొక్క మెదడులో నున్న క్రుళ్లు వెల్లడియయి, సంఘమును మైలపఱచును. రచయిత చిత్తశుద్ధితో, ఆర్జవముతో, సముచితముతో గ్రంథరచనమునకు పూనుకోవలయును. ఈ లక్షణములు బంగారయ్యగారిలో కలికమునకయిన కానరావు. ఈనాడు నలువు చేసిన నేరమేమియు లేదు. తెలుగు నానుడి కూటమి వారి సొమ్మును మాత్రము దుబారా చేయుచున్నది.

—"శాక్యసింహ"

రాధామాధవము

["రాధామాధవం"—జయదేవుని 'గీతగోవింద' కృతికి అనువాదము : కర్త : అభినవజయదేవ కీ. శే. శ్రీ చల్లా పిచ్చయ్యశాస్త్రి, ప్రచురణ : కల్చరల్ బుక్ రైటర్స్ అండ్ పబ్లిషర్స్, గుంటూరు—2.]

అసలు భాషాంతరీకరణము కావ్యమునకు, గేయమునకు అవసరమా అన్నది చర్చనీయాంశము. మేలయిన వచన రచనలను తర్జుమా చేయుట కూడ సాహసమనే పలువురి అభిప్రాయము. కేవలము విషయమును విడమరచి చెప్పునట్టి పుస్తకములకు తర్జుమా ప్రయోజనపడవచ్చును. కావ్యములను ఒకభాష నుండి మరొక భాషలోనికి మార్చి మరొక కావ్యమును రచించు శక్తి అనన్యసామాన్యమయినది. రెండు భాషలందు గొప్ప పాండిత్యముండవలయును. ఇద్దరు కవులు 'సమానధర్మజ్ఞులు' అనదగినంత సన్నిహితదృక్పథము కల్గియుండిన వారుగా నుండవలయును. మూలములోని రసమును పరిపూర్ణముగా ఆస్వాదించి, జీర్ణించుకొని తన భాషలో అంతకంత రసవంతముగా ఆ స్థాయిని కొంచమైనను తగ్గనివ్వక తర్జుమా చేయగల్గిన భావుకత్వము, వాక్స్వాతంత్ర్యము గల కవిగా నుండవలయును. మూలమునందు తన హృదయాన్ని ఆత్మను లయింపచేసి పదేపదే ఆ కవితా మాధుర్యమును నెమరువేయునంత ఆసక్తి గల్గినపుడు, తనకు గల్గిన ఆ అప్రాకృతమయిన కావ్యజనిత ఆనందరసమును,

మూలగ్రంథమును చదివి గ్రహించు భాషా పరిచయములేని వారికి తమకు తెలిసిన భాషలో ఆ కావ్యరసాన్ని అందించు మహోపకారమును అనువదించు కవి చేయగలడు. మన కవిత్రయము ప్రసాదించిన భారతము, భక్త పోతన్న భాగవతము, ఋషిప్రోక్తములయిన మహాకావ్యములను సంస్కృత భాష తెలియని వారికని ఆంధ్రీకరించగా, నవపావన కావ్యములయినవి. తులసీదాసు రామాయణమూ, కంబరామాయణమూ వాల్మీకిరామాయణమును హిందీ, తమిళ భాషలలో అతి రమ్యముగా, ఉత్కృష్టముగ చెప్పబడినవి. కాని ఈ కావ్యముల మహిమ ఎంతయిన కానీ, అసలు వాల్మీకి రామాయణమును చదువుట ఇంకెందుకని అనిపించు ప్రమాదకరమయిన పరిణామమును కొంతవరకునూ చేకూర్చుట తప్పనిసరి. వాల్మీకి రామాయణ మిక మనకెందుకని వీటినే చదివి తృప్తి చెందుటను గురించి అనేకమంది రసజ్ఞులు బాధపడుచుందురు. కాని ఆ తర్జుమాలు చదివినవారు అల్పతృప్తులుగ నుండక మూలమునే చదివి ఇంకను అధికముగ రసమును ఆస్వాదించుటకు ప్రయత్నించుట శ్రేయస్కరము. తులసీదాసు, కంబమహాకవి అట్టి ప్రయోజనమునే అపేక్షించియుందురనుట నిస్సందేహము. కావ్యమును మరొక భాషలోనికి మార్చి కవనము చేసినప్పుడు ఆ భాషల స్వభావమును బట్టి మూలములోని అక్షర రమ్యతకు భిన్నమయిన పదశయ్యతో నుండుట తప్పదు. మూలములో లేని కొత్త రుచులిందులో అనేకములుండవచ్చును. ఏమయినను మూలమును చదివినట్లు కాజాలదు. అసలు ఆ భాషను తెలుసుకొను అవకాశము ఓర్పులేని వారికి ఈ తర్జుమాలు కల్పవృక్షములు. ఋషిప్రోక్తములయిన మహాప్రమేయములను ప్రజానీకములకు సులభముగ, అందముగా గొప్ప అంతస్థులో అందజేసిన ఈ జాతీయ కవుల సేవ సాటిలేనిది.

"రాధామాధవమ్" అను గ్రంథమును తెలుగున ఎంత చక్కగా, రమ్యముగా, వ్యాసు మధుర భావములతో తెలుగుసేత గావించిరన్న సంగతిని కవులే పొగడియున్నారు. పీఠికలో శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారిట్లు అభిప్రాయపడి యున్నారు. "ఒకానొక కవి సంస్కృతములో నున్న మఱియొక కవియొక్క రచనయందు అభిమానము గల్గి, ఆ కవిని తన భాషలోనికి మార్చవలయునని ప్రయత్నించినచో, నా యిద్దరు కవుల నడుమ కవితా గుణముల చేతనో జీవలక్షణము చేతనో సామ్యముండియుండవలయును..... ఏ కవిని భాషాంతరీకరించుచున్నాడో, ఆ కవియొక్క కవితాగుణములను పోలిన కవితా గుణములు తన భాషయందు తన కవితలో తనకుగల కవి జీవలక్షణముయొక్క యొుత్తిడి కలవాడన వలయును." ఇంకా— "శ్రీ పిచ్చయ్య శాస్త్రిగారు గ్రంథము యొక్క తొలుత జయదేవుని జీవిత కథను వ్రాసినారు. తరువాత నష్టపదులు, తత్సందర్భమునందలి పద్యములు తెలుగు చేయబడినవి. ఎచ్చట చూచినను సంస్కృతమునందు జయదేవుని మాధుర్యమునకు సరిపోవునేమో యన్న తెలుగు సేతయే గలదు." తమ పీఠికాంతమున ముచ్చటగా తెలుగు సేతను పొగడుతూ పద్యమల్లినారు.

"అభినవ జయదేవుండని
సభలనుతింపగ యశము సకలాశల దా
నభయ జగ దభినుతమ్ముగ
ప్రభావితుడు పొందె యోగ్యపద్ధతి గాగన్"

మధ్వ శ్రీ కాశీ కృష్ణాచార్యులుగారు కూడ ఆ తెలుగు సేతను సెబాసని పద్యమున పొగడుచూ

"శ్రీ జయదేవ వాగమృతసేవల,
మేత్రవపుష్టినొంది, క్రొం జాజుల
సొంపువింపు వెదజల్లుచు నెంతయు
వీడు పద్దెముల్— రాజిలు చుండు"

నన్నారు. కవులకే గురువర్యులయి వెలసిన శ్రీ వెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రిగారు ప్రశంసించుచూ, "ఇట్టి మహనీయుని (జయదేవుని) గేయములను తెలుగులో గేయములుగానే మృదువైన భాషలో ననువదించిన చల్లా పిచ్చయశాస్త్రిగారిని అభినవ జయదేవుడని మన యాంధ్ర కవి శేఖరులు గౌరవింతురని నా నిశ్చయము. గానమునకు సంస్కృత భాషకన్న నాంధ్రభాషయే యెక్కువ సౌష్టవము గలిగించుననుట సర్వకవి సమ్మతమయినను జయదేవకవి వాడిన సంస్కృతము తెనుగుకన్నను మిక్కిలి మృదువుగా నున్నది. ఆ యీ మర్మము ననువాదమునెడల గ్రంథకర్త గమనించినట్లు విజ్ఞులు కనిపెట్టగలరు."

ఈ కవివర్యుల ప్రశంసనందుకొన్న తెలుగు సేతను వేరుగా పొగడుట అనవసరము. ఈ పుస్తకము కొన భాగమునందు రెండు పరిశీలనాత్మకమయిన వ్యాసములు గమనించ తగినవి— శ్రీ ఆవుల గోపాల కృష్ణమూర్తిగారి 'ఆంధ్రపత్రిక వ్యాసభాగం', శ్రీ అంబటిపూడి వెంకటరత్నంగారి వ్యాసం— రాధామాధవము నందు లభించిన 'తెనుగునుడుల ఆల్లికను' గురించి ఇట్లన్నారు— "గీర్వాణ భాషను పుటము బెట్టి మెత్తందనము గూర్చి పోతపోసినాడు జయదేవుడు. తెనుగు వెన్నతో గీర్వాణపుటమ్మున విగ్రహము గూర్చినారు శ్రీ శాస్త్రిగారు. శ్రవణ మాధుర్యము వచ్చినది. అన్వయ సౌలభ్యమబ్బినది, జాతీయముల అందము శోభం గూర్చినది.... ఇంతయైనను మూలానుసరణ మెంత విధేయత గలది."

రాధామాధవ కావ్యమును చదివినవారు వెనువెంటనే ఎప్పటికప్పుడు శ్రీ జయదేవుని కావ్యములోని పద్యములను అష్టపదులను కూడ చదువుకొనుటకు వీలుగా పుస్తకమును అచ్చొత్తించియుండుట శ్లాఘ్యనీయము. ఎడమవుటలో మూలము, కుడిపుటలో తర్జుమాలు కూర్చబడినవి. మూలమును మరువనివ్వని అమరికగల యీ కూర్పు మెచ్చుకోదగినది. గ్రంథ ఆరంభమునందు శ్రీ జయదేవ చరిత్రను కావ్యరూపముగా రచించియున్నారు. కవికిగల సంగీతరసానుభూతి పొంగిపొరలి సప్తస్వరప్రకృతి అన్న పద్యమాలగా రూపొందినది. అరుస్వరము లను పుట్టించుచూ ఆ ధ్వనినంతయూ తన యందు యిమిడ్చుకొన్న ఓంకారమునుపోలు షడ్జమును పొగడి తమ రసాస్వాదన పటిమను చాటియున్నారు.

రాధామాధవమును కేవల మొక కావ్యపు తెలుగుసేతగా ఎంచిన పరిశీలనను కవుల మన్ననలకు వదలవచ్చును. కావ్యముల తర్జుమా సమస్యవేరు, గేయముల తర్జుమా సమస్యలు—వేరు. జయదేవుని గీతగోవింద కావ్యమునందే ఈ రెండు భాగములు కలసి యున్నవి— శ్లోకములు; అష్టపదులు అనబడు గేయ రచనలు— పాటలు. అర్థపుష్టికి, భావమునకు ముఖ్యమయినవి పద్యములు. అక్షర రమ్యత, ఉచ్చారణా సౌలభ్యములు గల సరళమయిన అల్లిక, పాడుటకు అనువయిన ఛందస్సు— లేక తాళములకు సరిగా తెగు విరుపులుగల మాటలు— చాల అవసరము పాటలకు. అర్థపుష్టికి రెండవస్థానమే. సంగీత ప్రధానమయిన రచనలను కూడ తర్జుమా చేయుట సబబేనా అన్నది మరొక సమస్య. సంగీత ప్రధానముగు త్యాగయ్య కీర్తనలను నాదకావ్యముగా ఆస్వాదించిన చాలదనుకొనువారు ఆ కీర్తనల సాహిత్యము కూడ తెలిసిన భాషలో మార్చిన— ఆ సంగీతరచనలోని విశేషమును పరిపూర్ణముగ గ్రహించుటకు అవకాశ మేర్పడునని వారి ఆశయము. 'శాంతములేక సౌఖ్యము లేదు' అను సామరాగకీర్తనకు "శాంతమిల్లామే సౌఖ్యమిల్లై" అనియూ, "నిన్ను జూచి ధన్యుడైతిని" అనుటకు మారుగా "నిన్న నోడి ధన్యవాదెనో" అనియూ పాడుట సరియని కొంత అపోహపడిన రోజులున్నవి. ద్రావిడ భాషలు అక్కచెల్లెండ్రు; ఇక కర్ణాటక రాగములకు గమకములకు సరిపోవు ద్రావిడ భాషల నుడికారమునకు మారుగా— త్యాగయ్య కీర్తనలకు హిందీ అనువాదములు, కొన్ని జావళీలకు, పదాలకూ హిందీ అనువాదములు ఆలిండియా రేడియో ప్రేరేపణతో కొంతసాగినది. సంగీత ప్రధానముగు రచనలందుకూడ వాటియందుగల సాహిత్య సంగీతముల పొందికను ఇతరులకు నచ్చచెప్పుటకని వారికి అర్థమగు భాషలో ఆ పాటల సాహిత్యమును తర్జుమాచేసి, మూలగేయముల సంగీతమట్టును కొంచముకూడ చెక్కుచెదరనివ్వక— మార్పక— మంచి నేర్పరుతతో పాటల తర్జుమాలను కొనసాగించి యున్నారు. ఇట్టి ప్రయత్నమును రవీంద్రసంగీత్ అను బెంగాలీ గేయములను అవే వర్ణమట్లకు (Tunes) సప్పునట్లు ఆ సాహిత్యములను ద్రావిడ భాషలలో మార్పించి వినిపించిరి. ఇది చాల అతిశయమయిన, ఓర్పును పరిశోధించు ప్రయత్నమే. బెంగాలీ కవి హృదయమును తెలుపు ఈ గేయముల ద్రావిడ రూపాంతరములు, కేవల మాగాన మాధుర్యమును ఆస్వాదించువారికి కొంత ఇబ్బంది కల్గించక పోవు. మాట— దానికై అమరిన పాట— దేహము ఆత్మవలె అవినాభావము గల్గియున్నవే నిజమయిన ఆనందము చేకూర్చును. పాశ్చాత్యదేశములందుకూడ ఇట్టి గేయరచనల తర్జుమాలు జరిగినవి. లాటిన్, జర్మన్ భాషలలోని పాటలను ఇంగ్లీషులోకి తర్జుమాలు చేసియున్నారు. సంగీతమునకు ఏంతమాత్రమూ భంగము రానివ్వక అతి సూక్ష్మనాద దృష్టితో ఈ ఇంగ్లీషు సేతలు తయారయినవి. మోజార్టు రచించిన Opera అనబడు గేయ నాటకములు, ఇటాలియన్ ఆపరాలకు— సంగీతమును అట్లే యుంచి— ఇంగ్లీషులోకి మార్చుకున్నారు. కాని ఆ ప్రయత్నము సర్వసమ్మతము కాలేదు. సంగీత సాహిత్యములకున్న అవినాభావమును గుర్తించిన వారికి, భాష మార్పుతో సంగీతపు సూక్ష్మమయిన ఇంపులు సొంపులు గల 'ఆను' మారుటను అంగీకరింపజాలకున్నారు. కాని ఇటీవల క్రైస్తవ మత జగద్గురువులు ఘనమైన Pope గారి అనుమతితో క్రైస్తవాలయాలలో Mass అనబడు గోష్ఠిగానపు ప్రార్థనాగేయములను లాటిన్ నుండి ఇంగ్లీష్ భాషలోకి మార్చినారు. పాటతీరు— మట్టు మారలేదు. మునుపటి లాటిన్ 'మాసు' గీతాలు విన్నవారికీ ఇంగ్లీష్ రూపాంతరాలు కొంత చురుక్కుమనిపించుచున్నవి. కాని ఇంగ్లీష్ పాటనే విన్నవారికి ఆ పాట హాయిగానే వుండునట. హృదయపూర్వకముగ పాడుట కదా ప్రార్థన! అట్టి పాటలను అర్థము తెలుసుకొని పాడుట అవసరమని ఇట్టి తర్జుమాకు Pope మహాశయులే ఒప్పిరి. ఇది పాశ్చాత్యదేశమునందు జరిగిన ప్రయత్నము.

ఇక మనదేశమునందున్న గేయముల విషయములను పరిశీలింతము. సంగీత ప్రధానముగు రచనలను వీలయినంత వరకు తర్జుమా చేయకుండుటయే మేలు. ఒకవేళ అట్టి గేయముల భావము బోధపడుటకు సాహిత్యమును వేరు భాషలలో మూలమునకు సాధ్యమయినంత చేరువగా, సంగీతము మారకుండునట్లు తర్జుమా చేసుకోవచ్చును. ఇది రెండవపక్షమే. కాని సంగీత మెన్నడో నశించి కేవలము సాహిత్య రచనలుగా దక్కియున్న అష్టపదులలోని ముఖ్యమయిన సొత్తు ఆ అక్షర రమ్యత, ఆ మాటలకూర్పు, ఆ సరస మధుర వాక్కులలోని నాదపుసొంపు, ఇట్టి గేయముల తెలుగింత అవసరము— అని నా నమ్మకము. పురందరదాసుల పదాలు, అన్నమయ్య రచనలు, తిరుప్పుగళ్ లాంటి రచనలను గేయముగా తర్జుమా చేయుట ఫలమురాని వ్యవసాయము వంటిది. వాటికి ప్రతిపదార్థము చాలు. రాధామాధవములోని అష్టపదులు కొన్ని పాడటకనువుగా లేవు. మొదటి రెండు అష్టపదులు యథాతథంగానే యున్నవి. హరి విహరించె వసంతమున్ 3 వ అష్టపది పాడుటకు వీలవున్నది. కాని మాటలు బరువయినవి. అచ్చటచ్చట సంయుక్తాక్షరములు బరువయినవి. కేవలము సాహిత్య ప్రాధాన్యములయిన గేయములు తర్జుమాలకు తావివ్వవు. కాని సాధ్యమయినంతలో ఈ రాధామాధవమ్ తెలుగింత గొప్పశ్రేణినే అందుకొన్నది.

—సంధ్యావందనం శ్రీనివాసరావు.

కర్పూరమంజరి

[రచయిత: కీ. శే. చిలకమర్తి లక్ష్మీనరసింహము పంతులుగారు, ప్రచురణ: వెలగల వీరారెడ్డి, కాలచక్రం ప్రచురణలు, సత్రారామేశ్వరము (వయా) పెనుమంట్ర—పశ్చిమ గోదావరి 1, 2, భాగములు పేజీలు 606, వెల 10 రూ.]

మనభాషలో నవలకింకా పట్టుమని శతాబ్దమైనా నిండలేదు. శిల్పపరిణతిలో అది శిఖరాగ్రాన్ని చేరుతున్నది. సామాన్యుడు మాన్యుడౌతున్నాడు. జీవిత సమస్య అన్నికోణాలనుంచీ చిత్రింపబడుతున్నాయి. ఐనా అవి పరిణతి పొందని అసమగ్ర చిత్రాలవు

తున్నాయి. ప్రేమ కథలకూ 'సర్వేజనాస్సుఖినోభవంతు' అని చెప్పే నవలలకూ కాలదోషం పడుతున్నది. "అనగా అనగా"..అని చెప్పి ప్రారంభమయి, దుష్టశిక్షణ, శిష్టరక్షణలతో ముగించే నవలలిప్పుడు వింతగా మ్యూజియమ్ వస్తువులుగా కన్పిస్తున్నాయి. గ్రాంథికాంధ్ర రచన వెగటౌతున్నది. మరి వీటన్నిటినీ అధిగమించి సంప్రదాయికమైన శిల్పంతో, 'కాదంబరి'ని తలపించే నవల 'కర్పూరమంజరి.'

ఆంధ్ర మహాపురుషులలో వీరేశలింగం పంతులు వారివలె కీ. శే. చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులుగారును ప్రథమాంధ్ర నవలా రచయితలుగా స్మరణీయులు. విశ్వజనీనమైన భావాలతో చిలకమర్తి వారు సౌందర్య తిలక, కర్పూరమంజరి, గణపతి మొదలైన ఉత్తమ నవలలు రచించారు. నాటక రచనలోను శ్రీ చిలకమర్తి సిద్ధహస్తులై గయోపాఖ్యానం రచించి ఇంటింటా పఠనీయ గ్రంథం చేశారు. అంధత్వం ప్రాప్తించినా వారి మేధ మొద్దుబారలేదు. అంధత్వం ప్రాప్తించింది వారి కన్నులకేగాని క్రాంతదర్శియైన ఆయన వాక్కుకు కాదు. గనిలో నుండి తీసిన వజ్రాలకు వలెనే 'నవ్వులగనిలో' నుండి నాజూకు నాణాలు వెలార్చి వజ్రాల వెలుగులు ప్రసరించేరు. కర్పూరమంజరి అనేది ఆయన నవల పేరేగాదు నాయికా నామం కూడ. నవల అంటే స్త్రీ అనే గదా అర్థం. కావ్యం కాంతాసమ్మితంగా ఉండాలన్నారు గదూ! 'కర్పూరమంజరి' లక్షణంగా 'నవల.' ఆమె రూపురేఖలతో బాటు గుణగణాలూ కర్పూరశలాకలే.ఆమె అచ్చు పచ్చకర్పూరపు బొమ్మ. ఆ బొమ్మకు జీవం పోశారు. జీవం ఉట్టిపడుతున్న 'కర్పూరమంజరి' మన సాహిత్య సౌధపు ముఖద్వారంలో కన్పిస్తున్న రమణీయ సాహితీ శిల్పం.

నవలంతా ప్రత్యక్ష రామాయణ కథనంలోనే నడుస్తుంది. పెక్కునవలలు చదివిన యీ నాటి పాఠకుల కిది శిల్పం దృష్ట్యా గొప్పదేమీకాదు. చవులూరించే వాడుకభాషలో నవలలు చదవటం అలవడిన వారికీనవల వారికేళపాకమే. రచనలో సారళ్యం తక్కువేమీ కాదు. కొఱకుడుపడని శుష్కగ్రాంథిక మేమీకాదు. పైపెచ్చు హాయిలొలికించే రచన. శ్రీ చిన్నయసూరి 'నీతిచంద్రిక' తో పోల్చదగిన వచన రచన యిది. 'కాదంబరి' వంటి వచనరచనలు లేని లోటును శ్రీ చిలకమర్తి వంటి కొందఱు రచయితలు కొంతవఱకు మాత్రమే తీర్చగలిగారు.

కర్పూరమంజరి కథావస్తువులోను, ఆదిమధ్యాంతాల లోని తీర్పులోను, రచనాశిల్పంలోనూ, మఱపురాని పాత్ర చిత్రణలోనూ మిన్నయైనదా అంటే అదేమీ కాదు.కాని పైవన్నీ ఉన్న ఉత్తమ నవల. తెలుగు నవల తప్పటడుగులు వేస్తున్నప్పుడే యింతటి ఉత్తమ రచన వెలువడటం గమనార్హం. స్వకపోలకల్పితమైన యితివృత్తంతో జిగి చెడకుండ బిగి సడలకుండ నిర్వహించి నవలారచనలో ఆయన విశిష్టతను ప్రదర్శించారు.

కాశీమజిలీకథల రచనకూ, ఈ నవలారచనకూ ఎన్నో పోలికలున్నాయి. ఐతే మాంత్రికులూ, మాయాజాలాలూ ఈ నవలలో కన్పించవు. మత వైషమ్యాల కారణంగా ప్రాచీన భారతంలో ఎన్నెన్ని ఘోరాలు జరిగిందీ వర్ణించబడింది. అహింసనూ,జీవకారుణ్యాన్ని బోధించే బౌద్ధమతావలంబకుడైన రాజును తిరస్కరించి పరాభవింపబడిన మంత్రి ఎన్నెన్ని ఘోరాలు చేసిందీ వివరించేరు. కథకు ముఖ్యమైన కర్పూరమంజరీవృత్తాంతం ప్రథమభాగంలో నత్త నడక నడుస్తుంది. ప్రథమ భాగమంతా సకల సద్గుణ సంపన్నుడైన హేమచంద్రుడను మహారాజు, రాజద్రోహ నేరంతో సహోదరునే దేశబహిష్కరణ గావించటమూ, అతడు మరింత దుష్టుడై కుట్రలూ, కుతంత్రాలూ, మాయోపాయాలూ, మోసాలతో రాజ నంతమొందించి, రాకుమారులను తుదముట్టింపనెంచి, మహారాణిని చెఱయందుంచి, మహామంత్రిని దేశద్రోహిగా చిత్రించి కుత్సితాలకు సాటిలేని మేటిగా మెలగి దుర్మరణం పాలవుతాడు. ఇతడి పేరు చిత్రభానుడు. వీని కూతురే కర్పూరమంజరి.

చిత్రభానుఁడు జానపద కథలూ, చిత్రాలలోని దుష్టపాత్రలను జ్ఞప్తికి తెస్తాడు గాని, ఆయా దుష్టపాత్ర రచనలన్నింటికీ చిలకమర్తి వారివంటి రచయితలు మార్గదర్శకులని మరువకూడదు. చిత్రభానుఁడు దుర్మార్గుడైనా జన్మస్థాన వియోగ సమయంలో అతడు పడిన బాధంతా స్వభావోక్తిమయమే. ఈ విధంగా దుష్టపాత్రలో మంచి విషయములను పలికించి, పరిస్థితులే వానిని దుర్మార్గుని చేశాయని భావింప చేశారు. అంతేగాక పరాయిపాలనలో క్రుంగ్గుచున్న దేశపుదీనస్థితి శ్రీ చిలకమర్తి వారిచే అన్యాపదేశంగా యిట్టి పల్కులను పల్కించింది. రాజతిరస్కారము వలన పరాభవింపబడిన అమాత్యుడు హరిశర్మ రాజులను గూర్చి "రాజులు విశ్వసనీయులుగారు. వారితో గూటములు పాములతోఁ జెలగాటములు. వారి పోరాటములు కత్తుల మీద సాములు. వారి నెయ్యములు పులులతోడి వియ్యములు. వారి యనుగ్రహంబులు నీటిబుగ్గ వోలె క్షణవినశ్వరంబులు. వారి యాగ్రహంబులు చిరస్థాయికంబుల. వారిచ్చు సంపదలు మెఱపు తీగలట్లు చంచలంబులు. వారొనరించు నపకారంబులు శాశ్వతంబులు" అని పల్కుట గమనింపదగినది. చిలకమర్తి వారి వచన రచనా శైలి కిది చక్కని నిదర్శనము.

ఒకే భావాన్ని చెప్పటానికి పదేసి వాక్యాలు రచించే శైలి పానుగంటి వారిలో ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. చిలకమర్తి వారి నవలలోనూ, ఎక్కడనా యిది గోచరిస్తుంది. తెలుఁగు భాషలోని కమ్మని నానుడులూ, జాతీయాలూ, సొగసైన సామెత లెన్నింటినో యీ నవలలో జొప్పించి మంచి వచనాశిల్పనాజూకు తనాన్ని సంతరించుకున్నారు. నవలలోని పాత్రలన్నింటికీ స్వభావానుగుణంగానే పేర్లు పెట్టారు. కర్పూరమంజరి, ఆమె, ప్రియుడు మకరందుడు, వారి యనుఁగు చెలికత్తె మల్లిక, చెలికాడు భద్రసేనుడూ అందరూ సార్థక నామధేయులే. హేమచంద్ర చిత్రభాను లిరువురూ సాధు తీక్ష్ణప్రవర్తనలు గలవారే.

చిత్రభానుడు దుష్టబుద్ధియైనా అతడి కుమార్తె సుగుణవతి. అతడి మాయోపాయాలకూ, రాజకీయ కుతంత్రా

లకూ, ఆమె లొంగక తనకన్ని విధముల తగిన వరుని మకరందుని ఎంచుకొని మతాంతర వివాహానికి దారితీస్తుంది. నవల ముగింపుకు దుష్టశిక్షణ, శిష్టరక్షణ జరుగుతుంది. ఎవడు రాజో వాని ననుసరించి ధర్మము నడచుట; రాజను పరిమార్చి శత్రువు రాజైనప్పుడు వాని నాశ్రయించిన పరివారము శత్రువును గొల్చుటయే ధర్మమనియు, శత్రువు కెగ్గు సేయుట రాజద్రోహమనియు పల్కిన చిత్రభానుని పల్కులలో కుటిల రాజనీతిజ్ఞత వెల్లివిరుస్తుంది. అదే విధముగా పాపకార్యానికి ప్రోత్సహిస్తూ గూడ భగవానుని గీతోపదేశాన్ని విన్పించిన హరిశర్మ పలుకులలో స్వార్థపరుడు స్వార్థప్రయోజనానికి ధర్మాన్ని వక్రమార్గం పట్టించటం తెలుస్తుంది.

విజ్ఞాన కోశం వంటి యీ నవల ప్రతివిద్యార్థీ చదవటం ఎంతేనా అవసరం. చక్కని వచనరచన చవి తెలియాలన్నా, నీతులు నేర్వాలన్నా యీ నవల చదవాలి. గ్రాంథికాంధ్రాన్ని ఎందుకు ద్వేషించకూడదో, సమర్థుడైన రచయిత గ్రాంథిక భాషను సైతం వాడుకభాషకు సన్నిహితంగా జీవం ఉట్టిపడేలా ఏవిధంగా వ్రాస్తాడో అవగాహన అవుతుంది. సంప్రదాయం తెలియాలన్నా కొత్తదనం కోసం అర్రులు జాచటంతోనే కాలాన్ని వినియోగించక సంప్రదాయంలోని మాధుర్యం తెలిసి, దానిని మననం చేసికొని విజ్ఞానంతో బాటు ఆనందాన్ని పొందాలంటే పాఠకులందరూ దీనిని చదవాలి. ఆంధ్ర మహాపురుషుడు చిలకమర్తి రచనలను ప్రచురించి భాషాభిరుచి కలిగించి సంప్రదాయమంటే మక్కువ కలిగేటందుకు పాటుబడుతున్న 'కాలచక్రం' ప్రచురణల వారభినందనీయులు.

నాగొడవ-4-పరాభవ వర్షం

(రచయిత: శ్రీ కాళోజీ నారాయణరావు; ప్రచురణ: కాళోజీ నారాయణరావు, నక్కలగుట్ట, హనుమకొండ, వరంగల్; 62 పేజీలు, మూల్యం: అమూల్యం-పాఠకులు అందించే మొత్తం ముందు ప్రచురణలకై వినియోగింపబడును.)

ఒకనాటి కాళోజీ గొడవ ఆంధ్రులందరి గొడవ. వారి 'గొడవ'ను కొనసాగిస్తూ ఋతువు ఋతువునా వారి గొంతుక నుండి కొత్తపాటలు వినిపిస్తున్నారు. ఆ పాటలన్నీ ప్రజల యిక్కట్లకు ప్రతిధ్వనులే. అందరూ అనుకునేవే కాళోజీ కంఠం నుండి కొత్త జీవాన్ని సంతరించుకొని వస్తున్నాయి. కవిత్వానికి వలసిన ధ్వని, రీతి, వక్రోక్తి, అలంకారాదు లేవీ వీరు లక్ష్యంగా కొనసాగిస్తున్నట్లు లేదు. అక్కడక్కడ అన్యాపదేశంగా సమకాలీన సంఘం పైన, పరిపాలకుల పైనా విసుర్లు విన్పిస్తాయి. ఉపమాసామగ్రి పుష్కలంగా ఉన్నా ఛందోలంకారాల కొరగని రచన యిది.

"కైతకు లక్షణాలున్నాయి కోటొక్కటి,
అందులో వ్యాకరణం గూడ ఒక్కటి
వ్యాకరణం కవితకు పరమావధికాదు
అసలే లేదు" అని సరస్వతీ భక్తుల నుద్దేశించి అవహేళనగా పలికారు. కవిత్వానికి ప్రాణభూతమైన వ్యంగ్యం వీరి కవితల్లో స్ఫుటంగా ఉండదు. కావ్యం ఉపన్యాస ధోరణిలో సాగుతుంది. "ఛందస్ బందస్ ఫటాల్ ఫటాల్" మనిపించిన అభ్యుదయ కవితోద్యమం కవిత్వపు గీతి మాధుర్యాన్ని కొంతవరకు తగ్గించి వేసిందని చెప్పవచ్చు. కవిత్వాన్ని వివాదరూపంలో, సంఘసంస్కారపు పనిముట్టుగా ఉపయోగించారు కాళోజీ. సంఘశ్రేయస్సు నాకాంక్షించే వీరి చిత్తశుద్ధిని శంకించ పనిలేదు కాని కవిత్వం రసానందాన్ని కలిగించటం కంటె, ప్రబోధించి కర్తవ్యనిష్ఠులను చెయ్యటం ఆవశ్యకంగా కవి భావించినట్లు కన్పిస్తున్నది. కాబట్టి వీరి కవిత్వంలో విశ్వజనీనత లోపిస్తుందని చెప్పకతప్పదు.. రాష్ట్రోద్యమం, సహాయ నిరాకరణోద్యమం వంటి సమస్యలతో పరితపిస్తూ కైతలల్లిన కవులు కలకాలం మాన్యులుగా నిలిచారు. లోకవృత్త పరిశీలనంతో వ్యుత్పన్నుడైన కవి ప్రతిభతో ఆయా సమస్యల నవగాహన చేసికొని సమాధ్యవస్థతో వారి కావ్యాలను రచించారు. కాని కాళోజీ కేవలమూ క్షణికావేశమనదగిన భావనతో గీతాలు వ్రాశారు. వాటిని గుదిగుచ్చి 'నా గొడవ'ను కొనసాగిస్తున్నారు. మచ్చుకు ఈ కావ్య సంపుటిలోని 'అధికార రాజకీయాలు'; 'పంచశీలం'; 'దొంగగొడ్డు—గంగిరెద్దు' ఇట్టివే. 'మళ్లీ విప్లవం రావాలె' అన్నది రాజకీయ సభావేదికపై నుండి చెప్తున్న ఉపన్యాసం. "అమ్మయ్యో! అభ్యుదయం!!" "బేషజ జాతలు" మొదలైనవి సమాజంలోని వక్రమార్గపు నాగరికత నేవగించ కుంటున్న నైరాశ్యపు పలుకులు.

ఋతుధర్మాన్ని అనుసరించి కవితలు వెలువరించినట్లే ఋతుధర్మాన్ని బట్టే కవిత్వ స్వరూపాన్ని మార్చుకోక తప్పదేమో! దీపావళికి, సంక్రాంతికి, ఉగాదికీ పద్యాలు వ్రాసే వాళ్లవలె కాకపోయినా, ప్రజాసమస్యల పరిష్కారానికే కవితను పనిముట్టుగా ఉపయోగిస్తున్న కాళోజీని 'Seasonal Poet' అనవచ్చునేమో!

ఈ కావ్య సంపుటిలో 'ఓ బాపూ';— కొత్త నడక;— 'తమ్ముడూ' అనే గేయాలు గొప్పవిగా చెప్పుకోదగ్గవి. 'ఓ బాపూ' అనే ఖండికలో మహాత్ముని మాటగా ప్రశ్నిస్తున్నట్లు, ఆయన అనుయాయుల వక్రమార్గాన్ని నేర్పుతో వర్ణించారు, కాళోజీ మరో గేయంలో

"ఖ్యాతిమాన గాంధీ ధృత
శ్వేతాంబర ధారీ!

సామ్యవాద రామచిలుక '' అని గాంధీ భక్తులపై అవహాస్యాన్ని విసిరారు. 'కొత్తనడక' గేయంలో చదరంగపుటాటకు కూర్చున్న నవీనుడు రాజుకు బదులు 'గాడిద'ను పావుగా వాడతాడు. 'షా' చెప్పదలచుకున్న ప్రత్యర్థి రాజునుగాక గాడిదను చెప్పి తెల్లబోతాడు. ప్రజాస్వామ్యంలోని రాచరికాన్ని దెప్పి పొడిచారు. 'తమ్ముడూ' అనే గేయం కీ. శే. బాలగంగాధరతిలక్ స్మృత్యర్థం వ్రాసిన హృదయవిదారకమైన విలాపం. పరిశీలిస్తే 'తిలక్' 'కాళోజీ'లలో కొన్ని సామ్యాలు కన్పిస్తాయి. ఇరువురి వాక్కులలోను చేవ ఉన్నది. ప్రజలంటే ప్రగాఢమైన అభిమానం ఉన్నది. భావించగలిగిన గాఢమైన దృక్పథం ఉన్నది. కాళోజీలో భావనాసమాధి క్రమంగా సన్నగిల్లిపోతున్నదనిపిస్తున్నది. ప్రచురణ కర్తల నయువంచనకు లొంగని వ్యక్తిత్వం ఇరువురిలోనూ చెప్పుకోదగిన సామ్యం.

"ప్రచురణకర్తలా?
మీకు లొంగని వీరుడు నేల కొరిగినాడు
మీ చుట్టూ దేవులాడే దేబెలు మిగిలినారు
మీ ఇష్టం వచ్చిన బేరానికి
కొనెయ్యండి కలాల కులాలను
మడుల పడుచుతవాలను

గుడ్డిగవ్వకు వేలం పాడెయ్యండి'' అని ఋషి వాక్కుతో శపించారు.

అభ్యుదయ కవిత్వ గమనంలో కాళోజీ నడక ప్రత్యేకమైంది. కవిత్వంలో ప్రత్యేకత, విచిత్రత సౌందర్యమనిపించుకోవు గదా! సౌందర్యం లోపించిన కళ మబ్బు చాటు చందమామ. అభ్యుదయ కవిత్వానికింకా మాకలు మిగిలాయంటే అవి లక్షలాది పాఠకుల ఆదరాభిమానాలే. కేవలమూ పాఠకుల ఆదరంతోనే కావ్యాలను ప్రచురిస్తున్న కాళోజీ సాహసం కొనియాడదగింది. అభ్యుదయ వ్యామోహమున్న ప్రతివారూ చదువదగింది.

—'రామమోహనరాయ్'.

Printed & Published For Nageswara Rao Estates (Private) Ltd., by Radhakrishna
The Andhra Patrika Press 6 & 7, Thambu Chetty Street, Madras-1.
Editor : S. Sambhu Prasad

Bharati January 7 th 1967 Regd No. M. 1856.